TEXT LIGHT WITHIN THE BOOK ONLY

UNIVERSAL LIBRARY
OU_204432
UNIVERSAL LIBRARY

శ్రీ

# మాలతి.

ఇది

కాకినాడలో, శ్రీ పీఠపురము రాజుగారి కలీజియందు

ప్రొఫెసర్

గుత్తిభాస్కర రామచంద్రరావు, బి. ఏ. యఫ్. టి. యస్‌గారిచే


రచితము.

కాకినాడ సుజనరంజనీ ముద్రాక్షరశాలయందు
పోతాప్రగడ బ్రహ్మానందరావుగారిచే
ముద్రితము.

1909

# శుద్ధపత్రిక

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 5 | 1 | [illegible] | నాటకము |
| ,, | 13 | లేమనందురు | లేమందురు |
| 7 | 10 | దూల | తూల |
| 8 | 15 | ప్రాప్తుడునగు | ప్రాప్తుఁడును |
| 15 | 4 | ఖలలనుఁగట్టి | ఖలలనుగట్టి |
| 32 | 24 | మల్లికా | మాలతీ |
| 39 | 17 | సచేత | ప్రచేతన |
| 49 | 19 | వద్ద | నొద్ద |
| 50 | 24 | వద్ద | యొద్ద |
| 51 | 2 | యాడ | నాడ |
| 53 | 21 | ఘాతకా | ఘాతుకా |
| 54 | 16 | వాఁడు | దేవా |
| 68 | 13 | పంధుఁడు | ఫంధి |
| 74 | 18 | ఎందుకే | వేటికే |
| 78 | 2 | యుండి | యుంపి |
| 83 | 9 | నిటుల | నిట్టుల |
| 84 | 25 | కూళుఁడు | కూళ్ఁడు |
| 94 | 13 | మూా | మా |
| 94 | 15 | అలరఁజూపె | అలరుఁజూపె |



MR. G. B RAMACHANDRA RAO, B.A , F T S.

# పీఠిక.

ఈనాటకము కల్పితకథగలది. వ్యంగ్యప్రధానమగుటచేత నావ్యంగ్యము శ్రీమద్రామాయణముగా స్ఫురించుచున్నది. ధ్వనిప్రధానమగుటచే నిది యుత్తమగ్రంథమని ప్రశంసింపఁదగియున్నది. అది యెట్లన్న, ఇందుం గథానాయకుఁడు కోసలదేశాధిపతి, చక్రవర్తి సుమనోభిరాముఁడు "నామైకదేశే నామగ్రహణ" మను న్యాయముచే రాముఁడేయని గ్రహింపందగు. సుమనశ్శబ్దము మాలతీ (జాజీ) వాచకమగుటచేఁ గథానాయికకు మాలతియని పేరిడఁబడియె. మఱి యామాలతి వసుమతీసుతయగుటచే భూపుత్త్రియైన సీతయని స్ఫురించును. వసుమతీభర్తయైన వసువర్మ జనకరాజని యెన్నఁదగియుండెడు. సుమనోభిరామునితల్లి ప్రభావతి ప్రసిద్ధురాలైన కౌసల్యయని తోఁచెడు. కథానాయకునియొక్క మేనమామ వీరసేనుఁడు వానరసేనాపతియైన సుగ్రీవుఁడని కనుపట్టు. భల్లూకభట్టు జాంబవంతుఁడని పొడకట్టు. రామాయణమున హనుమంతుఁడువోలె నిందు జాంబవంతుఁడు ముఖ్యుఁడుఁగ భావింపఁబడెనని స్ఫురించు. గురువు కౌశికుఁడు విశ్వామిత్రుఁడనుటస్పష్టము. మాలతిమేనమామకొడుకైన భీమవర్మయు, దొంగలతేఁడగు దుష్టబుద్ధియు, మాలతీస్వయంవరమున ధనుర్విద్యాపరీక్షయందుఁ బరాజితులైనవారు. మఱియు దుష్టబుద్ధి రావణుఁడనియు, భీమవర్మ మారీచుఁడనియుం దోఁచును. వృషుఁడు విభీషణుఁడనియు, నర్మద త్రిజటయనియు నగపడును. కథానాయకుఁడు సన్న్యాసివేషమును దాల్చెననుటచే రాముఁడు ఋషివేషమును ధరించెననుట స్ఫురించును. వనమన నడవియు జలమునగుటచే నిక్కడ సుమనోభిరాముఁడు వనసంచరణమును వ

నధి (సముద్రి) తరణముసుం జేసెననుట తో(చును. ఇక్కడ మాలతీను మనోభిరామ వివాహమహోత్సవమే అక్కడ శ్రీరామవివాహ పట్టాభి షేకమహోత్సవముగా నెన్నఁబడినట్లు పొడకట్టు ఈ రూపకము వివాహమంగళము తుదఁగలది కాఁబట్టి సంతోషపరిణామమని ప్రశంసింపఁ దగియున్నది. మఱి శ్రీమద్రామాయణధ్వని ప్రధానమగుటచే « సంతతి సంపద్రామాయణతః" అని యుంపు సభియుక్తోక్తి ననుసరించి యీ కృతి యైహికాముష్మికసుఖప్రదమనుటయేగాక, మోక్షఫలప్రదముగాఁగూడ నెనుగానగు సర్వోత్తమమని సర్వసుమనులచేతం బేర్కొనం బడుచున్నది.

ఈరూపకము శ్రీమద్రామాయణకథయే ధ్వనిగాఁ గలదగుటచేత నిందలి గ్రాహ్యాంశములు వేఱుగా వక్కాణింపనక్కఱలేదు. ఐనను ఈనాటకమందలి గ్రాహ్యాంశము లెల్లరకు వెల్లడిఁజేయుట యుక్తాలము న మిక్కిలి దగియుండుటచేతఁ దద్విషయము లిక్కడ నొక్కింత వక్కాణింపఁబడియె.

1. కన్యకు యుక్తవయస్సువచ్చినపిమ్మటనే వివాహము కర్తవ్యమనుట.

2. కులగోత్రములు దగియున్నను బాంధవ్యము నెక్కొనియున్నను, ధనసమృద్ధియున్నను, వరునికి సుగుణసంపదయు స్వశక్తి లేనప్పుడును, అట్టి వరునికాకన్యకకుం బెండ్లిచేయఁదగదనుట. కన్యకావిక్రయము గావింపఁగూడదనుట.

3. రాజు లెంతశక్తిమంతులైనను, ఎంతటి మతిమంతులైనను' మంత్రుల యాలోచనతోనే కృతకృత్యులు గావలయుననుట.

4. ప్రజలు ప్రభుభక్తిపురస్కృత సత్ప్రవర్తనచేతనే కృతార్థులుగాఁగలరనుట.

5. ఎంతటి సన్నిహితబంధువులలోనైనను, అయోగ్యులు స్వప్రయోజనైకపరులై, యందువలనఁ గృతఘ్నులై మోసకారులై మీఁదుమిక్కిలి తమవారికే యెన్నని హానులఁ గలిగించి పొగిలించెదరు. గాన, మానవులు దమబంధువులయందైనఁ దద్వ్యాపారముల నారయక యుపేక్షించి యుండఁగూడదనుట.

6. దుష్టులు దుష్టులతోనే చేరుదురుగాని శిష్టులతోఁ జేరనేరరు. కాఁబట్టి దుష్టసావాసముగలవారికి దుష్టులనియే యెంచఁదగుననుట మఱి వారిలో నుండువారొకరికొకరు కీడుచేయుచుం దుదకు దమరుం గుందు బొందుదురనుట.

7. ఎంతటి గొప్పవారైనను విఱ్ఱవీఁగక కాలోచితముగ వినీతవర్తనులై మెలఁగవలయుననుట.

8. నిజమైన నెయ్యుఁడొకఁడున్న నెట్టి యిక్కట్టులనైనను దొలఁచికొని సుగ మెనయవచ్చుననుట. ఆపత్కాలమునం దుపకరించువాఁడే మిత్రుఁడును ఆపద్బాంధవుఁడని యెన్నఁదగుననుట.

9. ధీరుఁడు దనకెన్ని యిడుములుదొడరినను దనధైర్యమును మానక దిటపూని యోపికతో నాపదలఁగడచి సంపద లనుభవించుఁగాన మానవుఁడెన్నఁడును ధైర్యము ను గోలుపోవరాదనుట.

10. స్త్రీసదాసుచరిత్రయగుటచేతనే తాను మానవతియని పేరొందుటయేకాక, తనపుట్టినింటికిని, మెట్టినింటికిని, గౌరవాధిక్యముఁ గలిగించి వెలయించుననుట.

11. మోసముచేసిన నది యేనాటికైనను బయలుపడి యగడు గుడుపక మానదుగాన మోసముచేయరాదనుట.

12. దుష్టబుద్ధి నికృష్టవ్యాపారములఁజేసి కష్టముజెందుట స్పష్ట మనుట.

13. శిష్టులు కర్మవశమున నానాకష్టములు జెందినను తమ సుచరిత్రముచే భగవదనుగ్రహంబునం బహుసుఖంబులం బడయుదురుగావున నెట్టివంటిసంకటములందైనను మానవులు తమధర్మమును మానరాదనుట. ఇంక నీగ్రంథమందు గ్రాహ్యములైన హితాంశములు మంజూషయందు మణిభూషణములవలె నెన్నే నున్నవి. ఈ కృతినాయిక వసుమతీసుతయఁట! ఈకృతియు మాలతియఁట! గుణరత్ననిధియని యెన్నఁదగకున్నె?

మహామహోపాధ్యాయ
కొక్కొండ వేంకటరత్నశర్మ

# కథాసంగ్రహము.

వసువర్మ మాళవదేశమునకు రాజు. ఆయనరాణి వసుమతి. మంత్రి సుమతి. వీరు మువ్వురును రాజపుత్రికయగు మాలతిని, కోసలదేశాధిపతి యైన సుమనోభిరామచక్రవర్తికి నిచ్చి పెండ్లిచేయుటకుఁ దలఁచియుండిరి. అందువల్ల వసువర్మయొక్క మేనల్లుఁడైన భీమవర్మ, మాలతి తనకు లభింపదన్న యెన్నికచేఁ దనకుఁ బరిచితుఁడైన దుష్టబుద్ధియను దొంగలరాయని ప్రేరింప వాఁడు మాలతిని వంచనచే హరించి యడవిలోఁ గొనిపోవుచుండ, సుమనోభిరాముని మేనమామయైన వీరసేనుఁడు వేఁటకైవచ్చి మాలతిని విడిపించి, తన సోదరియగు ప్రభావతీదేవికడకుం బనిచెను. ఆకాలమున నాకడ నాకస్మికముగాఁ దోఁటలో మాలతీసుమనోభిరాములకు సందర్శనము సంఘటిల్లి వారికిఁ బరస్పరానురాగ మంకురించెను. అంతట భీమవర్మ వసువర్మకుఁ బుత్రికావియోగము వలన వ్యాధి సంభవించెననియు, బ్రతుకుట కష్టమనియు, నందువల్ల మాలతిం బిలుచుకొనిరమ్మని తన్నంపెననియుం జెప్పి మాలతి నపహరించుకొనిపోఁగా మాలతియం దనురాగముగల దుష్టబుద్ధి తనదుర్గమం దామెను తన యిష్టురాలగు నర్మదవశమునం దునిచి. యామాలతి యాఱునెలలలో తన్ను వరింపనియెడల బలిమిఁ బట్టుదునని కట్టుదిట్టము చేసెను. తరువాత దుష్టబుద్ధి భీమవర్మను గారాగారములోనుంచి, మాలతి భీమవర్మయం దనురాగముగలది గాదనియు సుమనోభిరామునియందే సానురాగయనియు నర్మదవలన నెఱిఁగి, భీమవర్మను వదలెను. అనంతర మాభీమవర్మ తన యయోగ్య కృత్యములఁ దెలిసి వైరాగ్యముఁ జెంది యడవులందుఁ దిరుగుచుండెను. అక్కడ సుమనోభిరాముఁడు తన నర్మసఖుఁడైన భల్లూకభట్టును వెంటఁబెట్టుకొని సన్యాసివేషముతో మాలతిని వెదకుచు వచ్చి భీమవర్మవలన సర్వవృత్తాంతముం దెలిసికొని, వానికభయమిచ్చి మాలతీక్షేమవార్త నామెతల్లిదండ్రుల కెఱిఁగింపఁ దనమంత్రి సుమంత్రికిఁ దెలిపి వీరసేనుని సపరివారునిఁగా బిలుచుకొనిరమ్మని పంపెను. ఇక్కడ సుమనోభిరాముఁడు నర్మద తోడ్పాటుచే మాలతిని జూచి ధైర్యము జెప్పుచుండి యంతలో దుష్టబుద్ధిచేత భల్లూకభట్టు దొరకెనని విని చప్పున నచ్చటికిఁ బోయి దుష్టబుద్ధిం జంపి వాని సర్వస్వమును నర్మద కొడుకైన వృషున కిచ్చెను. ఆసమయమున సపరివారముగా వీరసేనుఁడును, భీమవర్మయు, ప్రభావతీదేవిం దోడ్కొని యచ్చటికి వచ్చిరి. మఱియొక ప్రక్కనుండి మాలతి తల్లిదండ్రులును వచ్చిరి. అంతట మాలతికిని సుమనోభిరామునికిని వివాహము జరిగెను.

శ్రీ

# మాలతి.

---

నాంది

మ. సిరి లేనవ్వుల మోముదమ్మి గులుకం జెల్వంపువాల్చూపులన్
సరసన్ స్వర్ణ స్పురికింప దోసిళుల సేసల్సల్లఁ బుణ్యాంగనల్
వరుసన్ దీవులు స్వస్తిఁ జెప్పఁగ ద్విజవ్రాతంబు శ్రీరాముఁ డీ
పురి మత్తేభము నెక్కి వచ్చె నదె మాపున్నెంబు లింపొందఁగా.

(నాంద్యంతమున సూత్రధారుఁడు పుష్పాంజలినిజల్లి)

ఔరా! ఏమిది? ఇంకను నటిరాకయున్నది. కారణము? (కొంతయాలోచన నభినయించి) కారణమా? యువతిజనసాధారణమే.

చ. కురులను దువ్వి దువ్వి నెఱిగొప్ప నమర్చి యమర్చి కుంకుమం
బరయుచు దిద్ది దిద్ది మొగ మద్దమునంగని రుద్ది రుద్ది సుం
దరు లెటఁ బోవఁ గోరినను తాము సమయమ్ము నెఱుంగలేరు పో
సరి సరి బోంట్ల నమ్మఁ గొనసాగిన కార్యము లుండునే ధరన్.

నటీప్రవేశము.

నటి—నాథా! ఇదే జోహారు.

సూత్ర—ఓసీ! పూజ్యులగు సభాసదులు వేచియుండుట యెఱుఁగవా?

నటి—(సభ్యులంగని) ఆర్యులారా! మన్నింపుఁడు.

సూ—చ. కవిబుధచంద్రు లొక్కెడ సుఖస్థితులై కన రాజ్యపూజ్య గౌ
రవరుచి మించి మించదె పురంధ్రి

నటి— అదెంతటికార్య మార్య!

సూత్ర—నీనవరసకౌశలాభినయ నాట్యచమత్కృతిఁ జూడవచ్చి రీ
ప్రవిమలమానసు లుత్కృతభాగ్యము గాక మఱేమి?

నటి— యుక్తమే.

సూత్ర—కావున నిమ్మహామహులు హర్షంబుఁ గొందనదియు మనకుఁ గనకవర్షం
బు. ఇంతయకాదు. వీరి సన్నిధానమే సన్నిధానము.

గీ. తమము నడఁగించుఁ గడు నుపశమనుఁ బెంచు
కర్మలతఁ ద్రెంచు సుజ్ఞానకళను నించు
సుఖము నెసగించు స్థైర్యవిస్ఫూర్తి మించుఁ
బూజ్యభాషణములె దివ్యభూషణములు.

మఱియును,

గీ. అనుభవజ్ఞానసంశ్రయ మజ్ఞుల కిలఁ
బరగఁ దైయూత తెలివికిఁ బట్టుఁగొమ్మ
గుణపరీక్షణనికషంబు కోమలాంగి
యిట్టిసభ మెప్పు జగముల నెల్లఁ గప్పు.

నటి—మీరు వ్రాక్రుచ్చినది నిక్కమే; కాని, దేశకాలపాత్రక్రియాభేదంబుల
ననుసరించి మనోధర్మంబులు భిన్నభిన్నంబు లగుచుండ నందఱ నలరింప
మాటలా?

సూత్ర—అటులనుటేల?

చ. సురుచిరయుక్తియుక్తమృదుసూక్తులఁ గొందఱు శ్లేషఁ గొందఱున్
సరసపదక్రమస్ఫురణచాతురిఁ గొందఱు శయ్యఁ గొందఱున్
గురులసదర్థవైఖరులఁ గొందఱు నందఱు నాక్రపెట్టునం
ధర నలరించు నార కవితావనితామణి దా వరించినన్

నటి—అట్టికవి యిక్కాలంబున నెట్లు ఘటిల్లు ?
సూత్ర—మగువా ! నీకుంగూడ నిట్టి భ్రాంతియా ? అక్కటా ! సారగ్రాహులరుదు కదా !

ఉ. కాలము గౌరవప్రదము కావ్యరసజ్ఞత లేనివారికిన్
హాలహలాకృతు ల్గృతులు నాధునికంబు లఁటన్నమాత్ర ని
క్కాల మతిక్రమింప నవ కావ్యమ యౌఁగద యాదికావ్య మం
చేల తలంపరాదు గణుతింప విచిత్రము నీదువాక్యముల్.

నెలఁతా ! పౌరాణికంబులైననేమి యాధునికంబులైననేమి రసజ్ఞులుదిదృక్షువులుగా నుండిన అసారంబులని యెన్నఁబడిన కావ్యములు నయిత మొక్కెడ సారవంతములై చెలంగు.

గీ. నెరసులున్నఁ గొన్ని నిరసింపరు రసజ్ఞు
లరసి రసముఁదీసి యనుభవింత్రు
పంకజాతమిద్ధి పనియేమియని తేఁటి
పోనె ? పూని తేనె లానుఁగాని.

నటి—ఆర్యపుత్రా ! భవితవ్య మేమి ?
సూత్ర—కాంతా ! పురాణకథాప్రధాననాటకంబులు చర్వితచర్వణంబులవుటనవి యిప్పు డభిరుచింపవు.
నటి—అవి యభిరుచింపవు. కల్పితకథాప్రధాననాటకములుం జెక్కు లిప్పటివి కానరావు.
సూత్ర—చాలు ఊరకుండుము "మాలతి" యను నాటకముజ్ఞప్తికిరాలేదా?
నటి—ఏమేమి ? మాలతియా ? ఎందులోనిది ? కవి యెవడు ?
సూత్ర—ఎందులోనిదన్నం దనలోనిదే. కవియన్నను

గీ. సతత పంచాక్షరీమంత్ర జపగరిష్ఠుఁ
డలరు శ్రీరామకృష్ణార్యుఁ డతనిసుతుఁడు
రామచంద్రుఁడు జానకీరామఁగూడి
వన్నెఁగాంచదె భాస్కరాన్వయము చెలఁగ.

మఱియు నతనికి

ఉ. వేంకటలక్ష్మమాంబ గుణవిశ్రుత సాధుచరిత్ర తల్లి; ని
శ్శంకదయార్ద్రచిత్తు లనుజన్ములు సుబ్బయ, సింగయార్యులున్,
వేంకటరామశర్మయను వేత్తయు; నందఱ కగ్రజాత యే
వంకరలేని భవ్యగుణబంధుర వేంకటసుబ్బమాంబయా.

కబ్బంబన్ననో మృదుమధుర సమయోచితరసాలశాలమై రసాలఫలంబుచెలువున మాధవానుగ్రహపాత్రముగా నుండు నదె కనుంగొనుము.

చ. నెలకొని మావికెంజిగురునీడల జోడుగఁ బాటఁబాడు కో
యిల లవె కాయ పిందియల నేర్పడ ముక్కులనొక్కి చల్లు రా
జిలుకలఁ జూడు పూఁబొదలఁ జిప్పిలు తేనియ లాని తేంట్లు పె
ల్లలరెడు గాంచు మౌర తరమా వరమాధవు నెన్నఁ జాతురిన్.

నటి—ఇటు గనుంగొనుఁడు.

చ. మగఁటిమి మారునాజ్ఞఁగొని మాధవుఁ డొయ్యనఁగన్నుఁగీఁటఁ దాఁ
బొగరునఁ బూలఁ జుట్టికొని పొంగుచు నార్చి మధుప్రతాళి ము
జ్జగముల జైత్రయాత్ర నెసఁ జాటఁగ నంతట మేలుకాంచి కెం
జిగురులబాకు లూని జగజెట్టుఁగఁ జెట్టు చెలంగె నల్లైసన్.

(తెరలో కలకలము)

సూత్రి—నిలు నిలు మాళవపతియగు వసువర్మమహారాజుగారు దేవియగు వసుమతీదేవింగూడి మంత్రిశాలకు వచ్చుచున్నవారు. మనమిచ్చటనుంట యనుచితము. క్రొమ్మా! రయమ్మున రమ్ము. పోవుదము.

ఇది ప్రస్తావన.

# మాలతీ—నాటిక.

## ప్రథమాంకము

### రంగము

(మాళవదేశములో ఉజ్జయినీనగరియందు మంత్రశాల అందు వసువర్మ, వసుమతీదేవి, మంత్రి సునీతియు ననువారి ప్రవేశము)

వసు— సునీతిశర్మా! ఇఁక నీయభిప్రాయ మెట్టిది?

సునీ— ఏలికా! కన్నవారలకు బిడ్డలందుఁ గల మక్కువ మాబోంట్ల నిట్లడిగింపుచున్నది. కాని, మీ రెఱుఁగని దిందేమున్నది. మీయన్నముఁ దినుచున్న మాకు భావ్యమని తోఁచిన సంగతి మీరడుగకున్నను విన్నవింపవలసినది సచివధర్మమే కదా! వరునియం దరయదగిన యంశములు, విద్య, సాంప్రదాయము, వివేకము, ఆరోగ్యము. ప్రాయము, అట్లుగాక డబ్బుకలవాఁడనియు, సన్నిహితసంబంధ మనియు, రాకపోకలకు వీలుగ నుండుననియు, నాలోచించి విపరీతవర్తనునికిఁ గన్యకం గట్టిన వివేకులేమందురు? కావున, నీభీమవర్మసంబంధ మంతయుక్తముగాఁ గన్పట్టదు. మేనఱికమునంబట్టి మీ నీడను మహారాజుకొడుకువలె మనుచుండి నెమ్మదినుంట మాని దుష్టులఁ ద్రాగుఁబోతులఁ జూదరులం గూడి త్రిమ్మరియై తిరుగుచుండు ఇతఁ డెక్కడ మన మాలతి యెక్కడ "నక్కయెడ నాకలోక మెడ" యుక్తాయుక్తంబులించుకయైన విచారింపవలదా! వినయసౌశీల్యాది గుణసముద్ర యగు మాలతి నీతనికింగట్టిన "కాకిముక్కునకుం దొండపండు గట్టినట్టుండు"

వసుమతి— మంత్రివరా! నిజముఁ జెప్పితివి. లోకములో సామాన్యముగా నింగితజ్ఞులగు మంత్రులు ధర్మబద్ధులుగాక ముఖప్రీతివచనము లాడి స్వోదరపూరణపరాయణులై యుందురు కాని నీవంటివా రుండు టరుదు.

వసు—ఇంతకు మనమాలతియభిప్రాయ మెట్టిదో? ప్రాప్తవయస్కయగు బాలికవిషయమున మనము వరునియొక్క కేవల కులశీలముల విచారింపఁదగినవారమే కదా?

వసుమ—ఔను. "శంఖమునఁ బోసినఁగాని తీర్థము కానేరదు." మన మాలతిని సుమనోభిరామచక్రవర్తికిం గూర్చిన,

సునీతి—మాణిక్యంబును బంగరుఁ బట్టినట్లుండు.

వసు—మీరు "స్వర్గమునకు సోపానములఁ గట్టుచున్నారు" రాజరాజగు సుమనోభిరాముఁ డేడ మనమేడ "వియ్యమునకుఁ గయ్యమునకు నెయ్యమునకు సమతవలయు" నని వినమా? "అందనిమ్రానిపండ్ల కఱ్ఱు సాపనేల?" అట్టిభాగ్యము మనకు లభించిన "పిచ్చుకుంటిపై భాగీరథివచ్చినట్లుండదా?"

సునీతి—రాజన్యమాన్యా! మనమాలతి సామనస్సామ్రాజ్యపద ప్రాప్తికైనం దగునన, భూపతులెంతవారు వాత్సల్యాతిశయమున మీ రెఱుంగరు కాని, నిష్కళంక క్షత్రియకులసంభూతులగు మీకాచింత యేల సుమనోభిరాముఁడు మాత్ర మున్నట్టుండి మింటనుండి యూడి పడెనా?

వసు—సచివోత్తమా! ఇందులో నెన్నియో చిక్కులుకలవు.

వసుమ—కన్యకనిమ్మని వారైవచ్చిన నుచితముగా నుండును కాని, మనమే ముందుపడు టెట్టిది ఒకవేళ వారు మా కక్కర లేదన్న-

వసు—అదియే నేనాలోచింపుచుంటిని.

సునీతి—రాజోత్తమా? "ముంజేతికంకణమున కద్దమేల?" క్షత్రియులకు స్వయంవరవిధి విహితమే కదా. ఇట్లని యాచక్రవర్తికి లేఖ నంపినం బౌరుషహాని యెట్లు?

వసుమ—బాగు బాగు సమయస్ఫూర్తి యిట్లుండవలదా?

వసు—మంత్రీ! తక్కిన కార్యభాగము లన్నియు నీయందు నునిచితిని ఔచిత్యంబుం బర్యాలోచింపుము. పొమ్ము. మేమును మాలతిం గని యింగిత మెఱింగెదము. దేవీ! రమ్ము.

(నిష్క్రమింతురు)

## 2 వ రంగము.

### కోసలమున రాజగృహము.

(ప్రభావతి- రాజమాత, కుశల- సఖి, కౌశికుఁడు- ఆచార్యుఁడు
ప్రవేశము)

ప్రభా— గురువరా ! ఆశలు వీచీతరంగన్యాయము ననుసరించి బ్రదికినన్నిదినములు ప్రాణుల బాధింపుచుండును

గీ. ధనము దారయుఁ బుత్త్రుండు ననెడు పురులు
మూడు పెనవేసి సెలగోల త్రాడుఁ జేసి
ఆసమది వారువమును నా యాసగతుల
దోలు నెడలేక జీవుఁడు దూల వెతలఁ.

గీ. వయసు దాఁటినకొలఁది నిం ద్రియములోలిఁ
జేవచెడి మాయుఁ బూర్వంపుఁ జేష్ట లుడిగి.
తృష్ణ యటుగాక తారుణ్య తీవ్రదశను
గనును బలి యజ్ఞశాల వా మనునిభంగి.

కౌశి— అమ్మా ! అనేకజన్మవాసనాపరికల్పిత మగు సంసారచక్రలక్షణమే యిట్టిది. ఈసంసృతివృక్షమున కాశయే మూలము. మధ్యాహ్నదరిద్రులు జీవనాధారము సిద్ధించినఁ జాలునందురు. అదిలభించిన, నైశ్వర్యసంపన్నులైనం బాగుండు నందురు. అదియు నొనఁగూడఁ బ్రభుత్వమునకు, డాంభికములైన బిరుదులకు నేకారుదురు. పుత్త్రులం బడసి వైరాగ్య మూనెద మని కొందఱు దలంచి వారుదయించిన నుపనయనవివాహాది క్రియలం బరిపూర్తిఁగాఁ జెందించి యట్లు గావించెద మనియు. పౌత్త్రముఖావలోకముఁ జేసి సన్యసించెద మనియు నెండమావులందు జలభ్రాంతిచే దారికి దూరగులగు బాటసారులకైవడి జలబుద్బుదప్రాయమగు నాయువుం దిరమ్మని నమ్మి యంధపరంపరాన్యాయమున మృత్యువునోటం బడుచుందురు. ఇది లోకవైచిత్ర్యము.

కుశల— విదితవేదితవ్యులగు తమవంటివారి కానిబ్బరము కల్గుంగాని సామాన్యులగు మాకెట్లు సాధ్యము ?
ప్రభా— అందులో క్షత్త్రియులకు.

ఆ. రత్నఖచితమకుట రాజితమూర్ధంబు
చూడ మేడివండు సొబగుమీఱు
లెక్కలేనివగలు పెక్కులు లోలోన
చెప్పవేయనీక చొప్పుచుండు.

కాశి— కాని, స్త్రీలకు మీ కా విచారమేల ?
ప్రభా— "స్త్రీమూల మిదం జగత్త" ని మీబోంటియభిజ్ఞు లనుచుందురు కదా.

ఆ. పెక్కువగపులనెడు పెనుబాములం గల
మొగలిచెట్టై చుమ్మ యొగి జగంబు
దీనిమూల మయిన స్త్రీ దుఃఖరూపంబ
వేపవిత్తు చూత వృక్ష మగునె.

ఇంతేల ? మంచిచెడ్డ లనుభవించితిని. తుల లేనిసిరుల నోలలాడితిని. అధికారగౌరవములం గల్గి చక్రవర్తిపదప్రాప్తుడ నగు ప్రాప్తయావనుఁడైన తనయుంబడసితిని. ఇఁక నైన నివృత్తిమార్గ మాలోచించుకొంద మన్నఁ బుత్త్రి ని వివాహప్రతిబంధము సైంధవుఁడై యడ్డుపడినది. నా మేనకోడలగు నిందిర నిచ్చి వివాహము చేయింపవలసినదని దానితండ్రి వీరసేనుఁడు బ్రతిమాలుచున్నాఁడు. నాకును తోఁడబుట్టు వొక్కఁడే. ఏకపుత్త్రివిషయమున నంతమాత్రమే నియ్యకొనకుండినం బుట్టినింటిసంబంధ మింతటితోఁ దీఱునుగదా. సుమనోభిరాముఁడు కన్యక కీడుచాలదు. నాకక్కఱ లేదనుచున్నవాఁడు. వివేకి యగుకొడుకుతో నే నేమని ముచ్చటింతును. "ముందర నూయి వెనుక గోయి" ఈధర్మసందేహము నాయెముకనంటి బాధించుచున్నది. తా మెట్లో చెప్పి నాతనయు నొడంబఱచిన బాగు. నాకుమారుఁ డరుగుదెంచు వేళ యైనది. మేము వెడలెదము.

కాశి— నాకును ఆహ్నికావసరముగా నున్నది. వెళ్ళెదను.

(నిష్క్రమింతురు)

## 3 వ రంగము- వింధ్యాటవి.

### భీమవర్మ ప్రవేశము.

భీమ—ఔరా! ఈమాళవుని కింత పోతరమా? మేనమామ యని యిన్నాళ్ళూరకుంటిని. ఇఁక నేనా, వీఁడు కన్యక నిచ్చిన నెంత? యియ్యకున్న నెంత? నా సామర్థ్యము నెఱుఁగడు. మాలతిస్వయంవర మెట్లు తెల్లవాఱునో నేఁజూడక పోదునా? నేలఁ బెట్టి కాల రాచెదను. నాయిష్టుఁడైన దుష్టబుద్ధికి ధూపము వేసెదను. వానికిట్టి కార్యములు నీరు ద్రాగినట్టు. చిటికెలోనట్టి కార్యమైన నెఱవేర్పఁగలఁడు. నేనా దొంగల రాయనింజూచివచ్చెద. (నిష్క్రమించును)

(దుష్టబుద్ధి- పరిచరులగుదొంగలతోఁ బ్రవేశము).

దొంగలు —హాయి. హరిహరసురలకభేద్యంబుల్, హరికరిశరభగణాఢ్యంబుల్
పరమరహస్యము లగుమననెలవులు, పరికింపఁగ దుస్సాధంబుల్
అరిమురి వనతరు లరుదారఁగ, ఖరకరకిరణము లెట దూరఁగ
తెరువు లొసంగక తిరమగుచీఁకటి, తరువులతెరగున చెలువారఁగ
తెరువరు లెఱుఁగక యిట రాఁగఁ, బరువు వారలది విడిపోఁగఁ
మఱి వైతరణిం దాటుట కనఁగఁ, మరణము శరణం బగు వేగఁ.

దుష్ట— మిత్రులారా! మీ కాచింతయేల? సుమనోభిరాముఁడు కాఁడుకదా? మూఁడుకన్నులవాఁడగుఁగాక. నిన్న మొన్నటి రాచబిడ్డఁడా నన్నుఁ జికిత్సించుకొనుట. ఇయ్యడవులంజొచ్చిన యదృష్టహీనుఁడఱచేతఁ బ్రాణంబులు పట్టుకొని తిరుగవలసియుండును. "హనుమంతునెదుటఁ గుప్పిగంతులా" ఈగుడ్డిబెదరింపులకు బెదరెదననుకొనెనా? గ్రుడ్డువచ్చి పిల్లను వెక్కిరించెనన్నట్లు ఇట్టిదాసరు లెందరైరి.

మ. హరిభల్లూక వరాహ ఖడ్గమహిష వ్యాఘ్రోర్భటీభీకరం
బురువల్మీకనికుంజకీచకశిలా త్యుగ్రప్రకీర్ణంబు ని
ర్భరకాంతార నగాగ్రచుంబితనభో భాగంబు వింధ్యాటవిం
దరమా నన్ జెనకన్ మహాబ్ధి మకరిం దార్కొన్న శ్వానం బెటన్.

౧ దొంగ—ఏలికా! అచ్చక్రవర్తి మనపైకి వచ్చునన్న వార్త నీలివార్త. నే నమ్మను. మనయునికిపట్టును, ఇందుబాటసారులఁ గాళికకుఁ బలిపెట్టువిషయ మిఁకను లోకులకుఁ దెలియదనియె నానమ్మిక.

౨ దొంగ—మననమ్మికల కేమిలే "పిల్లి కన్నులు మూసికొని పాలు ద్రావుచుఁ దన్నెవరును జూడలేదనుకొనుచున్నది"

౩ దొంగ—తన సామ్రాజ్యమునకుఁ గంటకప్రాయులుగా నున్న మనల నున్మూలింప నాచక్రవర్తి తనమేనమామ వీరసేనుని నియమించినాఁడను గాలివార్త కలదు.

దుష్ట—నుక మనమిప్పు డొడలంతటం గన్నులు కలిగి మెలఁగవలయు. ఇం . తలో వృషుఁడు రానేవచ్చును. అప్పటికిఁగాని కర్తవ్యాంశము తేటఁపడదు.

## భీమవర్మ ప్రవేశము.

భీమ—(తనలో) ఔరా! "చెతకఁబోయినతీఁగ తనకాళ్ళ కేతగులుకొన్నట్లు" దుష్టబుద్ధి యిచ్చట నాకుఁ దటస్థించెను. మంచిది. మంత్రముఁ బ్రయోగించెదను. (ప్రకాశమున) ఓహో! ఇదేమియాశ్చర్యము! మిత్రమా?

దుష్ట—ఏమోయి! భీమవర్మా నేనెవ్వరోయనుకొంటిని.

భీమ—మఱెవ్వరి కింతధైర్యము. ఇతరుఁడైన "వంటయిల్లు కుందేలు చొచ్చినట్లుండదా"

దుష్ట—మేము లోకాభిరామవార్తలు ముచ్చటించుకొనుచుంటిమి. నీవును కాకతాళీయముగా వచ్చితివి. మాళవదేశమునుండి వచ్చితివి కదా! నీకక్కడ మాప్రస్తావమేమైన వినవచ్చెనా?

భీమ—మీప్రస్తావము లేనిదేశము కలదా? దుష్టబుద్ధి కలలో నగపడ గడగడ వడఁకనిధనికుఁడు గలఁడా? వింధ్యాటవికిఁ జుట్టుపట్టుల ముప్పదియామడల ప్రదేశమందు ఆయాదేశముల బాధింపమని మీరు మాటయిచ్చిన నచ్చట చ్చటి ధనికులందఱు గ్రామమున కింతయనియు, సంస్థానాధిపతులు సంస్థానమున కింతయనియుఁ, గప్పము నేటేట మీకు సమర్పించుకొనుటకుఁ గొన్ని యాలోచనలు జరగుచున్నవి. అయిన దానికిఁబ్రతిబంధము గొప్పదొక్క

టి కలదు. ఏమని చెప్పుదును! చెప్పితినా "తా నెక్కిన చెట్టుకొమ్మను తానే నఱుకుకొన్నట్టు లగును." చెప్పనయితినా, మిత్రద్రోహఫలము చేకూఱును.

దుష్ట—భీమవర్మా! చాలింపు నీశ్రీరంగనీతులు. ఉన్నదేమో వెళ్ళఁగ్రక్కు.

భీమ—ముందటికార్యము లెట్లున్నను అడిగినప్పుడు చెప్పక తీఱదుకదా! దీని కంతయు మామేనమామయే మూలము. ఆమాళవుఁడు చోరునితో నిట్టిసంధి క్షత్రియుల కుచితమా? పౌరుషహీనమైన బ్రదుకు బ్రదుకుటకంటె మరణము మానఁగదా యని యుపన్యసించి కొంతమంది రాజన్యుల మనంబులు మరల్చి చక్రవర్తి యగు సుమనోభిరామునితో రాయబారము జరపుచున్నాఁడు.

దుష్ట—మిత్రులారా! మనమనుకొనుచుండిన వార్త కిదియే మూలమగునోపు.

దొంగలు—తప్పదు. తప్పదు.

దుష్ట—(భీమవర్మం గాంచి) కాని, పిమ్మట?

భీమ—తనపుత్రిక నా సుమనోభిరామున కిచ్చునట్లు నిష్కర్షించుకొని యొక స్వయంవరము నిమిత్తమాత్రమునఁ జాటింపించెను.

దుష్ట—అయిన నీపని సున్నయా?

భీమ—నాపనిమాట యెట్లుండినను సుమనోభిరాముఁడును, మాళవుఁడు నాకడ్డైన మీపని యేమగునో విచారించుకొనుఁడీ.

దుష్ట—మీమామ యింతటివాఁడటోయి!

భీమ—శకునికి మేలుబంతిపెట్టినవాఁడు కదా! అతని యాశ కవధిలేదు. ఆకాశమునకు నిచ్చెనను వేయుచుండును.

దుష్ట—అది నిలచిననాఁటికి చూచుకొందము. నాముందర నా వీని తంత్రములు? చూడు నా తిరుమంత్రము. కాని, స్వయంవర మెప్పుడు?

భీమ—ఇఁక రెండు నెలలనాఁటికి. అది కాకుండఁ జేయవలెను. "ఆలస్యాదమృతం విష" మ్మని యుండుంగద? ఆస్వయంవర మిఁక నెన్నిదినములో లేదు.

౧ దొంగ—అది యెట్లు సాధ్యము?

భీమ—కన్యకను మాయము చేయవలెను. (అని చెవిలో)

దుష్ట—అట్లయిన యీభారమంతయు నీదే. నీకుఁదగినపరిచరులఁ దోడుగానిచ్చెదను. నాటికి నేనును వచ్చెదను.

భీమ——సరి ఆలాగే. మీకుమూఁడుదినములుముందుగానే చెప్పి యంపెదను.

దుష్ట—(భటులం గని) మీరిభీమవర్మతో వెళ్ళుఁడు. కత్తిమీఁదసాముజ్ఞప్తియుంచుకొనుఁడు వెళ్ళుఁడు. (అందఱు నిష్క్రమింతురు)

సుమనోభిరామచక్రవర్తి, కౌశికుఁడు, విదూషకుఁడును,

(ప్రవేశించుచున్నారు.)

కౌశి—సార్వభౌమా! సమస్తధర్మములకు మూలము వివాహము. అది పురుషుని యుత్పథప్రవర్తన కంకుశము. పాపకార్యముల కెడమియ్యక దయాదాక్షిణ్యాది సుగుణసంపదల కాలవాలమై ప్రజల కనుబంధ మెక్కుడుగఁ గల్గించును. దురభిమానముం బోగొట్టి సంతునెగడున ఖిలప్రాణులందు సమరసభావ మతిశయిల్లంజేయును. భార్యకర్ధాంగియని ప్రతీతి. దానింజేపట్టినఁగాని పురుషుండు పూర్ణుండుకాఁడు. ఒంటి తెడ్డుచేఁ బడవయు నొంటి ఱెక్కచేఁ బక్షియు నెట్లు తమగమ్యస్థానముం జేరఁజాలవో అవివాహితుఁడు నట్లే తనజన్మయాత్ర నిర్వర్తింపఁజాలఁడు. విషయమిట్లుండ నీ పట్టుదల నాకంత భావ్యముగఁ గన్పట్టదు.

ఆ. చక్రవర్తివగుచు జనులనెమ్మనముల
కనుగుణంబుగాఁగ నవనినేలు
టుడిగిపేదమాట లుచితమేయిటులాడ
బడుగుబాపనయ్య పగిది ఱేఁడ.

సుమ—అంతర్ముఖులగు మీరే యిట్లుసెలవిచ్చిన నేనేమందును! "స్త్రీయంత్యక్త్వా సుఖీభవ" యని మీవంటిప్రాజ్ఞులు పలికిరికదా!

కౌశి—అనఁగా వ్యామోహమును వదలుమనుట. కత్తి యాత్మరక్షణకు నాత్మహత్యకు నుపకరించుభంగి, స్త్రీవిత్తములను రెండు నాత్మహితమునకు నాత్మహానికి నుపయోగించు. పసిబాలునికిం గత్తివలె నవివేకికి స్త్రీవిత్తము లనర్థ

ప్రతిపాదకము లవుంగావున నట్టివాని కావచన ముపదేశింపఁబడెను. వివేకసంపన్నుఁడవగు నీవంటివానినెందఱో కల్పతరువుచందంబున నమ్మి మేఘజలంబులకుఁ జాతకములమాడ్కిఁ బ్రజలు ప్రతీక్షించికొని యున్నవారు.

మ. కులధర్మోచిత శీలరక్షణము లోకుల్మెచ్చఁ జేయఁగావలెన్
నిలుపంగావలె సత్యధర్మములఁ బూనికన్ క్షాత్త్ర మేపార స
త్కులసంజాతను బెండ్లియాడవలెఁ బుత్త్రపౌత్త్రులుంగల్గి భూ
స్థలిఁ బెక్కేఁడులు ధర్మరక్షణకు సంతానంబు నాటన్వలెన్.

విదూ—ఔను. తక్కిన నెట్లుండినను "సంతానంబు నాటన్వలెన్" రాజరాజా, ఇది నీకుదినాటన్వలెన్. ప్రపంచవ్యవహారమున కిదిమూలము. ఇట్లనిక దా, ఎంతకూటిపేదలైనను కానిక్కూళ్ళైనఁ గుడిచి కన్నియం బెండ్లాడుచుందురు. అప్పుడు చావనున్న ముసలివాఁడును పసపుబట్టలలో స్మశానవాటిక నలంకరింపం దలంచును. పశుపక్షి క్రిమికీటసామాన్యమగు నీప్రథమధర్మమునే లోఱంగిన పురుషుఁడు తక్కినవాని కెట్లోపు. "ఇంట గెలిచికదా రచ్చ గెలువవలె."

సుమ—మూర్ఖుఁడా! వివాహమంత చులకనగా భావింపవలదు.

విదూ—ఏమయ్యా? రాజరాజవగు నీకును మాగ్రహచారమేనా? డబ్బుండిన కన్యకల కేమి తలతోనడచిరారా? నాచేతికొకసంచినిమ్ము బెల్లపుసీమనుండి నీవుకోరినపిల్లనెల్లుండికిఁ బట్టితేకుండిన నాముఖావలోకనము సేయవలదు.

కౌశి—అవివేకుఁడా!

చ. పశువులు పాపచిత్తులు కృపారహితాత్ములు పిండవిక్రయుల్
శిశువులఁ గన్నకూనలఁ బ్రసిద్ధముగా వెలకమ్మి సిగ్గులే
కశనము మన్నగాఁ దినుచు హాయిగ నుండుటకంటెఁ జచ్చుటే
కుశలము. కన్నెనమ్మి మనుకుత్సితవర్తను లాత్మవంచకుల్.

ఇట్టి పాపగర్భంబులంబుట్టిన నిర్భాగ్యులం బెండ్లియాడ నధార్మికులుం గేవలపశుక్రియాలంపటులగు చపలచిత్తులకుఁ జెల్లుఁగాని, ధర్మపరిపాలనైకతత్పరుల కనుకూలించునా? ఇంతకును సానచక్రవర్తికిఁ జతుస్సముద్రముద్రిత

సర్వసర్వంసహాభారభరణ ధురీణులగు నృసింహకిశోరంబు లుదయింపవలె నదికావున నకలంక కులశీలంబు లతిముఖ్యములు.

గీ. రూపగుణ లక్షణోపేత లోకమాత
సకలసౌభాగ్యవిఖ్యాత సాధ్విపూత
వంశమునఁ బాలకడలిని పద్మవలెనె
పొడముగా కధమాన్వయమునఁ గలుగునె?

రాజరాజా! మనయిందిరకు మించిన మంచిసంబంధ మగుపడదు.

సుమ—గురువరా! ఎన్నియోధర్మమర్మము లెఱింగినమీకును బొఱపాటులుండునా?

విదూ—కొండయొక్కడ తూనికగుండెక్కడ.

కాశి—ఏమంటివి?

సుమ—ఆమాటకేమికాని, గురువరా! పురుషుని వివాహవిధికెఁ బ్రాయమెట్లు ముఖ్యమో స్త్రీకి నది యట్లేకదా! అతిబాల్యవివాహము లెంతటియ నర్థప్రతిపాదకములై యార్యధర్మముల నడుగంటఁ ద్రొక్కి ముక్కుపచ్చ లాఱని యొందఱుబాలికలబ్రదుకుల నడవిఁగాసిన వెన్నెలలంగావించియుఁ బురుషుల సత్త్వహీనుల నల్పాయుష్కులం జేసియు బ్రపంచమును దుఃఖ సాగరమునముంచవయ్యె? సన్మార్గప్రవర్తకులమగు మనమేయిట్టియక్రమ వర్తనకుం దొరకొనిన సామాన్యుల ననసేల?

విదూ—ఇంతకు ఋణానుబంధ మొకటి గొప్పది. "ఋణానుబంధరూపేణ పశుపత్నీసుతాలయాః" అని యుండెంగద! కొండమీదనుండిననేమి? కడ లియందుండిననేమి? అనుకూలకాలము సమకొన భాగ్యవశమున నెవరికెవ రో ముడిపడుచుందురు. అట్లుకాకుండిన మరుమరువపు మొలకవలె నుండు గుణవంతుఁడగు పతిం గలిగియుఁ గుత్సితవర్తనుఁడునుఁ గురూపుఁడు నగు జాతిభ్రష్టుని స్త్రీయును, గుణరూప వయోవిశేషంబుల లక్ష్మిం దిరస్కరిం చు కులకాంతంబాసి ప్రుచ్చిన గవ్వఁజేయని హీనదాసింగూడి మానాభిమా నంబులువీడి తిరుగుపురుషుఁడు నుండుట జూడమా!

సుమ——నిక్కమే. వలపొకరివశము కాదు.

చ. వలపువిచిత్ర మెప్పుడది వావిరిగల్గునా యెందుఁజొచ్చునో
పిలిచినరాదు పొమ్మనిన వెళ్ళదు తొంటి ఋణానుబంధ శక్తిం
ఖలలనుఁగట్టి దంపతులఁ గర్మవశంబునఁ గూర్చుఁ గొండలన్
మొలచిన నెల్లికాయలు సముద్రపునుప్పును గూడఁ జూడమే.

(తెరలో గంట వాగును)

అదిగో! ఓలగమునకుం బోవువేళయైనది.

కౌశి——నాకును మాధ్యాహ్నికము కొదువగా నున్నది. రాజన్యా! సుఖీభవ.

(అందఱు నిష్క్రమింతురు)



# మాలతీ నాటకము.

## ద్వితీయాంకము.

ప్రథమరంగము —ఉజ్జయినిలో నుద్యానవనము.

మాలతి, (మాళవరాజపుత్త్రిక) కమల, సుచతుర, మదవతి, (సఖులు) ప్రవేశము.

అందఱు —ముదిత. చెలిమిఁ జెలఁగు రసాలసాలము
లెలమి మనకనుకూలముల్

మాలతి— చెలఁగి నిక్కినఁ దాఁకునే

సుచ— పొలఁతి నీతలఁ దాఁకునే

అందఱు— అలరు లలరఁగ నలరువిలుతుం
డలవుఁగాఁ గ్రొమ్ములుకులం

మాలతి— గలికి కొని పై దూఁకునే

సుచ— అలుక నిను దూదేఁకునే

అందఱు— కలసి కలకల రామచిలుకలు
పలుకుఁ దేనియ లొలుకఁ గా

మాలతి— దొలుకు నామద మక్కువన్

సుచ— మెలఁకువగఁ గను ముక్కునం

అందఱు— దలుక నలికులవేణి యొఱ్ఱగ
మలఁగి మలమలలాడెదున్

మాలతి— చలమునన్ మరుఁ డాయుదున్

సుచ— దెలియు నీపని యాయెడన్.

మాలతి— గీతరత్నావళి.

చల్లనితెమ్మెర లెల్లెడఁజల్లిన మల్లెలఁ గనుఁగొను మదవతిరో!

మదవతి—మల్లెలె? మరుశితభల్లములు భళీ! ఝల్లనునెద నటఁ జనకబలా

కమల— చెల్లునె యిటు పసిపిల్లలు కడు భీతిల్లఁగఁ బలుకుటఁ బాడియటే

సుచతుర—(మాలతి కైయిడుకొని)

చెల్లెల, రమ్మ విపల్లవమగు నీ పల్లవరాజముఁ బ్రార్థింపఁగ.

(సఖులు నగుదురు)

మాలతి—హాయరగడ. లలన లల నట నెమలినృత్యము
చెలువ చెలువగు నలువకృత్యము
మదవతి— కొమ్మ కొమ్మఁ గదల్చి పువ్వులఁ
గొమ్మ కొమ్మని దుల్చె దవ్వుల.
కమల— నిక్కి నిక్కియుఁ గొట్టకొనలకు
నెక్క కెక్కకు చెట్ల ననలకు.
సుచ— వెలగ వెలగల దిదిగొ చూడుము
వెలఁది వెలవెలఁ బాఱ వేడుము.
బాల— తెఱవ తెఱ వరికట్టెఁ దుమ్మెద
వెర వెఱుఁగ నిఁకఁ బ్రోవు నమ్మెద.

చెలులారా, రక్షింపుఁడు రక్షింపుఁడు.

మద—ఓకమలా! ఓసుచతురా! రండి [illegible] మనమాలతి నొక పాడుతుమ్మెద తొందఱ పెట్టుచున్నది.

సుచ—ఓ పాడుభృంగమా, తొలఁగు తొలఁగు మా యంగనామణి యనంగుని నారి కాదు.

మాలతి—అమ్మరో! ఇంకను నన్నిది వదల కున్నది.

కమల—నీ ముంగురులం గని భ్రమరకులం బని భ్రమఁ జెందినది.

సుచ—కాదు కాదు మన సఖి ముఖంబును గని కమల మనుకొన్నది.

మద—కొండంత యాసచే పాప మావచ్చిన యళి నీగయ్యాళి యిట్లొక మక

రంద బిందువైన నొసంగక తరిమి వైచి యొడిఁ గట్టుకొన్న పాప మెట్లు పోవును?

సుచ—దీని కింత బ్రహ్మలోచనా? శాస్త్రకర్త లంత విచారశూన్యులా? అతిథి యైన మధువ్రతమున కాతిథ్య మీయని పాపమునకుఁ బ్రాయశ్చిత్తము చక్కఁని రాకొమరు నొక్కఁని వాతెర తేనియ లందనుపుట. ఇది మన మాలతి తలపోసి యే యున్నది.

మాల—చాలుఁ జాలు మీమాటలు. ఓ సుచతురా! ఓకమలా! ఇఁక మీఁద నిట్టులాడిన నే నోర్వను జుఁడీ? చాలుఁ జాలు మీచెలిమి.

సుచ—ఓహో! ఇదేమి చెలీ ఇంతకే యింతకోపమా? ఇంతకు న్మే మన్న దేమి? నీమేలు గోరు వార మగుటంజేసి నీవు గ్రక్కున నొక రాపట్టం జేపట్ట మాకన్నులారఁ జూచు భాగ్యమును బ్రతీక్షించి యంటిమి కాని యందులో మఱే మున్నది?

మద—చెలులారా! మనము వచ్చిన పని యేమి చేయు చున్న దేమి? మీలో మీరిటు తర్కించుకొనుచుండ వసంతపూజావసర మతిక్రమింపకున్నే? కుసుమంబులు సిద్ధముగా నున్నవి రండు రండు.

మాల—అటు చూడుఁ డటు చూడుఁడు! మన కమల యల సహకారమునకుం బూవులఁ బుట్టం దవిలింపఁ బోవు రభసంబునఁ బూలఁ జల్లు కొన్నది.

సుచ—కమల కదా! సహకారసన్నిధిం దన పుష్పవతీత్వముం బ్రకటించెను.

మద—సఖులారా ఇటు రం డిటు రండు. (అందఱు నిష్క్రమింతురు)

భీమవర్మ దుష్టబుద్ధియుఁ గొందఱు దొంగలుం బ్రవేశించుచున్నారు.

భీమ—మీ చాకచక్య మిప్పుడు చూపవలెను. ఏ మాత్ర మవివేకముగా నటించినను పిట్ట లెగిరి పోవును. అందఱు నన్నెఱింగిన వారలగుటచే నేనిచ్చట నుండినఁ బ్రమాదము పొసఁగును. కాన మార్గంబును గని పెట్టి యుండెద.

దుష్ట—మంచిది నీవు వెళ్ళుము (భీమవర్మ నిష్క్రమించును)

చెలికాండ్రారా! వేగిరపడకుఁడు. ఆతురము విషము. అది కార్యకంటకము. మీరాదట్టంబులగు పొదరిండ్లం దాఁగియుండుఁడు. తఱి రా నెఱింగి మీకు

సన్నాఁ జేసెదను అప్పటికి మీపగ్గంబులఁ దెచ్చి కార్యంబు సాధింప నగు.
(దుష్టబుద్ధి దాగును తక్కినవారు నిష్క్రమింతురు)

(మాలతియు సఖులును ప్రవేశించుచున్నారు)

సుచ—మాలతి ఇటు! ఇటు! తిన్నఁగ రమ్మా.

సీ. గోరంట గోరంట గారవించుట లేల, తిలకంబుఁ దిలకింపఁ దిరుగు టేల
చూతంబు చూత మంచొగిఁ జేతు లిడు టేల, గోగుతో మాటల పోగు లేల
పొగడక పొగడ పైఁబుక్కిలింపఁగ నేల, ప్రియప్రియాళువు పాట పేర దేల
సంపెగ సొంపుగఁ జనవిచ్చి కను టేల, పద మశోకము పైకిఁ బఱపు టేల

గీ. వావిలావల నిట్టూర్పు వదల నేల
పొన్న గున్నకు నవ్వులవన్నె లేల
యతివ నామాట జవదాట నవి చిగుర్చుఁ
జిగురు విలాకాఁడొ యవి దూసి చిమ్మఁ జుమ్మ.

దుష్ట—ఔరా చమత్కారము? చక్కఁదన మన్న నిది కదా.

ఉ. ఈ నగుమోము నీ వినయ మీ తరితీఁపుల మాట లీ రవం
బీ నవ మోహనాంగరుచి యీ సరసత్వము ని వ్విలాస మే
చానల కైన నున్నె? విధిచాతురి! వేయన నేల? మారుఁ డే
పూనికిఁ దప్పు దీనిఁ గనఁ; బొల్లులు మానవు లెంత వారిలన్.

మాల—చెలులారా! వారు వారు కోసిన పువ్వుల గుర్తుగా వేఱువేఱుగ నుంచిన బాగుగ నుండదా?

దుష్ట—ఉ. చిత్తజుబొమ్మ దీని నునుఁ జెక్కిలియింపును మోవి కెంపు క్రొ
మ్ముత్తెపుఁ జాలు పల్వరుస మోహపుఁ దీరును మేని సొరుఁ బా
గుత్తుల పొల్పు· దెల్పు బిగి గుబ్బల ఠీవియుఁ గమ్మతావి సం
పత్తిఁ గనుంగొన న్వలపు వడ్డికిఁ బాఱదె యెంతవారికిన్?

ఔరౌర! ఇది యేమి నన్నునే మఱచితిని "అందఱకున్ శకునంబులఁ దెల్పు బల్లి తాఁ దొట్టిలోఁ బడిన" ట్లున్నది. నే వచ్చినపని యేమి, ఇట్లు తామసించు టేమి?

(ఈల వేయును దొంగలు వర్గములతో వచ్చెదరు. చెలికత్తియలు హాహా రవంబులతో మూర్ఛ నొందుదురు. తెరపడును)

సుచ—అక్కటా ఎవ్వరా దుర్మార్గులు?

మద—చెలీ! శోకభయములచే నాగుండెలు తటతటలాడు చున్నవి కొంచె మాగుము.

(మాండవ్యుఁడను విప్రుఁడు ప్రవేశించును)

సుచ—ఎవ్వఁడా దుర్మార్గుఁడు? ఏకాంతమునఁగాంతలు విహరించు స్థల మని పాటింపక మాకాంతామణి పై నక్రమంబు జరపిన దుష్టుఁడా నిలు నిలు నీకుం దగినశాస్తిఁ జేయించెదము.

మాండ—ఇదేటి వింత! తల్లులారా మాలతి యెక్కడ?

సుచ—అయ్యో మాండవ్యా ఇఁక ఎక్కడమాలతి! మా యనుంగుసఖిని మా జీవరత్నమును ఎవరో కొందఱు (అని మూర్ఛిల్లును)

మాండ—హా! హా! హా! ఏమేమి? మాలతిని? కొందఱు-ఏమి? ఇదినిజమా? మన రాజుగా రూహించినది నిక్కమా?

కమల—ఏమి? ఈవిషయము రాజుగా రెఱుంగుదురా?

మాండ—రాజుగారు మన మాలతిపెంచిన హరిణపోతము కన్నీరు నించుచు రాజద్వారమునకువచ్చుట కని యెద్దియో ప్రమాద మొకటి పొసఁగి యుండ నోపుఁ దెలిసికొని రమ్మని నన్నంపిరి. రండి రండి. (తెరపడును)

ద్వితీయ రంగము.

అడవి. భీమవర్మ ప్రవేశించుచున్నాఁడు.

భీమవర్మ—(తనలో) భీమవర్మా! నీపూనికకినపజయమనుమాట కలదా? మంచిది. ఒకప్రకరణముముగిసినది, మఱియొకప్రకరణము. అది దుస్సాధము, దుస్సాధమననేల? బుద్ధిమంతునకు సాధ్యముకాని దెద్ది? తిన్ననిమాటలచే దుష్టబుద్ధిని గవియించి యోఘునకార్యంబుఁ గొనసాగించితి. ఇఁక దుష్టబుద్ధికిఁ గలికెను వేసెదను. కొమ్మలంగన్నంతబమ్మకైనరిమ్మపుట్టక మానదు, కావున వాచమతాక్రమింక మీఁదనున్నది. వానింగలిసికొనెద.

(నిష్క్రమించును)

దుష్టబుద్ధిప్రవేశము

ఆహాహాహాహా! "మనరొట్టె విఱిగి నేతిలోఁ బడినది" "కష్టేఫలీ" యనుచుందురు. భీమవర్మ యచ్చిలుకలకొలికిపైఁ గలవలపున నన్నింతపనికిం బురికొల్పెను. ఈకన్యకకై త్రిలోకపదవి నైనం గోల్పోనొప్పు. మృత్యువునోటం బడి సాధించినయీకన్యక నన్యునిపాల్సేసి నోట వ్రేలుఁ బెట్టుకొని యూరకుండు మూఢుఁ డుండునా? చేతఁ జిక్కిన మానికంబును గోలుపోవ నేనంత వెఱ్ఱినే? ఇఁక నాబారినుండి తప్పింప హరిహరబ్రహ్మాదులేకీభవించినను కానేరదు. అయిన భీమవర్మవలనఁ గాఁదగిన కార్యభాగములు కొన్ని కలవు. కావున సమయోచితప్రవర్తన ముచితమని తోఁచుచున్నది. అదిగో భీమవర్మ వచ్చుచున్నట్లున్నది.

భీమవర్మప్రవేశము.

భీమ—అన్నా దుష్టబుద్ధీ! నిన్ను వేయినోళ్ళం బొగడినఁ దీఱదు. వ్రేలుఁ జూపిన హస్తము మ్రింగఁగలవారిలో నగ్రగణ్యుఁడవు. నిజముగా నాకప్పుడు గుండెలు తటతటలాడుచుండెను. ఇంత సులభముగా నీకార్యము నెఱవేర్పఁ గలవని నేను గలలో నైనం దలంపలేదు. తప్పిదారి నీవిట్లయితివి కాని, బలిచక్రవర్తి యంత చక్రవర్తివి కాఁదగినవాఁడవు. కాకున్నఁ "జూచి రమ్మన్నఁ గాల్చి వచ్చునంతటి యోధవు గావా"? పద్మవ్యూహము నభిమన్యుండువోలె రాజరాజులొడ్డినయుక్తుల నింతలో (చిటికవ్రేయును) దెగనఱుకువాఁ డుండునా? మాలతీస్వయంవరమని చాటించినది మొదలు రెండు చింతలు నన్ను బాధించుచుండెను. అందు మొదటిది ముఖ్యముగా నాప్రాణమిత్రుఁ డగు నీకేగతి యగునోయను చింత. రెండవది, నీకు నేఁ జెప్పనక్కఱలేదు కదా. ఒక్కచోటఁ జన వమరఁ బెరిగిన వారిచెవుల కామాట ములికియై నాటకుండునా? పౌరుషహీనమగు బ్రతుకు బ్రదుకుటకన్న చావు మిన్న యని, యొకటిరెండు పర్యాయము లప్పనికిం దొరకొంటినికాని, కల్పతరువువలె నీవుండుట నామదికిఁ దట్టలేదు. 'బ్రహ్మ తలఁచిన నాయుస్సునకుఁ గొదవా' నీఋణ మెట్లు దీర్చుకొందును.

దుష్టబుద్ధి——భీమవర్మా! నావిషయము నీ వెఱుంగుదువు కదా. నీమాటలు విని నేనింతపనిఁ జేసితిని. భృత్యునోటనుండి యూడిపడ్డట్టాయెను. "అత్తమీఁద కోప మాలిపైఁ జూపించె" నన్నట్టు మాళవునిపైఁ గినుక నీమగువపైఁ జూపితిని. అనదయై మనచేతఁ జిక్కినయబల నింకను వేధించుట యయుక్తము. నిన్నుఁ బెండ్లియాడ నిమ్మదిత యపేక్షించిన నాకది పరమసమ్మతము. కాని యట్టికోరికి యానారికి లేకుండిన నేనాబలవద్వివాహ మంగీకరింపను. నీవా సుదతింగని నీవలపుఁ దెలిపి యామె యనుమతిం బడయుము. ఆమెంగని మాటలాడునపుడు నిర్భయముగా నీయభీష్టముం దెలుపుటకు నాభటు లెవ్వరు నచ్చట నుండకుండ నను వమర్చెదను. (అని ఈలఁగొట్టును)

వృషుఁడను దొంగ ప్రవేశము.

వృషా! వినుము. భీమవర్మ మాలతితోఁ గొంతమాట లాడవలసియున్నది. నీ వితనిం గొని చని మనభటులంతవఱకు నితని నన్నుంబోలె గౌరవించునట్లు చెవినూదుము. తెలసినదా.

వృషుఁడు——చిత్తము.

దుష్టబుద్ధి——భీమవర్మా నీవు వీని వెంటం జనుము, వృషా!·(అని చెవిలో, వృషుఁడు తలనాడించుచు భీమవర్మతోఁ గలసి నిష్క్రమించును)

ఆహాహాహా! "ముసలివానికి మూలుగనేర్పువాఁడా" యీభీమవర్మ. వీఁడు బట్టువలె ననుం బొగడి బుట్టలో వేసికొనం దలంచెను. నాపరిచరులు వీనిం గౌరవించుటం జేసి తనచేటునకు వీఁడె మూలమని యెంచి మాలతి చండాలకూపమువలె వీనిం గాంచి వెతలఁగుందుచుండునెడ వీఁడుకొన్ని ప్రేలాపనలు ప్రేలును. "గోరుచుట్టుపై రోకటిపో" టన్నట్టు మానవతి యగు మాలతి వీనిం గసరినైచును. ఇట్లు వీఁడు తిరస్కృతమనోరథుం డయిన పిదప నాకార్యము సావకాశముగా నెఱవేర్చుకొనవచ్చును.

తెరలో.

మ. అకటా! ఎంతటిదాయనైతివి? విధీ! హా! దైవమా! ఏలయీ
వికటారణ్యముపాలొనర్చితివి? నీవేరంబు చల్లారెనే?
ప్రకటాటోపనిశాటహింసలకు నాప్రారబ్ధ మిట్లుండెనే?
శకటారీ! మొరనాలకింపవె వెసన్ సర్వేశ్వరా! ప్రోవవే.

ఉ. ఓతలితండ్రులార! కనుఁ దోఁచెలులార! వచింపరేల? ముం
జేతవసించిముద్దువగ చిలకాఁగఁ బలుకవదేల, చిలకా? న
న్నీతఱిఁ ద్రోవఁగట్టి నటియింపవదేలనె, కేకి? యక్కటా!
ధాత యిటేలవ్రాసె దయఁదప్పి? పురాకృతమిట్టులుండెనే?

ఓ జనకులారా! ఇఁక నేనెట్లు మిముంజూతును? ఓచెలులారా! నేటికి ఋణానుబంధము తెగెనా? ఓహరిణడింభకమా! ఇఁక నిన్నుఁ బాలించువారెవ్వరు? ఓవకుళమా, నీరుఁగట్టి నిన్ను బోషించువారెవరు? శివ శివా.

దుష్ట—ఇఁక నేనెళ్ళి ప్రచ్ఛన్నుఁడనై యేమియగునో కనిపెట్టెద (నిష్క్రమించును)

(మూర్ఛనొందియున్న మాలతియు, భీమవర్మయు ప్రవేశించుచున్నారు. దుష్టబుద్ధి పొంచివినుచుండును)

భీమ—మాలతిమిపులనాయాసముచే సొమ్మసిల్లినది. మొదట సేదదేర్చెదను (అంతలో మాలతియే మేల్కొని, నలుదెసలఁ గలయంగనుఁగొని)

మాలతి—ఏమిదికలయా? ఉన్మాదమా? చిత్తభ్రమమా? ఇతఁడు బావ భీమవర్మయగునా?

భీమ—మాలతీ, ఊరడిల్లుము, నేను భీమవర్మనే.

మాలతి—బావా, చోరులేమైరి. నాకట్టులెట్లూడెను. నాయవస్థ నీకెవరుచెప్పిరి? నన్నెట్లురక్షింపఁ గల్గితివి. నీఋణమెట్లుతీర్చుకొందును.

భీమ—మాలతీ, నిలుకడఁ దెచ్చికొనుము. ఇచ్చట కార్యవ్యవస్థకవకాశములేదు. ముందంతయుఁ దేఁటపడును. ఎడమచేతఁ జేసినది కుడిచేతననుభవింపకమానదు. ఇదంతయు మామతెచ్చిపెట్టుకొన్నచేటు, బలవద్విరోధము తనకేల? ఎవరెట్లుపాడైననేమి? లోకకంటకుఁడగు దుష్టబుద్ధిని దానుపట్టియిచ్చువాఁడా? వానిపేరన్న నెట్టివారికి సింహస్వప్నముకదా. యుక్తాయుక్తంబు తెఱుంగక యొకవేళవాఁడు నిన్ను తనకిమ్మని మీతండ్రికి సూచించినంతమాత్రాన, సమయోచితవచనములాడి తప్పించుకొనుటకు బదులు మ

న్నమిన్నుఁ గానక చీవాట్లుపెట్టఁగా నిప్పుడు మనకే వాఁడు మేకై కూర్చుండెను.

మాలతి—బావా, ఎవఁడాదుష్టబుద్ధి?

భీమవర్మ—అయ్యో పాపము? నిన్నుఁ జూచిన నాకుజాలివేయుచున్నది. ఆదొంగలదొరపేరన్న లోకులకెల్ల గర్భనిర్భేదముకదా! పాలుద్రావుచున్న శిశువులు సయితము దానివిన్నంద్రావుటమాని యట్లే వినుచుందురు. పసిపిల్లలకు ముసలమ్మలు వానికథలెన్నియో చెప్పి వెఱపించుచుందురు. అదియట్లుండనీ (నలువంకలఁ జూచి) ఎవరు సమీపమందు లేరుకదా. మాలతీ, ఇప్పటికి రమారమి నాలుగేండ్ల క్రిందట నితఁడొకచీఁకటి ప్రొద్దున నడవులంగ్రుమ్మరుచుఁ గానక యొకపాడుగోతిలోఁ బడి పైకి రాలేక వాపోవుచుండ వేటకుతూహలమున నేనుపెందలకడనే యశ్వారూఢుఁడనై దిరుగుచుండి యారోదనధ్వనివిని యచటికిఁజని పాంథుఁడెవ్వఁడో దారితప్పి కానక యిందులోఁ బడియుండనోపునని జాలింగొని నా కాసెకోక వేసి పైకీడ్చితిని. పిదప నాకెతఁడని తెలిసెను- ముందే నాకది తెలిసియుండిన మన్నకప్పి జీవసమాధిచేసియుందును, గతజలసేతుబంధనమిప్పుడనుకొన్న ఫలమేమి? ఇంతకు వానికాయువు గట్టిగానున్నది-

మాలతి—పిమ్మట?

భీమ—అట్లుచేసిన మహోపకారమూరకపోవునా? పంచమహాపాతకములొనర్చిన ద్రోహులు సయిత మెంతచెడినను మనుష్యులేకదా

మాలతి—అందుకా నాకట్టుల విడిపింపంగలిగితివి.

భీమ—పిచ్చిదానా! వినుము. పిమ్మట నన్నాతఁడు మిక్కిలి గౌరవించి నాకు నియ్యడవుల నిర్భయముగాఁ దిరుగుచుండుట కభయమిచ్చి మైత్రిఁగనఁబఱచెను- ఇదిసందర్భము. విషయమిట్లుండ నిఁక నీస్వయంవరమని మామచాటింపఁజేసిన నాఁడుమొదలు నాకునిద్రాహారంబులు దూరమై హృదయమందొక పొగలేనిసెగ బయలుదేరి మంచముపట్టియుండఁగ న్నాకర్ణికగానీకుఁగల్గిన దురవస్థ వింటిని. అప్పుడునామనస్సెట్లుండెనోనీవే విచారించుకొనుము- ఫిరంగిగుండువలె నాహృదయనిర్భేదంబుగావించిన యీవార్త వినఁగానేనా

యొడలెఱుంగక, తటాలున తురగమెక్కి, దిక్కుతోచక, పిచ్చివానివలెఁ బరుగెత్తింపఁ దొడఁగితి. పూర్వపరిచితమార్గము లవుటచేత నాగుఱ్ఱము పుణ్యవశంబున నన్నీవిపినంబునకుఁ దోడ్తెచ్చెను. ఆహా! నాయదృష్టమేమందును? అప్పుడే నే నొకకలకలమువిని, పిడుగుపడ్డట్టుగా, దుష్టబుద్ధి కట్టెదుట నిల్చితిని ననుంగని, నివ్వెఱపడి యతండు నాభీతికిఁ గారణమడిగెను. నినుం బ్రస్తావింపగానే, పకపకనవ్వి, మనలను, బావ, మఱదలను నెపంబునఁ గొంతవడిఁ బరిహసించి, తుదకు నేఁజేసినమహోపకారమునకుఁ బ్రత్యుపకారముసేయకునికిఁ దనవంటివాని కనుచితమని, చెప్పుచుఁ దాను భగీరథప్రయత్నమున సాధించుకొనితెచ్చిన ప్రాణప్రదమగు నిన్నునాకు వివాహము తానేచేసి ఋణవిముక్తుఁడనగుదునని నుడివెను. నేనప్పుడతనింగని సమయోచితవాక్కులఁబ్రీతునింజేసి కన్యకలను దాతలేక పరిగ్రహింపఁదగదని నుడివితిని. అమ్మూర్ఖుఁడు నామాటఁ జెడచెవింబెట్టి క్షత్త్రియులకు గాంధర్వము విధివిహితమేకదా, ఏలకారాదని నన్నధిక్షేపించెను. నేనావిధికిఁ "బరస్పరసమ్మతము" ముఖ్యలక్షణమని వాదించితిని- వానిమాటన్న సుగ్రీవాజ్ఞ. ఇట్లు తనతో, ముఖాముఖి, వచనప్రతివచనంబులు జరుపుననుంగాంచి కోపించి, నీవిందులకు సమ్మతింపవేని, నిన్నిప్పుడే యురిదీయింతును, ఇఁక నీ మఱద లియ్యకొనదేని, ఈరాత్రియే దాని నేఁబరిగ్రహించెద. ఇదితప్పదు. ఇట్లని నీమఱదలితోఁ జెప్పుమని నామెడఁబట్టి త్రోసెను. అప్పు డిట్టిప్రస్తావము నలుగురియెదుట జరిపించిన బాగుగనుండదని ప్రార్థింపఁగానే, తత్కాలమునకు నీకట్టులవిడిపించి దవ్వులఁ దనభటుల నుంచెదనని, మాటయిచ్చెను. ఇఁకఁ గర్తవ్యము నీవాలోచింపవలసినదే.

తెరలో (అదిగోపులి! వేయుండి! పొడువుండి నఱుకుం డనుధ్వని)

దుష్టబుద్ధి దొంగలతో చప్పునఁ బ్రవేశించును.

దుష్ట—అరుగరుగో! వేఁటకాండ్రెవరో, వచ్చుచున్నవారు. కట్టుండు కట్టుండు. కొనితెండు కొనితెండు.

(వేఁటకాండ్రు రభసమునఁ బఱతెంతురు తెరపడును)

భల్లూకభట్టు (విదూషకుఁడు) ప్రవేశము.

భల్లూ-(ఉస్సురుమని చేతికఱ్ఱ నేలవైచి చదికలంబడి) అబ్బా! ఏమి నాతలవ్రాఁత! కలిగినది తిని, కడుపులోని చల్లకదలకుండ నింటికడనుండక నేనేలయీ వేఁటకాండ్రవెంట వచ్చితిని? ఈవీరసేనుఁడేమో నాకుఁగిరీటముఁ బెట్టునని యెంచి వచ్చినందులకు నట్టడవి నన్నుడించి నాస్థితిగతుల విచారింపక వారువంబులనెక్కి వేఁటతమకంబున కార్ముకంబులపిఱుదంటిచనిరి. ఎట్టిమహారాజుల నాశ్రయించిననేమి వారివారికర్మానుగుణముగా శుభాశుభంబులు సమకూరుఁగాదె. కుబేరునంతటివాని కనుంగునెచ్చెలియైన శివునకు భిక్షాపాత్రము తప్పెనా. "అవశ్యమనుభోక్తవ్యంకృతంకర్మశుభాశుభ" మ్మని యుండెంగదా. పోనీ, లోకములో బ్రాయికముగాఁ గొంతకలిగియు, మఱికొంత కాసించుట మనుజులకు సహజమేకాని, నావలెఁ దనయోగ్యతకును గోరికలకునుగల యంతర మెఱుంగక నేలవిడిచి సాముచేసిన వాఁడుండునా? కాలుసాచికొనుటకు చోటమరినఁ గదా, పండుకొనుటకు యత్నించిన, బాగు? వివేకియగువాఁడు "తృణజలూకాన్యాయమునఁ" గ్రమక్రమంబునఁ బురోవృద్ధింగనును ఒకవేళతనయిష్టానుసారముగాఁ గోరిక లీడేరకపోయినను సమయసందర్భానుగుణముగాఁ దనమనోరథముల మరల్చి బాగుపడును. పులిని జూచి నక్క వాఁతలు పెట్టుకొన్న మాడ్కి మహాశూరునివలె, నేనీయోధాగ్రేసరుల వెంట నేల రావలె? ఆవేళకుఁదగినమాటాడి, ఏసంకల్పమో ప్రశ్నయో మూఢజనులకుం జెప్పి, తిన్నఁగా దినమునకు పావలాడబ్బులు లాఁగి, గారెబూరెలతో సలక్షణమగు బ్రాహ్మణార్థభోజనము చేసి బొజ్జపైఁ జేతు లాడించుకొనుచు గచ్చుతిన్నెపైనేపుల్లకబురులో చెప్పికొని కాలక్షేపముఁ జేయునాకు వేళకు కూడులేక, యెండలనక, వానలనక, తిరిగి తిరిగి పెక్కుపల్లేరుగాయులం ద్రొక్కి దిక్కుఁగానక నికీకారణ్యమునం జిక్కితి. అక్కటా! రేలుంబవళులు "నిదిగోపులి. యదిగోయెలుఁగ" ను కూఁతలే వేదఘోషము లయ్యెంగదా. మడిమడుఁగుఁజేరె. కర్మానుష్ఠానంబులు కాలిపోయె. ఇఁక నీయరణ్యరోదనమునకు దరియేది? ఇక్కడనే యుంటి

నా కార్మ్ముకంబుల బాధ. పోవుదమన్నం గాలు దిన్నఁగానేల నూదఁజాల. ప్రాణభయమంత లేదు కాని, చావ మనసురాదు. కానీ. మెల్లమెల్లఁగఁ గుంటుచు వెళ్లెద. (నిష్క్రమించును)

వీరసేనుఁడును సైనికులును ప్రవేశము.

వీర—ఓశూరాగ్రేసరులారా! ఇఁక నేమియనుకొన్న నేమి? చేతఁజిక్కినయకట్ట డిదుష్టబుద్ధి తప్పించికొని పోయెంగాదె. ఈనాయవివేకము విన్న మనసుమనోభిరామచక్రవర్తి నన్ను నిందింపకమానునా? ఇఁక నా మొగ మతని కేమని చూపుదు? ఎట్లయిన మనమిఁక నయిదాఱుదినములియ్యడవులం గ్రుమ్మరి, యారేఁడిమ్మరి జాడఁదీయక యూరక పోరాదు. కాని మనము చెఱవిడిపించిన యమ్మ్రుచ్చుకంటిని మన వెంటఁ ద్రిప్పుట యనుచితము. పాపమాసుకుమారి మాళవేశ్వరుని కుమారియఁట, కటాకటా! ఆకోమలింబాసి దానితలితండ్రు లెంతయడలుచుండిరో కదా. కావున మొదట నామిత్రుఁడగు భల్లూకభట్టువెంట నాయమను నాసహోదరి ప్రభావతీదేవికడకుం బనుచుట యుక్తమని తోఁచెడిని. అతఁడెచ్చట నున్నవాఁడో యరయుదము రండు.

# మాలతీనాటకము.

## తృతీయాంకము.

(మాళవదేశము సభాభవనమందు వసువర్మయు, సునీతిశర్మయుం ప్రవేశించుచున్నారు)

1 వ రంగము.

వసు—గీ. అధికచింతాదవాగ్నికి నమృతవృష్టి
విపులసంతాపలతికాల విత్రవరము
ప్రకటవిక్లేశకుధర వజ్రప్రహరణ
మాత్మసంతతి యని చెప్పుటరుదె భువిని.

అకటకటా! ఎట్టియెట్టి మహాత్ముల సేవించి, నానాతీర్థయాత్రలఁ గావించి మిక్కుటంబులగు వ్రతంబులనుష్ఠించి, దైవానుగ్రహంబున నిన్నినాళ్ళకొక యాఁడుబిడ్డం బడసితిని. పడసి, తల్లీలావినోదంబులం దవిలి, ఆబాలికారత్నమును, ఆజీవమణిని, మాప్రాణంబులుగా నమ్మికొని, కన్నులఁగప్పికొని, సూర్యకిరణంబులనైన సోఁకనీఁక, మాచెంతఁ బాయక యునిచికొని, యెట్టులో కాలముఁ ద్రోయుచుండ దైవమునకుఁ జూపోపకపోయెనే? అన్నిరోగములకన్న మిన్నయగు వార్ధక్యరుజలు మమ్ముం గాసించుచుండ, నకటకటా! మాకన్నచిన్నారి, మాముచ్చటలదొంతి, మాప్రాణపదము, మమ్మిటుల వెతఁగుందుమని నిర్దయం డించిపోయెనే? అయ్యయ్యో! ఎట్టి

యాపదలపాలాయెనో? ఏమిగతిఁజెందెనో? ఎన్నివగలఁబరితపించెనో? ఇఁక నేమిగతి? కటకటా! ఇన్నిదినములుగాఁ దిరుగుచున్న మనచారుల కాచారునయన పోకడ యింతకేనియుం దెలియదాయెనే? నేనేమిసేయుదు? నా యానందరాశి, ననుఁ గన్నమ్మ లేనిగడియ యుగంబుగాఁ దోఁచుచున్నది.

ఆ. వె. చిన్నియడుగుముద్దు చిన్నెలు లేనిల్లు
మేడ యైననేమి కాఁడుకాదె?
బుడుత లేని రాజ్య భోగము ల్గాల్పనే?
తనుజు లున్నవారె ధన్యు లెందు.

సునీతి—రాజశేఖరా, మీదుఃఖమున కవధిలేదు. నిక్క-మే కాని, మీవంటి ధీరులే పామరులచందమునఁ బరితపించ సామాన్యుల ననసేల?

క. ఎందాక నంట వాపద
లందాక మహానుభావు లందఱు మహిలోఁ
బొందుగ నాపన్నికషను
నందిననే భూరిధర్మ మరయంగ నగుఁ. మఱియు.

ఆ. వె. చేటఁ బెట్టి చెఱఁగఁ జిట్టుఁ బొట్టేగడు
గట్టి గింజ లేమొ యట్టె నిలుచు,
నట్లెయిడుమలందు నల్పులు నధికులు
దేలుచుందు రవనిపాల, యెందు.

ఉ. ఆపదలందుధైర్యము, మహాభ్యుదయంబున నమ్రభావముం
గోపముపావచింతనలఁ గూరిమిసజ్జనులందుఁ గార్యముం
దోఁపిక, భృత్యులందునుచితోక్తియు, భూతనులందునెమ్మి, గౌ
రీపతియందుభక్తి, నివరింప మహాత్ములనైజ ధర్మముల్.

రాజన్యమాన్యా, కర్తవ్యము విచారింపక యూరక దుఃఖించుట కాఁగల కార్యంబులకుఁ గుదారముకాదె? యుక్తాయుక్తపరిజ్ఞానసుప్రసిద్ధులగు మీయంత వారలకుం జెప్ప నేనెంతవాఁడను.

వసు—మంత్రివరా! నీవెంత చెప్పినను, నావంతయావంతయేని గొంతకాదయ్యో. అయ్యో! నాకుఁ గలదుఃఖము! హా! కనిపెంచిన వారలకు, తన మాంసంబు మాంసంబుగాఁ దనరక్తంబు రక్తంబుగా, నెలయు వంశస్తంభంబుల యెడబాటునంగలుగు దుఃఖంబు తెలియును. కటకటా! ఆచారులెంతయవిచారులు?

దౌవారికుఁడు ప్రవేశము.

దౌ—మహాప్రభూ. జోహారు. కోసలపురినుండి విప్ర పుంగవుఁడొకఁడు వచ్చి తమయాజ్ఞం బ్రతీక్షించుచున్నవాఁడు. ఎంత చెప్పినను, పట్టుపట్టి కదలకున్నవాఁడు.

సునీతి—ప్రవేశపెట్టుము.

దౌ—చిత్తము (నిష్క్రమించును. విప్రుఁడు ప్రవేశము)

వసు—(ఎదుర్కొని) భూసురోత్తమా, నమస్కారము.

విప్రుడు—స్వస్త్యస్తు, రాజేంద్ర ఆయుష్మాన్‌భవ.

వసు—అయ్యో నాదురదృష్టమా! నాకన్నకూఁతును; నాఁడు రిపెములచిన్నారిని, అడవిపాలుసేసి దినంబొకయుగంబుగా బ్రదుకేబరువుగా జీవించుచున్న కడువృద్ధుండగు నావంటి నిర్భాగ్యున కిట్టి యాశీర్వాదమా? నేగిట్టిన నీదుఃఖమనుభవించువారు లేరా? "పాపీచిరాయు" వన్నరీతి నిఁక నెన్నికల్పములు జీవింపవలెనో.

విప్రుఁడు—నృపతిసత్తమా, ఊరడిల్లుము. నేనుకోసలపురనివాసిని. మీకూఁతురు-అయితే.

వసు—ఏమేమి! నాకూతురు?

విప్రుఁడు—నృపవరా, యెందులకింత యాతురత?

వసు—అయ్యో! "ప్రసవవేదనాగౌరవము గొడ్డురాలెఱుఁగునెట్లు"? అయ్యా, "నీకూఁతురు" అనియంటివి- జీవించినదా, గతించినదా? ముందుచెప్పుము.

విప్రుఁడు—సుఖముగా నున్నది. చింతిల్లకుము.

వసు—సునీతి—నిక్కమా? నిక్కమా? నిక్కమా?

విప్రుఁడు—అయ్యలారా, నామాట శిలాక్షరము, ఇట్లను మాప్రభావతీదేవి చెప్పియంపెను. (చెవిలో)

వసు—(అతనిం గౌఁగిలించికొని తనమెడలోని హారము వేయును) భూసురవరా, పోయిన ప్రాణము రక్షించితివి, నీవైన గుండియలు గట్టిపడెను. మంత్రీ, ఇఁక బాలికను రక్షించు తెరవాలోచింపవలెను. మొదట దేవికిం దుఃఖోప శమనము చేయందగు రండు.

విప్ర-సునీతి—చిత్తము. చిత్తము.

(అందఱు నిష్క్రమింతురు.)

2 వ రంగము.

కోసలపురి అంతఃపురము.

ప్రభావతియు, చిత్రరేఖ, విలాసవతు, లను సఖులును. మాలతియుఁ ప్రవేశించుచున్నారు.

ప్రభా—బిడ్డా, మాలతీ, వగవకుము. దైవగతియేరికిందప్పదు.

గీ. రాజసూయంబొనర్చిన రాజుమహిషి
హరుని నెదురొడ్డి తాఁకిన నరునిపత్ని
రమణి పాంచాలి యుండె సైరంధ్రియగుచు
విరటుసతిఁ గొల్చి యేడాది వింతకాదె?

మాలతి— అమ్మా నామాట యటుండనిండు, అకట—టా! ననుఁగన్నవారు-

మ. ఎటులున్నారలొ నన్నుఁ బాసి? వెతవా రెట్లోర్చిరో, యిన్ని నా
ళ్లెట కేనేగిరొ ? యెంత వారడలిరో? ఏమందు? నావంతమి
కుట-టమైతోఁచె నిమేషమే యుగముగాఁ గ్రూరంబు నాక్రాఁత, యిం
కెట కేఁబోవుదు నేమిసేయుదుఁ గటా! యింకెట్లు కానున్నదో?

ప్రభా—కుమారీ! అడలకుము, మనమంపిన యాబ్రాహ్మణుఁడు శుభవార్త దెచ్చునంతవఱకు నెమ్మది నుండుము.

ఉ. కమ్మని మోవి కెంపు కసిగందెఁ గదమ్మ వెడందయూర్పుచే;
నిమ్మగు నెమ్మొగమ్ము కళ లింకెఁగదమ్మ మహాశ్రుధారఁ, గాం

ధమ్ములలీలఁ గన్నుఁగవ దాల్చెగదమ్మ, సహింపుమమ్మ, మా
యమ్మకదమ్మ, మాటవినుమమ్మ, శుభమ్మగునమ్మ, మాలతీ.

చంద్రకళ. సకియ, జన్మంబనుపొలంబున సస్యములు సత్కర్మముల్
వికటమౌ చింతలనుకలుపులు వెలయ నెల్లెడలన్
ప్రకటభక్తిజ్ఞానసఖులఁ బరమసజ్జనసేవలం
జకచకం బెకలించవలెసార్థకము దేహముగాన్

విలాస——అమ్మా సుఖదుఃఖములు దైవాయత్తములై యొకటివెనుక నొకటి జీవులకుం గల్గుచుండు.

చిత్ర——వెన్నెల, కొన్నినాళ్ళు, చీఁకటి, కొన్నినాళ్ళు. ఇది లోకానుభవసిద్ధమే కదా.

ప్రభా——నిజము.

గీ. చక్రమున కంటినట్టి రజఃకణంబు
భ్రమణ మందెట్లు క్రిందికిఁ బైకిఁ దిరుగు,
నట్లె జీవుండు కాలచక్రానుయుక్తి
దుఃఖసుఖముల రెండింటఁ దూలుచుండు.

మాలతి——అమ్మలారా!

గీ. చుట్టుపట్టులఁ గార్చిచ్చు చుట్టిరాఁగ
దిక్కుఁగానక నిలుచున్న దివ్యవృష్టి
కురిసియారినయట్లుమీకూర్మిఁ జిలుకు
పలుకు లమృతంపుఁ జినుకులై పాపె వెతల.

ప్రభా——రాజపుత్రీ!

గీ. మహిని సౌజన్యమే వశ్యమంత్ర మెందు,
నదియుఁ గలవారి నందఱు నాదరింత్రు
ఘుమఘుమ లిన్నించు మల్లికాకుసుమ మెవరు
కాంచి తలదాల్ప కుందురుకర ములరుచు?

మఱియు "నోరుమంచిదైన నూరుమంచిదగుం" గదా. కావున నాకిది మొదలు నీవు మాయిందఱకుం దుల్యవయితివి. నీపుట్టినింటివార్తఁ దెలియునంతవఱకు మాయింటసుఖంబుండుము. మాయాచార్యుఁడగు కౌశికుఁడునీకు సముచితశాస్త్రోపదేశములచే మనస్సమాధానముం గల్పించెడు. నీవును మాయిందఱకు పాటపద్దెంబులం జెప్పి బుద్ధిఁ గఱపుచుండుము. ఓచిత్రరేఖా! నీవు మాలతికి నిందఱం జూపి కౌశికాచార్యులతో నాయమం గనిపెట్టి యుండుఁడని నామాటగాఁ జెప్పి నాటకశాలయందు విడిదికుదిర్చిరమ్ము పొమ్ము. మాలతీ, నీవీచిత్రరేఖ వెంటం జనుము.

చిత్ర—రావమ్మా. (చిత్రరేఖయు మాలతియు నిష్క్రమింతురు)

ప్రభా—మనము పూజాగృహంబునకుం జనువేళైనది రమ్ము.

(నిష్క్రమింతురు)

3 వ రంగము.

వింధ్యాటవి దుష్టబుద్ధి ప్రవేశము.

దుష్ట—మత్తకోకిల. నాకు నాకని యన్నదమ్ములొనర్చ వాదొకయావుకై
పైకిఁ గొమ్ములొకండు కాళ్ళులఁ బట్టియొకఁడు లాగఁగా
జోకఁ బాలనుబిండిత్రావిరి సొంపుమీఱ వకీళ్లుపో
నీక, వారికిలాభమేమననేల? పొడ్పులుఁదన్నులే.

సెబాసు! సెబాసు! తిమ్మఁడుచావనీ, తిమ్మఁడు చావనీ యనియన్నఁ దమ్ముఁడు చచ్చెనఁట. నాకుఁడోపీ వేయవలెనని భీమవర్మయు, వానికిఁడోపీవేయవలెనని నేను నాలోచించుచుండఁగా నడుమ వాఁడొకఁడు వచ్చి మాయిద్దఱకు సీమకుళ్ళాయివేసి యాపిట్టంగ్రద్దవలెఁ దన్నుకొనిపోయెను. "చెఱుపకురా చెడెద" వను లోకోక్తి కలదు. తానొకటి యాలోచించిన దైవమొకటి యాలోచించెను. దొంగిలఁబోయినదొంగ దుప్పటింబోగొట్టుకొన్నట్టున్నది. అయినం గార్యసాధకుఁ డెప్పుడు నోటిలో వ్రేలుబెట్టుకొనియుండఁడు. "క్రిందట్లు మీదట్లు కృష్ణంభట్లు" ని పడుచు లేచుచు నెట్టకేలకుఁ దనపగ నెఱవేర్చుకొనును. మంచిది. భీమవర్మ నుసికొల్పెదను. (నిష్క్రమించును

## భీమవర్మ ప్రవేశము

భీమ— "ఆశాచపరమందుఃఖమ్, నిరాశాపరమంసుఖమ్" ఇఁకనేల ? నా పని యుభయభ్రష్టము నుపరిసన్యాసమైనది. అనుకొన్న దక్షరమి, ఉన్న దూడుట. ఆసునీతిగానికి మొదటనుండి నామీఁదనే కన్నులు. మాళవునిచెవిఁ గొఱికి నన్ను దేశభ్రష్టునిం జేయించెను. నీటిలో మునిఁగిన నాకునిఁక చలి యేమి ? వచ్చునది రానీ, ఇఁకనొక మంచిసొగసైన యెత్తు వేసెదను. దానికి దుష్టబుద్ధిసాహాయ్య మవసరము. వానితోఁ జెలిమి పాముతో సరసము. అయినఁ గార్యసాధకునకు "నందితే జుట్టు నందకున్నఁ గాళ్ళు" ని యుండనేయున్నది. వసుదేవునంతవాఁడు గాడిదకాళ్ళుఁ బట్టుకొనలేదా ? అంతకంటె నాదేమియెక్కువ ? అదిగో ! ఎవరో వచ్చుచున్నట్లున్నది.

## దుష్టబుద్ధి ప్రవేశము.

దు—ఆహాహాహా ! భీమవర్మనా !

భీ—నూఱేండ్లాయుస్సు ! నిన్నిప్పుడే దలంచితిని.

దు—ఏమి మీ దేశవార్తలు ?

భీ—ఇఁక నాకాగొడవెందుకు ?

దు—ఔరా ! వైరాగ్యము ! "వృద్ధానారీ పతివ్రతా" యన్నట్టున్నది.

భీ—ఇఁకనేమి నాపుట్టిమునిగినది. మంత్రిమాటలువిని నాయందనుమానము తోఁచి మాళవుఁడు నన్ను దేశభ్రష్టునిఁ గావించెను.

దు—ఇంతియేకదా ? మాలతిమాట యేమిచేసితివి ?

భీ—బాగు, బాగు ! "మ్రింగ మెతుకులేదు మీసాలకు సంపెంగనూనె" యఁట. మొనగాండ్రమిద్దఱము చేరి "కొండనుద్రవ్వి యెలుకం బట్టితిమి" కదా !

దు—పట్టినదగంతయు బంగారవుటకు బ్రహ్మకొడుకులమా ? నూఱావులలో నొక యావు చేఁపిన నెంత చేఁపకున్న నెంత !

భీ—నీకున్న నిబ్బర మందఱకు నుండవలదా ?

దు—లేకున్న నీ కైన పోయేమి? ఏదియో, ఆకాశమునకు నిచ్చెనవేసియున్నా వు. కనుకనే, "అతివినయం ధూర్తలక్షణ" మన్న తెలుంగున నిట్లుంటివి. అదట్లుండనీ. ఇప్పుడు మాలతి యెచ్చటనున్నది?

భీ—పుట్టినింటి కింకనురాలేదు. కోసలపురినుండి రప్పించుకొనుటకు సన్నాహము చేయుచున్నట్లు కింవదంతి.

దు—నీకు నిష్క్రమణగాఁ దెలియునా?

భీ—నాకంతకుఁబూర్వదినమునందే యుద్వాసనమయినది. అయినను, ఇట్టి వబద్ధములు పుట్టునా?

దు—మాలతికి నీయందనుమానము కలదా?

భీ—లేదని దృఢముగాఁ జెప్పఁగలను.

దు—అయిన, మాళవదేశమునుండి మాలతిం దెచ్చుట కచ్చటివారలు కోసలమునకుం జనక మునుపే మనమెట్లయిన దానిని సాధింపవలెను.

భీ—(తనలో) మార్గమునకుఁ దానే వచ్చుచున్నాఁడు. (బహిరంగముగా) అది యెట్లు సాధ్యము?

దు—నాయనుచరులం గొందఱ నీకప్పగించెద. నిన్ను మీమామగారంపిన ట్లభినయించి మున్ముందు సాగించుకొని రావలెను. "ధైర్యం సర్వార్థసాధక" మ్మనీ యెఱుంగవా? రమ్ము. ఉచిత మాలోచింతము.

(నిష్క్రమింతురు)

## 4 వ రంగము

కోసలపురిలో ప్రభావతీమందిరము.

వీరసేనుఁడు, ప్రభావతియుఁ బ్రవేశించుచున్నారు.

వీర—అక్కా! కీలు నీలోనున్నది.

ప్రభా—వీరసేనా! నాకేల యీలేనిపోని నిష్ఠురము? ఇదిగో నీచేతిలోచేయివేసి చెప్పెదను. నాయెడ్డంకి యేమియునుండదు. ఈశ్వరుఁ డనుకూలించిన నాకు నీతో వియ్యమందుటకంటె నపేక్షణీయ మన్యముండునా? నీ వట్లను కొన్నావు కాని,

రామగీత. ఎలమిఁ బుత్త్రులు పౌత్రు లెవరెందఱున్నన్
దులలేనిసిరులు నాథుని యింటనున్నన్
లలనామణులకెల్ల లాగు డెందంబున్
దలపోయఁబుట్టింటి తలఁపు లెవ్వేళన్

ఉ. మింటికినంటి నద్దెసల మేకొని కొమ్మలు రెమ్మలెన్నియో
కంటికి వింతఁగూర్చినను గాటఁపునెమ్మినిమఱ్ఱిచెట్టు, చె
ల్వొంటిన యూడల నగ్రములన్ జననస్థలిఁ గౌఁగిలించుఁ, బు
ట్టింటి ప్రభావమిట్టిది మహి న్మఱవంగఁదరంబె యింతికిన్.

కావున, తమ్ముఁడా! ఈవిషయమందు నీకంటె నా కెక్కుడుమక్కువ కలదు. సంశయింపకుము. అయిన, దైవ మెట్లాలోచించెనో? బాలికకుఁ దండ్రిప్రాయము బొత్తుగాలేనందున సదుపాయ మేమియుం దోఁపకున్నది. వివేకవిచక్షణుఁడగుచు రాజ్యభారము నిర్వహించుచున్నఁ బ్రాయఁపుసుతునితో నియ్యది పలుమఱు ముచ్చటించుట భావ్యముగనుండునే? నేఁజెప్పఁ దగినదంతయుఁజెప్పితిని. కులగురువులగు కౌశికులచేఁ జెప్పించి చూచితిని ఈడుమీఱిన తనయుని యెన్నిదినము లిట్లుచూతును. నాకున్న దా యొక్క మొలక. "కఱువుమనినఁ గప్పకుఁగోపము. వదలుమనినఁ బామునకుఁ గోపము" ఇట్టి త్రిశంకుస్వర్గమందుఁ జిక్కుకొన్నాను. నీ వానాఁడు చెఱఁ దప్పించిపంపిన యారాజసుతకున్న వయస్సుండిన మనయిందిర కింతకు మును పెప్పుడో ముడి పడియుండును.

వీర—ఔను. దానికి మనమేమి చేయవచ్చును? ముఖ్య మాఁడుబిడ్డలఁ గన్నవారి బ్రదుకిట్లు తెల్లవాఱుచుండును. అనుకూలదాంపత్యము దుర్లభము. చేసినసంబంధము విపరీతముగాఁ బరిణమించినచో మనచేతులార మనబాలికలను, జెనులోఁతునూతం ద్రోసిన దోషము సిద్ధించును. అట్లని పెండ్లి మానుకొనుటకు ఆఁడుబిడ్డ కదా!

ఆ. ఆఁడుబిడ్డపుట్టినది మొదల్ జనకుల
పౌరుషంబుఁ బాపి పాడుసేయు

వెన్నుపుట్టి చెలఁగుచుఁ బ్రిదిలించి తీపెల్లఁ
బీల్చి పిప్పిచేయు విస్మయముగ.

మఱియు,

గీ. బిడ్డనిచ్చినవారలు బింకమెడలి
యెట్టియవమానమైన సహింపవలయు
జగములనుముంచు జలనిధి శౌర్యమెడలి
కట్టువడెఁగాదె రామభూకాంతుచేత.

ప్రభా—సోదరా! నీవిట్లేల యూరక పరితపించుచున్నావు? ఇప్పుడు మనకన్యకకేమంతయీడుమీఱినది? ఇంకను పదిరెండవయేఁడు రాలేదు. క్షత్రియకన్యకలకు వయోనిర్బంధ మంతబాధింపదుకదా! పుట్టించిన జగదీశ్వరుఁడావేళకుఁ దానేపుస్తెకట్టించును.

వీర—అట్లనిమనమూరకయుండఁదగునా? పొలము చక్రగా ఫలించుటకు ముందు నందుంగల ముండ్లు గుండ్లు తొలగించుట కృషీవలునిఁజెందినదికదా ఒకవేళ మనమాలోచించికొనిన కార్యమునకు నమ్మాళవసుత ప్రతిబంధముగా నేర్పడునేమో!

గీ. చారుగుణశీల, రూపసౌజన్యలీల,
బాల శశిఫాల, విమలదర్పణకపోల
నళిచికురజాల వినయవిద్యాలవాలఁ
గన నృపునినేల నాట దంగజునికోల?

ఈగండముతప్పినఁగదా ముందుమాట.

ప్రభా—(నవ్వి) పిచ్చివాఁడా! ఇట్టివిషయములందు స్త్రీలకుఁ బురుషులాయుపదేశికులు? నీ కాచింతవలదు. సుఖముగా వెళ్ళిరమ్ము.

వీర—అయిన నాకనుమతియా?

ప్రభా—మంచిది. (వీరసేనుఁడు నిష్క్రమించును)

(పొంచి వినుచుండిన చిత్రరేఖా విలాసవతులు ప్రవేశించుచున్నారు)

చిత్ర—అమ్మా! ప్రభావతీ! లోకస్వభావ మిట్లుండెనుగదా! పాప మామాలతిచేసిన పాపమేమి? కటా!

గీ. వట్టి శంకాగ్నికీలలఁ బతులఁ ద్రేల్చు
నతివల కసూయ నెలకొల్పు నాత్మమాన
బాధకంబగు విషయప్రబోధకమగు
సుగుణములమాటు రూపంబ సుదతిచేటు.

విలాస—నిక్కము. మాలతియవస్థ లన్నిటికిని దానిసౌందర్యమే మూలము.

ప్రభా—సఖులారా! దానిగుణాతిశయ మెంతయద్భుతమయంబులగు మనంబులకు నూదంటురాయికాదె? దానిం గాంచినంత నామనంబు నాకర్షించె. మాటలాడినంత నావలపు దశగుణంబులుగా వశంగతఁ జేసికొనియె.

విలా— చ. పొలఁతులఁజూడమో? యలరుబోఁడులతోడను గూడియాడమో?
నెలఁతుకలార! యెందు రమణీమణుల న్వలపించుబోంట్లని
యిలఁ గనుఁగొంటిమే? అహహ? ఎంతటిచోద్యము కాంతలీగతి
న్వలచినఁ గార్యమేమి మగవారిననంగ ననంగమాయకున్.

చిత్ర—కావున, దేవీ! మాలతి సుమనోభిరామచక్రవర్తిగారి దృష్టిపథ గోచరంబుకాకుండఁ గనిపెట్టవలయు.

ప్రభా—అట్లయిన మనమే నాటకశాలకుంజని యాచార్యులగు కౌశికులతోఁ బ్రస్తావించుట యుక్తమనితోఁచుచున్నది. నెళ్ళుదమురండు.

(నిష్క్రమింతురు)

5 రంగము.

చేటి- చిత్రపటము చేతనిడుకొని ప్రవేశించుచున్నది.

చేటి—ఔరా! ఈచిత్రపటము! నాతమ్ముఁడింత ప్రజ్ఞాశాలి యగునని యెవరనుకొనియుండిరి? దీనింజూడ వేయికన్నులుచాలవు. ఇది మాసుమనోభిరామసార్వభౌమునచ్చొత్తినట్లున్నది. దీని రేపతనికి సమర్పించుకొని, గొప్ప బహుమతిం బొందఁదలఁచినాఁడు. భావజ్ఞులు చూచి, సంతసించినఁగదా పనివాని విజ్ఞానంబు ప్రశస్తిఁ జెందును. అట్టివా రొకతూరి చూచి తలయూచినఁ బడివే లిచ్చినట్టుగాఁ జిత్రకారుఁ డానందించును. ఎవరిలోపములు వారికిఁ గానరావు. కావునఁ దెలిసినవారికిది చూపుదుమని నన్నతఁడు

కోరెను. దీనిం జిత్రరేఖకడకుం గొనిపోయెద. అదిగో! నాటకశాలనుండి మాలతి వచ్చుచున్నది. ఎవరయిననేమి? చిత్రరేఖమాత్రము కిరీటము పెట్టుకొన్నదాయేమి?

మాలతి ప్రవేశము.

చేటి—అమ్మా! వందనము.

మాలతి—చేటీ! ఎక్కడకు వెళ్ళుచుంటివి? నీచేతిలోనిదేమి?

చేటి—ఇదియా?. ఒకచిత్రఫలకము.

మాలతి—ఎవరిది?

చేటి—సమ్ముఖమున రాయభాగమా? నీవే గుర్తించిచెప్పుము.

(అని పటము చేతికిచ్చును)

మాలతి—(చూచి)

ఉ. క్షీరముగారుచెక్కిళులు, చేరలకెచ్చగు కన్నుదామరల్,
బారనుమీలుపెన్నులము, వాతెఱముద్దులుమూటఁగట్టు, శ్రీ
కారములౌను వీనులు, నకారను కౌను, ముఖాబ్జమిందిరా
గారము, ఇట్టిచెల్వ మెటఁగంటిమె? వింటిమె? తెల్పు తొయ్యలీ.

చేటీ! ఈ యద్భుతరూపలావణ్య మూహించి లిఖించిన ప్రజ్ఞ యే ప్రజ్ఞ. బ్రహ్మసృష్టియం దిట్టిసచేతస్వరూప మేచోటనైనంగలదా?

చేటి—ఇదేమమ్మా? ముంజేతికంకణమున కద్ద మొకటింకా? అజ్ఞనిచేతి కిచ్చి నన్ను దప్పక సుమనోభిరామభూపతియని జెప్పఁగలఁడు.

మాలతి—ఎట్లు? ఎట్లు?

చేటి—ఎట్లయిననేమికాని, నాకుఁబొద్దుపోయినది.

(పటము లాగికొని నిష్క్రమించును)

మాలతి—ఇది సుమనోభిరామచక్రవర్తి స్వరూపమా! నాతల్లిదండ్రులు నన్నిచ్చి పెండ్లిసేయఁదలంచిన దీమనోభిరామునకేనా?

సీ. ఇదియేమిచిత్రమో? యింత విచిత్రమే?
ఇట్టి సౌందర్య మెందేని గలదె?
ఉండునా? ఉండదు. ఉండునేమోగాని
ఉండఁబో- ఉండిన నుండుఁగాక
సుమనోభిరాముఁడా? సుదతిమాటలకేమి?
అకట! ఏలొకో మది వికటమయ్యె
కనియెఱుంగని దేటి కలఁతయో? తెలియది
దొకవిధంబయినది యోర్వరాదు
గీ. నేనునేఁగానొ మాటలనేర్పు లేదొ
ఏల యిట్లై తిఁగారణ మెఱుఁగరాదు,
మేను వడవడవడఁకెడు మిగుల నహహ!
ఎవరినేమందు? నిందుల కేదిమందు?

ఓహో! ఇదేమి? ఇట్టి బహిరంగమందు నేనెంత వెఱ్ఱిని!
(అని నిష్క్రమించును)

(భీమవర్మయు, సిపాయిల వేషములతో దొంగలును
ప్రవేశించుచున్నారు)

భీమ——మిత్రులారా! కార్యసాధకుఁడుసాధక బాధకముల నన్నియుఁజక్కఁగ నాలోచించుకొనవలెను. కేవలము సాహసము ప్రాయికముగాఁ గార్యనిర్వహణమునకుం దగదు. దేశకాలసందర్భములు, అనుకూల ప్రతికూలములు, ఉచితమగు నాత్మరక్షణము, ఇవి ముఖ్యముగాఁ బాటింపనగు. కావున, సాహసించి యొక్క్రమాఱే, రాజసమ్ముఖమున కరుగుటకంటె, నంతఃపురదాసీమూలమున, భావ్యముం బర్యాలోచించుటొప్పు. పాముకాళ్ళు పామునక్కే తెలియును గనుక, స్త్రీలమూలముగానే యాగుట్టుం దీయవలయు.

సిపాయిలు——ఇది మేలైన యుపాయము.

భీమ——అట్లైన రండు. (నిష్క్రమింతురు)

## 6 రంగము, రాజసభ.

(సుమనోభిరాముఁడు, మంత్రి- సుమంత్రి, సేనాని- వీరసేనుఁడు, మఱిఁ గొందఱధికారులు, భల్లూకభట్టు, వీరుప్రవేశింతురు)

సుమనో—సుమంత్రీ, నాకేమియుందోఁపకున్నది. రాజ్యమునందేమూలనల్పిష్ఠమగు కంటకమున్నను నాకునిద్రపట్టకుండు.

భల్లూక—సుమనోభిరామసార్వభౌమా, సుమనస్సుకుమారులగు రాజపుత్త్రులకు మీకే యీయవస్థగాని, మిన్ను విఱిగిమీఁదఁ బడినను నానిద్రకేమాత్రము చలనముండదు.

సుమంత్రి—మూర్ఖుఁడా, ఆ. వె. కడుపులోని చల్ల కదలకుండఁగ నెట్టి
యిడుములందనీక యెపుడు ఱేఁడు
కంటిఱెప్పమాడ్కిఁ గాచియుండఁగఁగదా
నీకు నాకు మొద్దు నిద్రపట్టె.

రాజపుత్త్రులతిసుకుమారులన్నఁ బ్రజలకష్టము లేమాత్రమైనను, జూడనోపని చిత్తవృత్తిఁ గలవారని భావము కాని, దుర్బలశరీరులని కాదు.

వీర—నిక్కము.

మ. అరిదోర్గర్వవినాశసాధనధనుర్జ్యాకర్షణప్రస్ఫుటో
త్కరరాజత్కిణు లస్త్రభీకరగదాఖడ్గప్రహారవ్రణ
స్ఫురదుద్వక్షులు శౌర్యదక్షులు క్షితిక్షోభాపనోదక్షముల్
వరరాజన్యులసౌకుమార్యముప్రజాబాధాసహిష్ణుత్వమే.

సుమంత్రి—రాజేంద్రచంద్రమా! మీరుసింహాసనమధిష్ఠించినయీకొలఁదికాలములోనే, ప్రజలయందన్యోన్యమైత్రి యొక్కుడుగ నెగడి, రాజ్యము శ్రీరామరాజ్యముఁగనున్నయది. కొందఱక్కడక్కడ దుష్టబుద్ధిప్రబోధితచేతస్కులై, యరుంధతీనక్షత్రసదృక్షులుగ, నేమూలలందో డాఁగి, కొన్నికుట్రలు చేయుచున్నను, మీకును బ్రజలకుంగల జనకసుతన్యాయము, భరతఖండ

మునందువలెనే దేశభాగములందును లేదని నొక్కి వక్కాణింపగలను. ఇం దలిప్రజలు; దయాసముద్రియగు మీతల్లి ప్రభావతీదేవి యంతఃకరణశుద్ధి ననవరతము స్మరించి స్మరించి, ఆచంద్రార్కముగా నేకచ్ఛత్రాధిపత్యమ విచ్ఛిన్నముగ వర్ధిల్ల నీశ్వరునిం గృతజ్ఞులైకొనియాడుచున్నవారు.
మనో—మంత్రీ! మాతల్లి నాకొకప్పుడిట్లని బోధించెను.

క. ప్రజయనసంతానం, బది
ఋజుగతిఁ బాలించునట్టి నృపతి జనకుఁడే
నిజముగ; నదివెతఁ గాంచిన
రజనిచరుఁడ కాఁడె? పేరె రాజు తలంపన్.

ఈసముచితోపదేశమును గడవఱకు ననువర్తింపఁగలనాయను ననుమానముమాత్రముగలదు. ఇంతవఱకు నాకుంగలిగిన బ్రఖ్యాతికిఁ గారణములు' తల్లియొక్క శిక్షయుఁ బ్రజలయొక్క ప్రభుభక్తి పురస్కృతమగు క్రమప్రవర్తనయునని తోఁచుచున్నది- మీరందఱు మనుష్యమాత్రుఁడనగు నన్ను మేరువుంజేసి గౌరవించుటచేతనేగదా చక్రవర్తినయితిని, విద్యావినయవివేకశౌర్యాదార్యాదిసకల సద్గుణసంపదఁ గలిగి యఖండప్రజ్ఞాధురంధరులగు మీవంటి సత్ప్రజలు వేనవేలు నాకుండనిఁకఁ గీర్త్యపకీర్తులు మిమ్ముఁగాని నన్నుఁ జెందవు.

ఆ. వె. పెంచిపెద్దఁ జేసి విద్యబుద్ధులుచెప్పి
భారమంతవారిపైన మోపి,
జనకుఁ డూరకుండుఁ దనయులామీఁదట
వానిఁ బ్రోచి గౌరవంబుగాంత్రు.

ఓయధికారులారా! మీకు భగవంతుఁడనుగ్రహించి మన్ముఖమున నియమించిన, యధికారములఁ బరిపాలించుటయం దేమాత్రమక్రమముగాఁ బ్రవర్తించినను, ప్రమత్తులై ధర్మబద్ధులుగాక, యర్థార్జనైకతత్పరులై ప్రజల వేధించితిరేని, తప్పక యాత్మద్రోహము, స్వామిద్రోహము నీశ్వరద్రోహము మిమ్మంటి, యైహికాముష్మికదూరులం జేసి, వాసియఱఁగాసిఁ జెందించును.
సుమంత్రీ, నీవిదివీరల కెఱుంగం దెలుపుము.

మంత్రి—అధికారులారా వింటిరికదా! రాజశాసనము శిరసావహించి మీమీ కార్యములందుఁ దగిన జాగరూకతతో మెలంగి, మీకు గౌరవార్హములగు గొప్ప యధికారములొసంగినందులకుఁ గృతఘ్నులుగాక రాజ్యతంత్రములని ర్వహింపవలయును. సర్వేశ్వరుఁడందులకుఁ దగినమనోధైర్యము మీకు నొసంగుఁగాత.

చ. అలసులుగాక లంచములనంటక ధర్మము నీతినెంతయుఁ
దొలఁగక, పేదసాదులను దొందరపెట్టక, యాత్మలాభమే,
తలఁపక, సత్యమేమఱక, ధైర్యమువీడక, భేదమెంచకే
మెలఁగుఁడు రాజ్యకార్యముల మిక్కిలి పాపభయంబునెక్కొనన్.

సుమనో—మంత్రి! ఇఁకమీరందఱు సుఖముగా వెళ్ళిరండు.

(వారునిష్క్రమింతురు)

(భల్లూకభట్టుంగాంచి) మిత్రమా, నీవెంతమారిచుఁడవోయి. ఇంతవఱకు నాకేలయీమాటందెల్పవైతివి?

భల్లూక—నీయాతులోవడ్డించిన పదార్థములందిదిపప్పు, ఇదియుప్పనిచెప్ప నొకరుందురా?

సుమనో—నీకదితెలియదుకాఁబోలు మేమంతటియవివేకులము గనుకనే మాకట్టివారొకరుందురు. కనియంధత, విని బధిరత, జనపతులకు నరయ నెచట నహజముకాదే?

భల్లూక—సరిసరి! ఇట్టిప్రజ్ఞాహీనులా, రాజ్యమునందు మూలమూలలనున్న ప్రజలదుఃఖములరసిపోషించువారు? 'తనవిస్తరిలో గాడిదపొర్లాడుచుండ నెదుటి విస్తరిలోనీగను జోపబోయిన' ట్లున్నది. మీయింటిలోజరుగుచుండువార్తలకు నన్నాక్షేపించెదవేమి?

సుమనో—ఇది మిక్కిలి యాశ్చర్యము. నాతల్లి యెంతచిన్నమాటైన నాతోనెప్పుడుఁ జెప్పకుండునదికాదు. దీనికింతగుట్టేలొకో? చెలికాఁడా నీవాకలికిం జూచితివా?

భల్లూక—ఇఁకనీకుఁ జెప్పనా బ్రహ్మదేవుఁడే లేచిరావలెను. తలఁదీసి చేతికిచ్చి నను గారడీవిద్యయే యనుచున్నావు. నావెంటఁబెట్టి మీమామవీరసేనుఁడే మీతల్లికడకనిపెను. ఈకంటితోనే, ఆబాలికంజూచితిని. ఈనోటితోనే పల్కరించితిని. ఇఁకనేమి?

సుమనో—ఆలాగా? అయితే దీనికింతరహస్యమేల?

భల్లూక—ఏమో? మీసుగుణసంపద మీతల్లికిం దెలియవలె. మీమామకుం దెలియవలె, లేదా మీమఱదలిందిరకుం దెలియవలెనుగాని మాకెట్లుతెలియును.

సుమనో—(నవ్వి) అట్లనా?

భల్లూ—ఎట్లనో, నాకేల? (అనివెళ్లఁబోవును)

సుమనో—(పైబట్టంబట్టికొని నిలిపి) పరుగెత్తుచుంటివేల?

భల్లూక—నాకాఁకలియెత్తుచున్నది. వదలు, నీపుణ్యము.

సుమనో—నాకులేని యాకలి నీకప్పుడేకలిగెనా?

భల్లూక—నీకేమి మహారాజువు. తెల్లవారకముందే మీతల్లి చద్దియన్నము కంచములోఁతోడి నిద్రలేపును. దానిపైనకాఫీ మాకట్లమరుటకు, దరిద్రదేవత పెద్దబండవలె నడ్డుపడుటట్లుండ, బ్రాహ్మణ్యమొకటి కాలిపోయినదికదా? ఈగ్రహచారమునకుఁ దోడుగా, మాయింటిలో దానికి నెలకు మూఁడుముట్లు.

సుమనో—అయిన నిదొక్క మాటరమ్మే (అని చెవిలో)

భల్లూక—(తలనాడించుచు) ఆలాగే. (నిష్క్రమించుచుండఁగా సుమనోభిరాముఁడతని వెన్నుదట్టుచు నిష్క్రమించును)

7 రంగము.

ఉద్యానవనము.

విమల, సునంద, (ఇద్దఱు సేవకురాండ్రు) ప్రవేశింతురు.

వి—ఓహో! సునందా! ఎక్కడికింతవడి?

సు—విమలా! ఎఱిఁగియు నెఱుఁగనిదానివలె నటించెదేల?

వి—చెలీ! నీయాన, నేనెఱుఁగ.

సు—మంచిది. నీ వెందుల కరుగుచుంటివి ?

వి—నేను జెప్పినఁగాని నీవు చెప్పఁగూడ నంతటి చిదంబరరహస్యమేని నా కేలయా గొడవ ?

సు—విమలా! మనలో మన కట్టి రహస్యము లుండునా ? వినుము. మాలతితండ్రికి వచ్చుప్రాణములు పోవుప్రాణములఁట. ప్రాణములన్నియు బిడ్డపై నుంచుకొని యిప్పుడు వచ్చినఁగాని యాస లేదని వగచుచున్నాఁడఁట. ఇప్పుడతని మేనల్లుని యమ్మగువం గొనిదెమ్మని బంపియున్నవాఁడు. కావున, ప్రభావతీదేవి యమ్మచ్చెకంటిం జెచ్చెరఁ దోడ్తెమ్మని నన్నంపెను. నాటకశాలయం దంతయు వెదకి వెదకి వేసారితిని. పాప మెక్కడ నున్నదో ?

వి—ఆలాగా ? అ—బ్బ! ఈపీడ యిక్కడనుండి యెప్పుడెప్పుడు తొలఁగిపోవునా శ్రీహరీయని యనుదినము వేయిమంది దేవుళ్ళకు మ్రొక్కుకొనుచుంటిని. ఆ మ్రొక్కు నేటికి ఫలించెను.

సు—పాప మాపాప యెవరి కేమి విషముఁ బోసినది ? నీ కేమంతటి యొత్తిడిగలిగినది ?

వి—సునందా! తల్లిపోయిన నాఁటనుండి యింతపిల్ల నంత చేసితిని. ఆ యిందిరకు విషముఁ బోసిన నాకుఁ బోసినట్లు కాదా!

సు—మన కా వెఱపేల ? మాలతి గుప్తముగా రక్షింపఁబడుచుండలేదా ?

వి—నెలతా! నీకు పిచ్చి.

> ఆ. కంపఁ గొట్టి యొరుల కనులకుఁ బడనీక
> జాజిఁ బదిలపఱచు జాణతనము
> దెసలఁ గ్రమ్ముకుండ దివ్యమా నెత్తాని
> నడఁచిపెట్టఁగల దె కడిమి నెందు ?

సు—ఏమో! ఎవరు గన్నారు ?

వి—ఇఁకను సందియమా ?

> చ. చపలులు, తీవ్రచిత్తులు, విచారవిదూరులు, మోసగాండ్రు, బ
> ల్కపటులు, కార్యదక్షులు, వికారమతు ల్మగవార లెందుఁ జూ

క్కపుజవరాండ్రఁ జూడఁ గడకన్నులనవ్వుచు లీల మెచ్చుచున్
గృపఁ బలుబాసలిచ్చుచు, సఖీ! యిల వారిని ఱట్టుసేయరే.

సు—ఇట్టి సామాన్యపురుషాధములకుం బోల్చి సకలసజ్జననయనాభిరాముండగు మన సుమనోభిరామచక్రవర్తిని నీ కిట్లు తూలనాడఁ బాడియే?

వి—పాడి కాదు నిక్కమే కాని, అక్కరో! రొక్కము, చక్కెరబొమ్మ యను నీరెంటికిం జిక్కని పురుషుఁ డెక్కడనో నూటి కొక్కఁడు కోటి కొక్కఁడు.

ఉ. పెక్కులునీతు లెక్కుడుగఁ బీరము లెక్కి గభీరధోరణిం
దిక్కులు పిక్కటిల్ల నుపదేశముఁ జేసిన వేదమంత్రముల్
మిక్కిలిగాఁ బఠించిన, భ్రమింపఁగ మూఢులు బూదిమెత్తినన్,
జక్కెరబొమ్మ వాల్గనులజాడ మదిం దిటమూని నిల్చునే?

సు—వారి వారి ప్రారబ్ధము. మనకేల? ప్రకృతమం దేమియుపాయము.

వి—నేను పూవులకై యీ యారామమునకుం జనుదెంచినదాన. నీవును రమ్ము. వెదకుదము.

సు—అగుంగాక. (తెరచాటునకు నడుతురు)

మాలతి (ప్రవేశించి తనలో)

అక్కటా! గీ. తాను రానేల? వచ్చినతరుణి పటముఁ
జూపఁగానేల? చూపెఁబో, భూపుఁడనుచుఁ
దెలుపఁగానేల? తలవ్రాఁత ఫల మదిట్లు
చేటిఁగొని తెచ్చె నది యింత చేటుఁ దెచ్చె.

సీ. మారుఁడా! యికఁ బలు మాఱుడాయకు నిలు
శూరుఁడందురె నిన్ను సుదతి నేఁచ?
బీరమా మివుల గంభీరమా మలయసమీరమా
సతులపై మిట్టిపడఁగ?

పంతమా కినుక దురంతమా విమల
వసంతమా కాంతల వంత లిడఁగ?
కాలమా యిది యనుకూలమా? వినవె మ
రాళమా విడు ప్రతికూలమార్గ

గీ. మకట! మన కెంతయాంతరంగికుఁడునైన
ప్రాణబాంధవుఁడైన సరాగతరుఁడు
నైన ఘనమార్గసంచారుఁడైనదైవ
మొకటి వికటింప దాయలై యోసరింతు॥.

(విమలసునందలు తిరిగివచ్చి మాలతిం గని)

సు—అల్లదిగో! మాలతి విచారముతోనున్నకైవడిం దోఁచెడిని. జనకుని దుర్వార్తఁ నెవరైనఁ జెవివేసియుండిరా? చాటునుండి కనుఁగొందము.

(విమల, సునంద, పొంచి వినుచుందురు)

మా—(తనలో) ఓ నాదురదృష్టమా! నన్నింతకుఁ దెచ్చితివె? నా దుఃఖమ్ములన్నియు వమ్ములై కాలమించుక సుముఖముగా నేర్పడెననితలంచితినిగాదె. ఇంతటి పిట్టపిడుఁగు పడునని యనుకొనలేదు. హా! విధీ! నీవెంత వికటించితివి! నీకు నేఁజేసిన పాపమేమి? ఓపాపీ! చేటీ! నా డెందంబున నింధనంబుల నపేక్షింపని యగ్ని నేటికి ట్రిడితివి? పోనీ! ఆ సుందరాంగుని, ఆ నవరసరసికశిఖామణిని, ఆ రాజచంద్రుని యింకొకక్షణిమిషమైనఁ జూపక పోతివిగదే! నీ వెంతకరినురాలవే! ఓరామచిలుకా! నీయింపుఁ జాలింపుము. నీపలుకులు నాచెవులకుములుకులై తోఁచెడిని ఓచంచరీకమా! నీవీఁక నాయెడఁ జూపకుము. నీనిలువెల్ల కల్మషమయంబు. ఓకోకిలా! చిగురుపొగరునఁ గంటఁ జిచ్చుఁగ్రక్కెదవేల? నీకంజలిఁ జేసెద. నీకూత యమదూతకేకవలె భీతిఁ బుట్టించుచున్నది. శివశివా! (దుఃఖించుచుండును)

వి—సునందా! వింటివే? నేనన్నమాట యనుభవమునకు వచ్చెనా?

సు—ఔనె! ఇట్లెకక్షడనైనంగలదా? మనప్రభావతికిఁ దెల్లనివన్నియుఁబా

లునల్లనివన్నియు నీళ్ళు. ఇట్టిసర్పము నింటనుంచుకొనంజనునా? బంగరు కత్తియని గొంతుగోసికొను మూర్ఖు లుందురా?

మా—(తనలో)

ఉ. ఎవ్వరి నేమటందు? వెతనెచ్చట నేగతి వీడుకొందు? నిం
కెవ్వరితోడనందు? దరియెవ్వరు నాకిఁకముందు? దైవమా!
నవ్వులకాయె నాబ్రదుకు నల్గురిలో

విమలా సునందలు—(చాటునుండి) తరళాక్షులెందు లే
జవ్వన మంకురింప నవిచారత నెంచరు తారతమ్యముల్.

మా—అయ్యో! ఇఁకనేమిగతి యెవ్వరో వినిరి. (అని వెళ్ళనుంకింపుచుండఁగా సుమనోభిరాముఁ డాకస్మికముఁగా నెదురుపడ నిరువురు దిగ్భ్రమఁ జెంది యట్టె నిలుచుండి కొంతవడికి)

సు— క. కలఁగంటినా? నిక్కమొ?
కలకంఠీ! నేను నేనుగానా దలంపన్?
చెలువు వియచ్చరకన్నెవొ
లలి వనదేవతవొ మరుని లలనవొ సిరివో?

(విమలాసునందలు గొబ్బున ముందుకు వచ్చి)

అమ్మా! ప్రభావతీదేవి రయమ్మున మిమ్ములఁ దోడ్కొనిరమ్మన్నది. రండు.

సుమ—చ. తెలియకవచ్చినాఁడ సుదతీమణులార క్షమింపు డీరు, వి
చ్చలవిడి పారువంబు చెయిజారి వెస న్వనతెంచె యీ దెసం
గల సౌదరిండ్ల దూటె నదికంటిరె? కాంచినఁ దెల్పి వందనం
బులుఁగయికోరె లేదనినఁ బోయెద వచ్చినత్రోవ నిమ్ములన్.

సునంద—రాజేంద్రచంద్రమా! దానిజాడ మేమెఱుంగము. (మాలతింగని) అమ్మా! రండు. రండు.

(సుమనోభిరాముఁడుఁదక్కతక్కినవారు నిష్క్రమింతురు)

సుమ—(తనలో)

మ. రతియో భారతియో రమాయువతియో రాజీవపత్రాక్షి ? యా
క్షితిసామాన్యయొ ? చూడమే సతుల నీచిత్రంబు గన్గొంటిమే ?
అతిసౌజన్యవిలోల, బాలఁగన, బ్రహ్మానందమింపారె నె
వ్వతెయో ? దేశము నామమేదొ ? జనకుల్వామాక్షికందెవ్వరో ?

ఒకవేళ నామిత్రుఁడు భల్లూకభట్టు సూచించిన యా చంద్రాస్య యిదియె కాఁబోలు ! మంచిది. ఆరహస్యమును వెలికి లాగించెద.

(అని నిష్క్రమించును)

8 వ రంగము.

(ప్రభావతి, చిత్రరేఖ, విలాసవతి, ప్రవేశింతురు)

విలాస—ఏమమ్మా, యీవిచిత్రము !

ఉ. పొట్టను బెట్టి పెద్దవలెఁ బోషణఁ జేసితి వీవు మే ల్భళీ !
ఇట్టిద యుండునే పుడమి ? నెంతటిదిట్ట యిదేటివింత ! నీ
పట్టినిజూడ దెవ్వడు స్వభావ మెఱుంగదు మాటలాడ దె
ప్పట్టునఁ జిత్రదర్శనము ప్రశ్నినఁ బుట్టెనె యిట్టిచిట్టలున్.

చిత్ర—ఆనె. ఇంటిదీపమనుచు నిగిలించి చేకొని
ముద్దుఁబెట్టుకొన్న మూతికాల
కున్నె ? కన్నెయందు వన్నెలాడియటంచు
వద్దఁ జేర్పనీకె బుద్ధి నేర్పె.

విలాస—ఇఁక మనము కంటినిండ నిద్రఁ బోవచ్చును. మన యిందిరకుఁ బట్టినపీడ యింతసేపటి కెన్ని క్రోసుల దూరమో తొలఁగిపోయియుండుంగద!

ప్రభా—మీకట్లున్న దేమో కాని, అదేమిఋణానుబంధమో, ఆబాలిక నంపివేసినది మొదలు నాకు డెందంబునం దావాలునూరిన ట్లున్నది. మన యిందిర

కుఁ బెండ్లయియుండినఁ దప్పక నాతనయున కమ్ముద్దియను ముడివేయుంచియుండును. అంతటినోము నోఁచనైతిని. చిత్రరేఖా! నీ వామాలతి పటము నైన నిటు తెమ్ము.

(చిత్రరేఖ పట మందిచ్చును. దానిం గైకొని)

దీనిం జూడుఁడు.

క. మకరాంకుఁడు ముకురానన
చికురము లళితతికిఁ బలుకు చిలుక క్రపాంగ
ప్రకరము విరితూపుల కని
పకటించి యనంగుఁడగుట భావ్యము కాదే.

సుమనోభిరాముఁడు ప్రవేశించును. సఖులు లేచి నిలుచుందురు.

సుమ—జననీ! సాష్టాంగనమస్కారము.

ప్రభా—(పుత్త్రుం గౌగిలించి) వత్స! చిరంజీవ.

సుమ—తల్లీ! ఈలేఖ నాలోకింపుము. (అని యొకజాబు నిచ్చును. ప్రభావతి దానిం జదువుకొనుచుండును)

చిత్రరేఖావిలాసవతులారా! కూర్చుండుఁడు. అదెవ్వరిపటము?

చిత్ర—ఎవ్వరిదియునుగాదు. ఊహావిశేషంబులఁ బరీక్షింపఁ బ్రభావతీదేవి నన్నుపేక్షింపగా వినోదమునకై లిఖించితిని.

సుమ—(దానిం గైకొని, తనలో) నే నారామసీమయందుఁగన్న యా రామయే యీరామ. ఈచిత్రరేఖ నన్ను వంచించుచున్నది. (ప్రకాశముగా) చిత్రరేఖా! అయిన నీప్రజ్ఞయే ప్రజ్ఞ. దీని నామందిరమం దునిచెద.

ప్రభా—తనయా! ఇది యకర్జము. మాళవపతి, తనకూతురగుమాలతి మనకడ నున్నదని విని యమ్ముగువం బంపుఁడని పార్థించుచున్నవాఁడు.

సుమ—అమ్మా! ఆపొలఁతుక యిందుండుటనిజమా?

ప్రభా—నందనా!

గీ. సేవకులతోడ, సుతులతోఁ, జెలులతోడఁ,
పెద్దలున్నెడ, శిశువులవద్ద, రాజ

సభల, దేవాలయంబుల, జనకులకడ
హాస్యమునకేని యాడరా దనృత మరయ.

కావున, కారణాంతరముచేత నా బాలిక మనయింటఁ గొన్ని దినంబు లుండినది నిక్కమే. కాని, నిన్నటిదినమే దాని మేనమామ భీమవర్మ యఁట. మాళవపతి కవసానసమయముఁ గానున్నదని దెల్సి పాప మాపాపను వెంటఁ బెట్టుకొనిచనియెను. ఎంతటియాపద!

సుమ—అట్లయిన నింతలోనే మఱియొక రాయభారమా? విలాసవతీ! నీ వా ద్వారమునకనిపెట్టుకొనియున్న మాళవమంత్రికిది వినిపింపుము.

(విలాసవతి పోవును) తల్లీ! ఈచిత్ర మా మాళవపుత్త్రికగేనా?

ప్రభా—ఔనౌను.

విలా—(ప్రవేశించి, తొట్రుపాటున నెదఁ దట్టుకొనును) అయ్యో, పాపము! అయ్యో పాపము! కొంప మునిఁగెనుగదా! ఇఁకనేమి! ఇఁకనేమి! ఆ వచ్చినవాఁడు చోరుఁడఁట, భ్రష్టుఁడఁట. మొదటఁగల్గిన చేటునకుసయితముఁ వాఁడే మూలమఁట.

తక్కినవారు—హా! హా! హా! ఎంత మోస మెంత మోసము!

సుమ—చెచ్చెర నాయధికారులం బనిచి వానిం బట్టి తెప్పించెద, తల్లీ! వందనము. (నిష్క్రమించును)

తక్కినవారు—ఎంతపని! ఎంతపని! (చేతులు పిసికికొనుచు) ఇంతటి పిట్టపిడుఁగా? (నిష్క్రమింతురు)

(తెర పడును)



# మాలతీనాటకము.

## చతుర్థాంకము.

### 1 వ రంగము. అడవిలో దుష్టబుద్ధి కోట.

(అందు దుష్టబుద్ధి, నర్మదయుఁ బ్రవేశింతురు.)

దు—నర్మదా! ఇంతవఱకు నీకార్యము నాశక్తికొలఁది రాఁబట్టుకొనివచ్చితిని. ఇఁక నంబిపెట్టినఁగాని ప్రసాదము కాదన్నట్టు నీయందున్నది. కావున, నీవెప్పగిది నయ్యొప్పులకుప్ప నొప్పఁబలికి మద్వశంగతఁ జేసి మెప్పఁగనెదో నీకాఱునెలలు గడువు.

న—అట్లీయాఱునెలలలోన ప్పని నెఱవేర్పలేకపోయిన—

దు—నీవొక యాఁడుదానవా?

న—బాగు! బాగు! శిరీషకుసుమసుకుమారస్వాంతలగు కాంతలనింత యూరడిఁ జేసి వంతలఁ గుడిపించిన దుర్దాంతులను వారేమనివరింతురు? నే నేమని మీగుణసంపద నభివర్ణింతు?

దు—అయిన నాకయుక్తిఁ జేసెదను. కార్యభాగములన్నియు నాపరోక్షమునఁ గావింపఁబడియుంట నట్టియకృత్యములకెల్ల భీమవర్మను గుఱిచేసి వానిం గోపించి చెఱఁబెట్టి, యకృన్నియుం గట్టిన కట్టులవిడిపించి రక్షకుండువోలె మంచిమాటల నచ్చిలుకలకొలికిని దోడ్తెచ్చి నీకప్పగించెద. ఆపైన నీవు సమయోచితవాక్యముల నామె మనస్సువం బ్రతికొల్పి మెప్పఁగనుము. (తెఱలో

కలకలము) అదిగో! మాలతిం జెఱఁగొని భీమవర్మ వచ్చుచున్నవాఁడు. నీవు వెళ్ళుము. (నర్మద నిష్క్రమించును. దుష్టబుద్ధి దాఁగును)

మాలతిం జెఱఁగొని భీమవర్మ ప్రవేశించును.

మా.—ఓరీ! కట్టడీ! నన్నిట్టియిక్కట్టులం బెట్టి నీవట్టిసామ్రాజ్యపట్టముఁ గట్టుకొనఁదలంచితివి?

గీ. పేదసాదుల నేలుటో, పిత్తికి వారి
భయముపాపుటో, ఖలుల గర్వంబుడుపుటో
సత్యమునునిల్పి ధర్మరక్షణముసల్పి
పేర్మిగాంచుటో యబలఁ జెన్నొతలనిడుట.

అక్కటా! వీఁడిట్టిపయోముఖవిషకుంభమని యెఱుంగక నాతండ్రి యొక్కఁడు గారాబమున వీనింబెంచి విశ్వసించెను కుక్కతోఁకనెంతదిద్దినవంకరపాయును? కృతఘ్నునకుంజేసిన యుపకారము లూషరక్షేత్రమునం జల్లిన విత్తనమ్ములవితమ్మున వమ్మగుటయకాక మీఁదమిక్కిలి యుపకారికే యనర్థ మాపాదించును. "తేలగ్నిఁబడఁగఁబట్టిన, మేలెఱుఁగక మీటుఁగాదె?" మఱియును,

ఆ. అలికి ముగ్గువెట్టి యాసన మమరించి
విసిరి పెద్దఁజేసి వినుతులొనర
నేయివోయ, హెబాత చే యంటఁగాల్చెడు
నగ్ని; యిలఁ గృతఘ్నుఁ డట్టివాఁడ.

భీమ—మఱఁదలా! నామాటపాటింపక నీవిట్లూరక నిందించుచుంటివేటికి?

మా—ఓరి కులఘాతకా! నీదుర్వృత్తికిఁకను సమాధాన మొకటికలదా?

(దుష్టబుద్ధి గొబ్బున నెదురుపడి కత్తిఁ జళిపించుచు)

దు—శా. ఓరీ! కూళ! నరాధమా! తులువ! యీ యుగ్రాటవీమధ్యమం
దీరీతి న్బెఱనాతి నీతిచెడి నీవిట్లేల గాసించెదీ;

ఘోరాసి న్నినుఁ జెక్కి పాళ్ళుడుదు నేఘూకాళి కిందెల్ల నీ
భీరం బింతటఁ జక్కఁజేతు నిలురావన్నిక చండాలుఁడా !

(అని పైఁబడును. తెరపడును)

2 వ రంగము. ఉద్యానవనము.

(వెన్నెలతోఁట సుమనోభిరాముఁడు మాలతిపటముం గైకొని ప్రవేశించును)

సుమ---ఔరా ! ఈపటమును

గీ. చేతనందినమాత్రన జెమటవొడమెఁ
జూచినంతట నాప్రీతిఁ జూఱఁగొనియెఁ
బేరువిన్నంతఁ గొండలై పెరిగె మరులు
లేమ కేఁగఁగంటఁజూడ మఱేమియగునో.

గీ. ఏమె హృదయమ నీస్థైర్య మెందడంగె
నేర రారాజ, ధైర్య మేయేటఁగలిసె
నార ! పౌరుష మేకొండయడుగునఁబడె
మహితగాంభీర్య మెట మటుమాయమయ్యె.

ఉ. ధీరుఁడనంచునెంచి జగతిన్ప్రతివాఁడు వివాహబంధముం
గోరుటఁజూచి నవ్వితిని గుండెలువెట్టైదఁ దప్పొనర్చితి
న్మారుఁడ నీవ శూరుఁడవు, మాయురె ! యాత్రిపురారి ధైర్యమే
నీరుఁగఁజేసినావనుట, నిక్కము, నిక్కము నేడెఱింగితిన్.

(భల్లూకభట్టు కఱ్ఱఁబట్టుకొని, మూటమోసికొని ప్రవేశించి)

భల్లూ---ఆ. ఆలు, ఆలు, ఆలు, ఆలు, ఆలో యని
రేలు పవలు నిదురలేక చచ్చి
చేతి జిడ్డువదలఁ జెట్టపట్టితిఁ దాని
నాలుగాదు నల్లతేలెగాని.

సు—ఇదేమి? ఇట్టి నడురేయి నాచెలికాఁడిట కేలవచ్చుచుండెనో? మంచిది. ఆప్తులగువారికి మన మనోదుఃఖములు వెల్లడించుటచేఁ దత్కాలోపశాంతియైన గల్గనోపు.

గీ. కన్నవారలచెవులె సోకంగనీని
భావసంకోచ మడచి స్వభావనియతి
నునుచు మిత్రుండతనిగన్న మనసుదమ్మి
నిచ్చి యడుగక మును మున్నె విశదపఱుచు.

భ—ఇఁక నేనింటిదిక్కు తలపెట్టిపరుండను. చుక్కపొడువకమునుపే రెండామడలదూరము నడిచియుండిన నే నాయుష్మంతుఁడనే. అయ్యారే! ఆగయ్యాళిచే సహస్రనామపూజ లేని దినమే లేదుకదా! చాలుఁజాలు సంసారము. సంసారమఁట! దీనికీపేరిడిన మహానుభావుఁ డెవ్వఁడో? వానికి నా తలపైని మూటనెత్తించిన యప్పు డేమనునో?

గీ. చూడఁగాఁ దీగజల్లెడ సొబగుఁదోఁచుఁ
గాపురము, లోనఁ బదివేలు గండ్లుకలవు
కన్నమునఁ దేలుకుట్టిన కన్నగాని
చెలువునను జెప్పికొనరాదు, సిగ్గుచేటు.

ఇట్టి దుఃఖస్వరూపమైన సంసారమను నగ్నిలో నావంటి మూఢమతులెందఱో మిడుతలవలెఁబడి నశించుచున్నవారు.

ఆ. కూడులేనివాఁడు గుంటును గ్రుడ్డియు
మసలలేనివాఁడు ముసలివాఁడు
పెండ్లియన్న మాత్రఁ బండ్లిగిలించును
ముందుచేటెఱుఁగడు మూర్ఖుఁ డకట!

పోనీ! సంసారమునందలి చిక్కులూ పెక్కులని యెఱింగియున్న జనకులే తమసుతుల వైవాహికవిషయములం దెట్లు ప్రవర్తించుచుండిరో విచారింతము.

సీ. ఎదఁజీల్చి దవిటీల నెదకిజూచిన యక్ష
రంబన్న దెచట శ్రీరామరక్ష
ఇదిమంచి, యిది చెడ్డ, యిదిపోలు నిదికూడ
దనువివేకవివక్ష యభ్రసుమము
ఎలప్రాయ మదిమించి తూలుకాఁడుచుండెనో
నీటుఁగానికదన్న నిందుసున్న
ఇలువాసియొకపూట కేనితిండిగడించు
సాధనోపాయము చట్టుబండ
గీ. ఇట్టిదశయందుఁ బెండ్లాముఁ గట్టి మెడకు
నిల్లు గుల్లఁగఁజేసి తానేగు తండ్రి
పరిణయముసేయకున్న నీభరతవంశ
మకట! నెగడక పాడౌనా యంచు నెంచి.

సు—(తనలో) ఓహో! ఇతఁడేమో గృహచ్ఛిద్రమూలమున నెక్కడకే నేగుచున్నవాఁడు. పలుకరించిచూచెదను. (ప్రకాశమున) చెలికాఁడా!

(భల్లాకభట్టదరిపడి)

భ—ఓయబ్బా! లేదే (అని కాళ్ళపైఁబడును)

సు—మిత్రమా! నేను సుమనోభిరాముఁడను. వెఱవకు. లే లెమ్ము.

భ—రామరామా! నా రామయనుకొంటినిసుమీ. సుమనోభిరాముఁడవా? అట్లయిన నీవిందుల కేలవచ్చితివి! నిన్నే స్త్రీపిశాచ మేడిపించుచున్నది?

సు—నెయ్యుఁడా! నీవెంత కుశాగ్రబుద్ధివి! ఎంతలో నెట్లుగ్రహించితివి!

భ—దీనికింత కావలెనా,

క. చారులు విద్యార్థులు మఱి
చోరులు విటకాండ్రు రక్కసులు యోగీంద్రుల్
ధారుణి విరహాతురులుఁ బ్ర
చారము లొనరింత్రు రాత్రిసమయమునందున్.

సు—అయితే నేను విద్యార్థినగానని గ్రహించితి వెట్లు?

భ—చీఁకటిలో విద్యార్థి యేమిచేయును ?

సు—చదివినది చింతనచేయును. చూచినది ధ్యానముచే దృఢపఱచుకొనును.

భ—సార్వభౌమా ! చారచక్షుండవైన నీవు కంటినిండ నిదురింపక సరి ప్రొద్దున నీకేమీ గ్రహచారము ? అట్టి దేమైననుండిన పగలొకగడియసేపు కూర్చున్నం జాలదా ?

సు—అయ్యో ! గడియకాదుకదా, కల్పమైననుజాలదు. నామాటయటుండనీ.

గీ. నిండునెలకాదె నగుమోము, నీటుగులుకు
కొప్పుఘనకల్పమాయె, మిక్కుటమిదేటి
కుచయుగస్ఫూర్తి, ప్రలయ మిక్కువలయాక్షి
కౌను నిఁకే సేయననిమానెఁ గమలభవుఁడు.

భ—సరి ! సరి ! నిన్నుఁబట్టిన మోహిని యూరక వదలిపోవునదికాదు. నాకేల యీ పీడ (వెళ్ళనుంకించును)

సు—(నిలిపి) నాకేమియు సమాధానముఁజెప్పక వెళ్ళుచుంటివేల ?

భ—అయ్యా ! నేను సర్వసంగపరిత్యాగముసేసి కాశీ రామేశ్వరాది పుణ్యక్షేత్రయాత్రలం జేయఁ జనుచున్నాఁడను. ఓయి నాయనా ! నిన్నుఁబట్టిన మోహిని నిన్నుం బీల్చి పిప్పిఁజేయఁగలదని తోఁచుచున్నది. అది రామేశ్వరములో సేతుస్నానముచేసిన వదలిపోవునేమో !

సు—(నవ్వి) పుణ్యక్షేత్రములా ? బాగు ! బాగు !

భ—నీకుఁ బుణ్యక్షేత్రము లక్కఱలేకున్న నీపాపి క్షేత్రములతోనే కాలమేగించి నాయనుభవము నెదఁదలంపుము.

సు—నేస్తకాఁడా ! తగవుఁబెట్టి తమాసఁ జూచుచున్నావు. ఇది నీకుఁదగునా ? మొట్టమొదట నీవు యీమాలతియను మొక్కను నామది నాటితివి. ఇప్పుడది వెక్కసమై సహింపఁగూడని చిచ్చుపెట్టి మ్రుచ్చులపాలైనది. మ్రుక్కడులగు దుష్టబుద్ధివీరవర్మలనెలవులఁ గనిపెట్టి యక్కన్నియర్థ సాధింపకున్న మనకుఁబ్రతిష్ఠ యెక్కడిది. అట్లుచేయక యెన్నితీర్థయాత్రలొనర్చిన నేమిఫలము ?

భ—నిక్క మే. కీర్తియుఁ బుణ్యము వలదనువారెవరు ? వెళ్ళుదము గానిరమ్ము
సు—అయిన నిప్పుడే వెళ్ళుదము.
భ—మిత్రమా ! నీవీరూపమున సంచారమున కుండగవు.
సు—అయిన మఱియెట్లు ?
భ—బాలవృద్ధనారీ జనాశ్రయణీయమగు వేషము ధరింపనగు.
సు—అదెట్టిది ?
భ—సుభద్రి నజుఁనుఁడు సాధించుటెఱుఁగవా ? నీ వాయజుఁనసన్యాసముం గైకొనుము నేను నీశిష్యుఁడనగుదును. నీవు "నారాయణ నారాయణ" యను మాటతప్ప నన్యవచన ముచ్చరింపఁగూడదు.
సు—అయినఁ గాషాయములో ?
భ—నీ కాచింతవలదు. మాతాతగా రాయాశ్రమముఁ బుచ్చుకొని సిద్ధఁబొంద రి. నీకవియిచ్చెదం గొనుము. (అని మూటవిప్పి కాషాయమొసఁగ రాజది ధరించి)
సు—రామా ! నీనిమిత్తము సన్యాసినైతినిగదా నేటికి !
భ—రామ రామ ! నెలఁతలమహిమ యింకెట్టిదనుకొంటివి ?

గీ. రాజశేఖరుసామ్రాజ్య రమను బాపి
యప్పుఁ దలమోపి కట్ట బట్టయినలేక
బిచ్చమెత్తించె నెలఁతల ప్రీతి, నెలఁతఁ
గోరి యీరీతి నీవు బికారినైతి.

ఇఁకరమ్ము. (వారు నిష్క్రమింతురు)

3 వ రంగము. దుష్టబుద్ధి కోట.

నర్మద, మాలతి, ప్రవేశింతురు.

నర్మద—అమ్మా ! నాకథ వేరు నాజనకులు నాకుఁ గాళ్ళురాకమునుపే గతించి రి. నాకు యావన మంకురింపకముందే నాపెనిమిటి పితృవన మలంకరించె ను. నిన్నునెట్లో నన్నును వీఁడొంటరిపాటునంగని మోసముసేసి తోడ్తెచ్చె ను. లోకం బబాంధవంబగుట నిచ్చట సిచ్చెనఁటచేసిన దోసము లెంచక

మచ్చిక పెరిగి విడిచిపోఁజాలక వీనిగృహకృత్యంబుల నిర్వర్తించుచు, నా యవమానస్తంభంబగు (కన్నీరు పెట్టుకొని) వృషుఁడను పుత్త్రినిం జూపెట్టుకొని కాలముఁ ద్రోయుచున్నదానను. అయిన నావలె మోసముచేఁ దేఁబడిన చక్కెరబొమ్మను గాంచినంత నావెనుకటితలంపులు తలవంపులుగా నామదికి గోచరింపవెట్లు? తల్లీ! ఆపాపి కఠోరవాక్కులు కర్ణకుఠారములై నిన్నిట్లు గడియగడియకు మూర్ఛల ముంచుచుండెనుగదా. ఎన్నినాళ్ళనుండియో యాడపురుగుమొగముసయిత మెఱుంగక మొగమువాచిన నాకు బాలచంద్రముఖిని నినుఁ గన్నంతన, పట్టరానిప్రీతి పుట్టెననుట చిత్రముకాదు. కటకటా!

సీ. కంటకపాషాణ కఠరకాంతార
సీమ సుందరతరారామమయ్యెఁ
గరి సింహ శార్దూల కఠినార్భటులు నీకుఁ
గలికిరాచిలుకల పలుకులయ్యె
భీకరసూకర ఘూక ఘూంకారముల్
బోటులసయ్యాట మాటలయ్యెఁ
గాలభుజంగ ఫూత్కారమారుతము తె
మ్మెరల చలువతెమ్మెరలు నయ్యె
గీ. భూరిగిరిగహ్వరము లంతిపురములయ్యెఁ
జుట్టు గనుపట్టు గట్టుల నెట్టుకొనిన
చటుల వనవహ్ని మాణిక్యపటలమయ్యె
నిట్టి పలుగాకిదైవ మెందేనిఁగలదె?

మా—నర్మదా! ఇట్టి దీనదశయందుసయితము పరమేశ్వరుఁడు నన్నింతమాత్రమేని మంచిమాటాడి తోడుసూపు నీవంటిపుణ్యాత్మురాలిని జూపెనుగదా. నేనిఁక బ్రదికి బాగుపడుట స్వప్నావస్థ

ఉ. అకటకట రాజచంద్రుఁడు దయారససాంద్రుఁడు కోసలేంద్రుఁ డే
దిక్కును బోవనీక మది దిట్టముగా నొకనైపులాఁగు నీ

వికృఁడఁజావుమంచు విధి యీదెసలాగుఁ గళేబరంబు; నిం
కెకృఁడిమాట ? లానృపతికిచ్చెదఁ బ్రాణము మేనుఁ గాటికిన్.

గీ. మహితచరితుండు మన్మథమన్మథుండు
జీవితేశ్వరుఁ డమృతసంజీవకరణి
సరసలావణ్యరసమూర్తిన్ సరసఁబాసి
బ్రదుకలెపోవదీమది బండగాని.

నర్మద—అమ్మా ! నీవిట్లు పరితపించుట యుక్తము కాదు. ఎకృఁడనోయుండుసు మనోభిరాముఁ డికృఁడకెట్లువచ్చును ? విధినియతి యిట్లుండ, నన్యథాసేయ నెవరితరంబు. "లలాటలిఖితా రేఖా పరిమార్ష్టుం న శక్యతే" విచారములచేఁ గృశించికృశించి చచ్చుటకంటె "ఏన కేనాప్యుపాయేన జీవితం ధారయేన్నరః" అనియుండుంగావున పాలికివచ్చినదే పాయసమనుకొని సమాధానమును గల్పించుకొని బ్రదుకుట శ్రేయము.

గీ. సకియ విధివ్రాఁత తప్పదేరికినిగాని
చేయునది లేదు; కటకటా ! చెడఁగుఁబురుగు
చెఱుకు నిజమిది కన్యవు చింతవదలి
పెండ్లియాడుము వీని దుర్వినయుఁ డనక.

మా—గీ. వనిత గోరుచుట్టుపైన రోఁకటిపోటు
టన్నరీతి నిట్టులాడినను
జిన్నచూపుఁ జూడఁ జెల్లునే ? పిదప నే
బ్రదుకనేమి భూమి బరువుఁగాదె ?.

మ. మనసేకారణ మీజగత్తునకు జన్మప్రాప్తికి న్ముక్తికిన్
మనసే కారణ; మిద్ది మానవులకున్ మాణిక్య; మిట్టాని నా
జననాథాగ్రణి కిచ్చివేసితిని నాస్వాధీనమే ? యిచ్చి కా
దనఁగా మాన్యమె ? యన్యుఁబొందఁగను వేశ్యంగాను నే నర్మదా.

దుష్టబుద్ధి ప్రవేశించును.

దు—ఎవరచ్చట? నర్మదా! నీవు వెళ్ళి కారాగారమందున్న భీమవర్మకుఁ జప్పిడిగొట్టైతప్ప నెద్దియు నొసంగకుండ నీకొడుకు వృషునకుం దెల్పు పొమ్ము. ఇదియు నొక్కపూటకనియే చెప్పుము.

న—చిత్తము. (అని నిష్క్రమించును.)

దు—(మాలతింగని) సుందరీ! నీవెందుల కిట్లూరక వగలఁగుందెదు? నిన్నిబ్బందులం బెట్టిన పందం బందెం బడఁద్రోసితిఁగాదె. వాఁడు నీమేనమామయని యించుక దాక్షిణ్యమునం దెగటార్పనైతిని. అదిగాక నీలావణ్యగరిమ జితేంద్రియుఁడైన శుకమహర్షినైనం బానిసఁగాఁ జేసికొనంగలదనిన నీనృకీటకము మాటెంత?

మా—అయ్యా! నిక్కముగా నాచెఱవిడిపించి రక్షించినవాఁడవైన నీవారంభించిన పని పరిపూర్తిఁ జెందించి ఘనతఁ గాంచవలదె?

దు—భాసురాంగీ! నీదాసానుదాసుఁడను. నీకేందేమికొదువ? నాయిల్లు నీయిల్లుగా నాయనుచరులు నీపరిచరులుగా భావించి నను సంభావింపుము.

మా—అయ్యా! నీవొనర్చు సపర్యలు నాకువచ్చినట్టే కాని, ననుగన్నవారు మూఁడుగాళ్ళముదుసళ్ళు నన్నువిడిచి యొడలుబడల నెంత యడలుచుండిరో కదా! నాపట్టణంబునకు నన్నుఁజేర్చి పుణ్యముఁ గట్టుకొనవలదా?

దు—ఓభీతహరిణేక్షణా! నీపట్టణంబన్నచో కడుదూరము. నీకు సముచితమగు పరివారము నమర్చి కొన్నిమాసములలో నప్పని యొనరింతు. అంతవఱకు నీ సుందరముఖారవిందమును గుందుచేఁ గందంపక డెందమున దిటమూని నా కానందముఁ గల్గింపుము. మఱియు నీతొడవులందొడిగికొనుము.

మా—ఔరా! నాదుర్దశకు భూషణము లొక్కటే కొదువ కాఁబోలు,

క. తొడవులకునెల్ల తొడవగుఁ
బడఁతికి మానంబె, మఱియుఁ బ్రాణపదంబా
తొడవు చెడ, బ్రదుక నేటికి?
తొడవులు వేయేల గాల్పఁ దొయ్యలికవలన్.

దు—(తనలో) చక్కని రాజమార్గమువిడిచి యడ్డదారింబడితినేల ? చల్లకువచ్చి ముంత దాచఁదగునా ? ఎప్పుడయిన బైటఁబడవలసినదే (ప్రకాశమున) బాలా ! పెక్కులేల ?

ఉ. చూచితిఁ బెక్కుసుందరులఁ, జూచిననేమి ? భవద్విలాసరే
ఖాచతురత్వమెన్న సురకన్యకలందును దుర్లభంబు, నే
డాచఁగనేల నా కనులు ధన్యములయ్యె నినుం గనంగన్
నోచిననోమదేమొ వెయినోళ్ళ నుతించినఁ దీరదావిధిన్.

మా—ఓరి మూర్ఖుఁడా ! నీ విట్టి మేకవన్నె యపులివని యెఱుంగక నీతోసఁభాషించి దోషముఁ గట్టుకొంటిని. శివశివా !

దు—పడఁతీ ! నీహితముకోరి బోధించు నా పలుకులు పెడచెవులం బెట్టి యిట్టియెలప్రాయ మడవిఁగాసిన వెన్నెలఁగావించి తమంతటన వలచివచ్చుచున్న సిరులఁ గడద్రోసి జడదారులతెఱఁగున వెడదారులంద్రొక్కి నన్నుడికిఁపకుసుమీ.

మా—ఓరి తుంటరీ !

గీ. రాజకులమునఁబుట్టి సామ్రాజ్యగరిమ
వెలసి నినుఁబోలు నలఁతుల వలతునఁటర ?
అకట ! యందనిమ్రానిపం డ్లకుని దేల
నఱ్ఱుసాచెదు తొలఁగు చోరాధముండ.

మఱియు నాఁడువారి గోడు పోసికొన్న నిహపరంబులకునున్న.

గీ. సీతఁదెచ్చిన యిరువది చేతులేవి ?
కృష్ణనీడ్చిన కౌరవకీర్తి యేది ?
కలికికన్నీర దెంతటి ఘనునికులముఁ
గాల్చు మొదలంట నిదికల్లగాదు నిజము.

ఈపాపమింతటితోనశింపక భావిజన్మంబునకు నంటియుండుంగనుక బుద్ధిఁగలిగి మెలఁగుము.

దు——బాగుబాగు! ప్రొద్దుపోవని యవివేకులచేఁ గల్పింపఁబడిన పుక్కిటిపురాణగాథలుగాని నీవచనము లనుభవసిద్ధములుగావు,

ఉ. పోయినజన్మమేదో? యిఁకఁబొందెడుజన్మమదేదో? చూడ నీ
కాయము గాంచినారము సుఖంబులుచేకుఱ సాహసించినన్
బ్రాయము నీటిబుగ్గ, మఱి పాపము పుణ్యమటంచు నూరకే
నాయువు రిత్తపుచ్చ తగునా మగువా యిల దేహధారికిన్.

మా——ఓరీ! పుణ్యపాపంబులు, పూర్వజన్మభావిజన్మంబులు నూహాకల్పితంబులను నీచార్వాకసిద్ధాంతములం గట్టిపెట్టుము.

ఉ. రోగు, లరోగులుం గడుఁ గురూపులు రూపరులుం, విరాగులుం,
భోగులు, భాగ్యహీనులు నృపు, ల్ఘనదాతలు బిచ్చగాండ్రు, నీ
లాగు జనింపనేటికి విలాసమొకో? విను పూర్వకర్మ సం
యోగబలంబునన్ గలిగి రోరి! వృథా వెడవాదులేలరా.

దు——(తనలో) ఇది సామాన్యముగ్ధయని, తలంచితినిగాని యింతటి ప్రౌఢయని యెఱుంగనైతి. ఇది మార్గముకాదు. (ప్రకాశముగ) నెలఁతా! నీవుపట్టినకుందేటికి మూఁడేకాళ్ళనుచుంటివి. బాలవగుట నీతో వచనప్రతివచనంబులు సలుప నాకుఁదగదు. ఇఁకఁ గొన్నిదినములకైన నీమూర్ఖత చక్కఁబడదేమో కనుఁగొనెద,

(అని కోపముతో నిష్క్రమించును)

మా——హా! దైవమా! నన్నిట్టిఱట్టుసేసితివే! శివశివా!

(అని మూర్ఛనొందును. తెరపడును)

# మాలతీనాటకము.

## పంచమాంకము.

### 1 వ రంగము. కారాగారము.

(అందు భీమవర్మ ప్రవేశించును.)

భీమ——ఔరా! నా బ్రదుకిట్లు తెల్లవాఱెనా?

చ. పసిఁడిని రెండుసేయ నులిపైకొన నెత్తినసుత్తెపెట్టుచేఁ
బసచెడినట్లు మాలతిని భ్రాంతి వరింపఁదలంచి యెన్నియో
దనుకులు సేయనాకె తలఁదాఁకెఁగదా యలదుష్టబుద్ధి న
న్నుసికొలిపించి యప్పుడఁతి నుద్వాహనం బిపుడాడ నెంచెఁగా!

ఇప్పటికి నాకు బుద్ధివచ్చెను. వచ్చిన నేమిసార్థకము? దొంగలుపడినయా
ఱునెలలకుఁ గుక్కలు మొఱిగినట్లున్నది.

క. మక్కువ సాఁకిన పెద్దలఁ
జిక్కులుపెట్టితిని నేను జిక్కితి మహిఁదా
నెక్కినకొంపకు నిప్పిడు
మ్రుక్కిడి తా మడియకున్నె మూలముతోడన్.

క. వంచకుఁడు కడుఁ గృతఘ్నుఁడు
పంచమహాపాపుఁడనక పాలించిరి తన్
ద్రుంచెడు గొడ్డలిపై నాగి
నించును శ్రీగంధతరువు నిజరజ మరయన్.

ద్విపద. వినరయ్య జనులార విద్యాఘనులార
ఘనులార హితులార కాములార
తలిదండ్రులనక యన్నలుఁ దమ్ములనక
ఎలమి నాప్తులును బెద్దలు వంద్యులనక
తలపాగరెక్క యుక్తాయుక్తములను
దలపోయకెప్పుడు తులువలఁ గూడి
కులశీలగౌరవంబులు కూలఁద్రోసి
నలుగురు నవ్వ మానము విడనాడి
చదువు సంధ్యయు లేక బెదరింత లేక
పదములఁ బాడుచుఁ బకపక నగుచు
చిటికెలు వేయుచు నెట తానయగుచు
విట నట గాయక వేశ్యలయిండ్ల
సిగరెట్లు చుట్టలు చిలిమి గంజాయి
తగ వేదిమద్యము ద్రాగుచు చాండోరుల
దూఱుచుఁ బచ్చిబూతులు దిట్టుకొనుచు
చోరులు చెడిపెలు జూదరుల్గలసి
నేరముల్సేయు నూరూర గ్రిమ్మరుచు
ఘోరకృత్యములు పెక్కులొనర్చి యిప్పు
డెక్కడ నందక చిక్కులఁ జిక్కి
పొక్కుచునుంటినా పొగరెల్లదక్కి
చెఱుపఁదలంచినఁ జెడుఁదానె నిజము
ఊఱువేఁది మావారి యుదరముల్గాల్చి
కడలేనిదుఃఖసాగరమున ముంచి
కుడిచితి చేఁజేతఁ బుడమి తత్ఫలము
కనుఁగొనుఁడయ్య యీ ఖలులతో మైత్రి
యినుపసంకెళ్ళతో నిటు తెల్లవాఱె.

ఇఁక నేమియనుకొన్న నేమి ? మూలక్షయ మొనర్చితిని. ఏపాప మెఱుఁగ నియబలబ్రదు కడవిపాల్సేసి మామగారికొంపం గూల్చితి నకటా ! ఇహి

కాముష్మిక సుఖముల రెంటికిం జెడితి. ఆత్మహత్యఁజేసికొందమన్న ఘోరమగు నరకకూపము 'ఆ' యని నోరు తెఱచుకొని యున్నది. భగవంతుఁడిచ్చిన సర్వేంద్రియములను దుర్వ్యాపారంబుల వినియోగించివివేకము నున్న చేసికొంటిని. నిరంకుశప్రవర్తనగల విషయేంద్రియములు వివేకశిక్షితములు గానిచో నడ్డులేని యడవిగుఱ్ఱంబులవలెఁ జెలరేగి యుక్తపదభ్రష్టునింజేసి నరకమను నగాధకూపంబున జీవునిం బడఁద్రోయును. ఇట్టి జీవునకాత్మహత్య యెట్లుపకరింపఁగలదు? బ్రతికి బాగుపడుట యుఁక స్వప్నావస్థ. చచ్చి నరక మనుభవించుటయనఁగా హృదయకుఠారము. ఎన్నఁడును బొఱబాటుచేనైన నీకరచరణాద్యవయవముల చేతనేజీవికిం బ్రీతిసేయకుంటిఁగదా! అట్టిపాపినేనిప్పుడు పరమేశ్వరుఁడా, పాలింపుమని సిగ్గులేకయేమని వేడుకొనఁగలను? అయిన నీశ్వరుఁడు దయాస్వరూపుఁడు. శరణాగతరక్షణ విచక్షణుఁడు. ఆ మహానుభావునకు భేదాభేదంబులు లేవు. కావున నీనిర్భాగ్యునకిఁక నార్తత్రాణ పరాయణుండగు నారాయణుండ పరమశరణ్యము. పరమేశ్వరా! (మూర్ఛపోవును, తెరపడును)

## 2 వ రంగము.

నర్మద, మాలతి, (ప్రవేశింతురు) దుష్టబుద్ధి పొంచి వినుచుండును.

నర్మ—కుమారీ! నేనిట్లంటినని యాయాసపడకు. నిన్నుఁజూచినవేళ యెట్టిదోకాని పొట్టనుబుట్టిన పట్టియందేని యిట్టి మమకార ముదయింపదుకదా! కావున, నామాట కాదనక వినుము. ఎక్కడనోయున్న సుమనోభిరాముఁడిక్కడ కెట్లువచ్చును? నీకేల యీపిచ్చి?

మా—నర్మదా!

గీ. లక్షలామడ లెడనున్న రమ[illegible]ఁ డుదయ
మొందఁగనె పద్మినీకాంత[illegible]ండ మలరుఁ
గాదె యనురాగ మన్నిటికన్న మిన్న
దూరమందున్న హృదయముల్ దూరమౌనె?

కావున,

గీ. నాదుహృదయంబు ప్రాణమానములు భక్తి
ధారవోసితి నాతండె దైవమనుచు
ముంచినను దేల్చినను గడుమంచిదె యిఁక
మనసు పెఱవారిఁ జేరదు మగువ నిజము.

మఱియును,

గీ. పరశుసంస్పర్శమైన నెప్పగిదిఁ గాంత
మినుము నాకర్షణముసేయు? నెలమిరాజ
శేఖరునిఁ జేరి చొక్కుడు చిత్తవృత్తి
హేయజనయుక్తి కలఁత నొందించు నెట్లు?

(చప్పున దుష్టబుద్ధి ప్రవేశించి)

దు—ఏమంటి వేమంటివి? కాంతా! నీవింతచరాధీనురాలవయ్యు నాయంతవాని నావంతయేని సరకుసేయక తూలనాడుచుంటివి.

మా—ఓరి యవివేకుఁడా!

గీ. మానకవచంబుదాల్చిన మానవతులు
నస్వతంత్రులుగా రెట్టి యాపదలను
వహ్నిఁబడవైచి యూదినఁ బైనఁబైన
వన్నెమించక చెడునె సువర్ణ మెచట?

దు—వనితా, వెనుక ముందు నాలోచింపక యూరక వాగుచుంటివి. సకలమానవాధీశుల పెక్కుబొక్కసంబులఁగల రొక్కంబు నాయిక్కనుండు. చేతఁజిక్కిన మానికంబు నక్కఱలేదను వెంగలియుండునే?

మా—ఓరినీచుఁడ[illegible]నీవెంత? నీసిరులెంత? ఇట్టి దుర్బోధనకు లొంగుదునను కొంటివే? ని[illegible]నకుఁ జెడలంటునా[illegible] నీయట్టి నరపశువునకు సిరు లనర్థము లాపాదించునుగదా!

చ. సిరు లని చెప్పిరావనుట సిద్ధము [illegible]బ్బర కాయనీళ్ళ మా
దిరిఁ; [illegible]నువేళ నల్లై కరితిన్న కపిత్థఫలంబుమాడ్కి; న

స్థిరములు మబ్బు నీడలగతిం జలబుద్బుద మాయువెందుకీ
నరకపథంబు ? ధర్మమెడల న్నరజన్మ మనర్ఘ హేతువౌ.

దు—(కోపముతో) చాలుఁజాలు !

గీ. చెడెదవెవ్వఁడు విడువుమీ చెనటిపూనిక
మంత్రముల కెందు రాలునే మామిడు లిల
నహహ నెలనిల్చెగదువు నీవపుడెగాని
చక్కఁబడవేమొ చూచెదఁ జంచలాక్షి.

(అని పట్టనుంకింపఁగా మాలతి పరుగెత్తి నిష్క్రమించును)

నర్మ—(అడ్డుపడి) ఇది యేటివింత ! ఇచ్చినగడువు ముగియకమునుపే యింత యాతురమా !

దు—నర్మదా ! ఇది మిగుల సాహసికురాలని యెంచెద. మంచిమాటలకు మార్గమునకు వచ్చునట్లులేదు. అయిన నేనొక పొఱపాటుపడితిని. భీమవర్మ నాకుఁ బరిపంథుఁడుగ నేర్పడునేమోయని వృథా వాని చెఱయందునిచితిని. సుమనోభిరామునిపై దీనికి వలపున్న సంగతి నేడెఱింగితిని. ఆసుమనోభిరాముఁడున్నట్లుండి యగుపడక పోయినాఁడఁట.

నర్మ—అయ్యో ! పాపము ! ఏమికారణమో !

దు—అది మనకేల ? ప్రకృతము మనకార్యానుకూలమున పాటింతుము నితము సుమనోభిరాముఁడు పిచ్చిపట్టి గతించినాఁడని నీ వాసుదతికిం దెలుపుము అప్పటికి వానిపైయాస మానుకొనును.

నర్మ—ఇది యొకవేళ నిజమైనను మన కల్పితమని యమ్మగువ నమ్మదు.

దు—నమ్మిననెంత ? నమ్మకున్ననెంత ? నీ వాపనిచేయుము. వెళ్ళుము.

(నర్మద నిష్క్రమించును)

(తనలో) ఔరా ! ఏమి యీ చిత్రము

ఉ. ఎంతటియోధులైనఁ జనవిచ్చివచింప భయాత్ములౌదురే
నంతటివాఁడ నన్నుఁ గడు నల్పునిగా నదలించినైచె నీ

యింతి యిదేటివింత మరుఁడెంతటి యోధ! భళీ! సుమాస్త్రముల్
రంతులొనర్ప యోధులె దురంతవిచింతఁ దపింతురే కదా!

(నిష్క్రమించును.)

3 వ రంగము, అడవి మార్గము.

(సన్యాసివేషధారియగు సుమనోభిరాముఁడు భల్లూకభట్టును ప్రవేశింతురు.)

సుమ—మిత్రమా!

భ—బాగు! బాగు! బుద్ధిహీనుల కెంతబోధించిననేమి. నిజముగా నీనుండి యనర్థమున్నది.

సుమ—అదేల మిత్రమా?

భ—అదిగో! మఱియు నదేపాట. మిత్రమా మిత్రమా యనునపుడెల్ల నాగుండెలు తటతట లాడుచుండును. నేను శిష్యుఁడనను మాట మఱచితివే? నారాయణస్మరణ యేనీటఁగలిపితివి? ఆపటము నాచేతికైననిమ్ము. ఎవ్వరైనఁజూచినఁ బ్రమాదముసుమీ.

సుమ—నామనోహరాంగి నారుల కెట్లీయను.

భ—"నావిష్ణుః పృథివీపతిః" అను వచనము నిక్కమయినచో నీమనోహరాంగి మామనోహరాంగియే మామనోహరాంగి లోకమాతయగుటఁజేసి నాకు మాత్రమూ బాధ్యత యెందులకు లేదు? కావున, నీహృదయంగమమగు పటమును మాతృభావమున శిరసా వహించెద నిమ్ము.

సుమ—అట్లయినం గొమ్ము. పదిలముసుమ్ము (అని బట్టలోఁజుట్టి వాని తలపై నిడును.) ఎవరో తెరువరులియ్యెడ వచ్చుచున్నట్లున్నది.

భ—వచ్చిన నాకేమి? దొంగవేషముధరించిన నీకు భయముకాని—

సుమ—చాలు నూరకుండుము. నీపుణ్యము.

(బాటసారులు ప్రవేశించి భల్లూకభట్టుం గాంచి)

బాట—ఎవరయ్యా మీరు?

భ—మేము మార్గస్థులము. మీదారిని మీరు వెళ్ళుండి.

బాట—ఏమండీ ; యింతమాత్రమునకే కోపమా ? మీ రేయూరికి వెళ్ళుచుం
టిరో చెప్పినమాత్రాన నోటిముత్యాలు రాలిపోవునా ?
భ—మఱియు నదేమాటేనా ?
బాట—అయితే మీచిత్తము. ఆచెట్లదాపునమాత్రము మెలకువగాఁబొండు.
(ఆమాట వినినంత చివుక్కున వెనుకకుఁదిరిగి భయ వినయములతో)
భ—అయ్యలారా ! నిలువుండు నిలువుండు. అదేమో విశదముఁగా సెలవిండు.
బాట—" అందితే జుట్టు నందకున్నఁగాళ్ళు " మంచి గట్టివాఁడవయ్యా !
భ—క్షమింపుఁడు. నేనేమో మార్గాయాసముచేత నట్లంటిని. అదిగాక మాస్వా
ములవారు నన్నూరూరుఁ ద్రిప్పి చంపుచున్నారు.
బాట—(కపటసన్యాసింగని) ఓహో ! మహానుభావులారా ! మా యపరాధ
ము క్షమింపుఁడు. (అని ప్రణమిల్లుచున్నారు)
సుమ—నారాయణ, నారాయణ, నారాయణ.
బాట—స్వాములవా రెచ్చటికిఁ జనుచుండిరో ?
భ—కన్యాకుమారికి, కన్యాకుమారికి.
బాట—ఈమహామహు లాశ్రమముఁ దీసికొని యెన్నినాళ్ళయినది ?
భ—అబ్బో ! ఆశ్రమమా ? చాలాదినములాయెను. (ఆత్మగతమున) ఈశ్ర
మ మెప్పుడు నివారణమగునో తెలియదు. కాని, (ప్రకటము) " ఆచెట్లదా
పున " అంటిరెందులకు ?
బాట—ఇంతకుమును పే మాకు బాగుగా ప్రహారణములు తగిలెను. ఏమిదొంగ
లు ! ఏమిదొంగలు !
భ—(సుమనోభిరామునింగని) స్వామీ ! నేను రాను నాయనా ! నేనురాను. బ్ర
తికియున్న బలుసాకుఁదిని జీవింతును.
సుమ—వృథా భీతిలనేల ? " గోచిపాతరాయఁడు దొంగలమిండఁడు " డని వా
రుమాత్ర మెఱుంగరా ?
బాట—(భల్లూకభట్టుతో) మీ కేమట్టివస్త్రాభరణములుకలవు. అయిన మీతల
మీఁద దిదియేమిటి ?
భ—ఇది స్వాములవారి పారాయణగ్రంధము, సూత్రభాష్యము. ఇది పోయి
నవారిప్రాణములు పోయినట్లే. నిలుచున్నను, గూర్చున్నను, వారికి దీనిపై
ధ్యానమే.

బాట—మహానుభావులు! మహానుభావులు! స్వాములారా! మమ్ముల ననుగ్ర
హింపుఁడు (అని నమస్కరింపఁగా)

సుమ—నారాయణ, నారాయణ, నారాయణ. (వారు నిష్క్రమింతురు)

భ—ఇఁక మనగతియేమి?

సుమ—నేనుండగా నీకువచ్చిన భయమేమి?

భ—నాయనా! నేనొక యడుఁగైనఁ బెట్టను. నీవు చంపిననుసరే!

సు—అయిన నాసెలయేఱుదరికిం జని కాలోచితకృత్యములఁ దీర్చుకొందము.

(నిష్క్రమింతురు)

దుష్టబుద్ధి, నర్మద, (ప్రవేశింతురు)

దుష్ట—నర్మదా! నీవాఁడు దానవయ్యె నిష్ప్రయోజనము.

న—ప్రయోజన ముండిన నేనీయాఁడుపుట్టువు పుట్టుదునేల?

దుష్ట—సరేకాని, మాలతి కేలాగున్నది?

న—ఏమనిచెప్పుదును? సుమనోభిరాముఁడు పిచ్చిపట్టి గతించెనని చెప్పినపుడి
య మొదలు నేఁటివఱకు మూసినకన్ను తెఱపిలేక యఖండమైన జ్వరము
చే నింతింతనరాని బాధపడుచున్నది. అన్నోదకము లిందవు. ఇదిస్థితి.

దుష్ట—ఆలాగా! మాకు దూరప్రయాణమొకటి తటస్థించినది. ఇఁకఁబదునైదు
రోజులకుఁగాని వచ్చుట కనుపడదు. అయినఁ దగినయేర్పాటుచేసి వెళ్ళె
దను. జాగరూకతతో నాబాలికం గనిపెట్టి యుండుము. పొమ్ము.

(ఇరువురు నిష్క్రమింతురు)

4 వ రంగము, అడవిమార్గము.

సుమనోభిరాముఁడు, భల్లూకభట్టును బ్రవేశింతురు.

భ—రాత్రికావచ్చెను. మంచి యడవిలోఁ దగులుకొంటిమి. ఇంకెట్లు?

సుమ—ఈరాత్రి యిందేపరుండి వేకువనే వెళ్ళుదము. సమ్మతమా?

భ—సమ్మతము లేకుండినఁ జేయునదేమి? నీచేతిలోఁజిక్కితినిగదా! కొంపవి
డిచి నేటికి నాల్గుమాసముల పదునేడుదినములు. తెల్లవాఱిన నవమి, శుక్ర
వారము.

సుమ——నీవీమధ్య పంచాంగము చూచుటలేదుకదా, నవమియనినీకెట్లు తెలిసెను?

భ——బ్రాహ్మణపుట్టుక పుట్టి యింతమాత్రము జ్ఞానములేదా? నెలవంకం గనుంగొనుము.

ఆ. మూఁడుపాళ్ళు సురలఁగూడి తాఁ జవిచూచి
దివిజవిభుఁడు పూర్వ దిగ్వధూటి
కనిపియున్నవాఁడో యమృతంపు ఫేణి నాఁ
జందమామ చంద మందమాయె.

అదిగో! పిండికర్జకాయవలెనున్న చంద్రునిం జూడుము.

సుమ——చెలికాఁడా! నీద పొఱబాటు.

గీ. నింగికడలిని మేఘతరంగములను
మున్గి తేలుచు దాగిలిమూఁత లాడు
తొట్టిపడవది, యామిని తూర్పుమలకుఁ
బిగియఁగట్టెను, కాదు జాబిల్లిరేఖ.

భ——మన మీశాల్మలీతరువు క్రింద నీరాత్రి పరుండుదము.

సుమ——మిత్రమా! ఆలాగే చేయుదము. ఆ పట మిటిమ్మ్ము.

భ——ఇప్పుడాపట మెందులకు? పండుకొని నిద్రపోరాదా?

సుమ——కాదు- నీవు పండుకొని నిద్రించిన నేదైన దుష్టమృగమువచ్చి దానిని లాగికొనిపోవునేమో యని యడిగితిని.

భ——ఓయబ్బా! నాకది తట్టనేలేదుసుమా! నీవెంత సంపన్నుఁడవయ్యా! పటముపైనున్న యభిమానము నాయందు లేకపోయెనుగదా! నీ వెంతకైనను గట్టివాఁడవే.

సుమ——నెయ్యుడా! నీప్రాణమునకు నాప్రాణము. మనము చెట్టుమీదఁ బరుండినను మృగబాధ యంతగానుండదని తలంచెదను.

భ——నాయనా! నా చేతఁగాదు. క్రిందఁబరున్న మెకములొకవేళ రాకయేపోవచ్చును. గావున చావనుమానము. పైనపరున్నం దప్పక నిద్రలోఁ గ్రిందఁబడినఁ దలబ్రద్దలగును. మరణము స్వతస్సిద్ధము.

సుమ—అట్లయిన నిక్కడనే నాయొద్దఁ బరుండుము.

భ—పదిలము సుమా, ఇఁక నీభారము. ఏమాత్రము శబ్దమైనను దిగ్గన లేపవలెను. నానిద్ర యెఱుఁగుదువుగదా? (అని పండుకొనును)

సుమ—ఔరా! ఈవెన్నెలబయట—

భ—ఏమయ్యా! నిద్రపోనిచ్చెదవా లేదా? బాగు! బాగు! కఱుకురాలు ద్రొక్కఁ గాళ్ళన్ని చిదుపలై మండుచుండె. పచ్చిపుండు మేను. నిద్రపోదమన్న నీయుపద్రవ మాయె- (అని గుడ్డఁదీసికొని లేచును)

సుమ—ఏడ కిపుడు?

భ—(నమస్కరించి) రాకు మీదకైన- నీపుణ్యము. మృగబాధకైన నొప్పి కొందును. నీబాధ పడలేను. నన్నుఁ బలకరింపకుము.

సుమ—అయిన నీయిష్టము. నేనును శయనింతును.

భ—మహారాజవుకదా! (అని దూరముగా శయనించి గుఱ్ఱుపెట్టుచుండును)

సుమ—(బండుకొన్న యంతలో లేచికూరుచుండి) ఆహా! ఏమిది? ఎంతయత్నించినను నిదుర రాకున్నది. ఇట్టి వెన్నెలబయట, నిట్టి యేకాంతమున నా మంత్రిదేవత నన్ను నిద్రవోనిచ్చునా? ఈవెన్నెల చిచ్చున నా హృదయంబు వ్రేల్పకమానునా? ఓ నాహృదయమా! చిరపరిచింతుఁడనగు నన్నిచట విడనాడి, కనుల తమితీఱనైనఁ జూడని యామెలఁది వెంటంబడిచనుటుచితమా? ఆగు మాగుము—అది నా హృదయేశ్వరిధ్వనియా? కాదు, కాదు. కోకిల. కాదు, కాదు. ఉండు, ఉండు. (వినికి నభినయించి లేచి) ఆపూపొదం జూచెదను. ఇదేమి నామనోహరాంగి నావెంటనేవచ్చుచున్నదే? (తిరిగిచూచి) అయ్యో! నామైనీడయే నన్నే మఱించెను. అకటా!

మ. చెలియా! మారుఁడుపొంచి యిక్షుధనువుం జేనందె నింకెట్లనే
లలివాల్తూపులనించెనే చిలుక చెల్లాటంబు కాన్పించెనే,
కలకంఠధ్వని మించెనే యళుల ఝుంకారంబు నొప్పించెనే,
పలుచిక్కుల్దొడరింప హావిధి నినుం బంపించెనే మాలతీ!.

ఓరి మృగాంకా! రాజా! రాజు, రాజరాజు నవమానించుటిట్లా?

గీ. పాలవంటి కులంబున లీలఁ బుట్టి
తండ్రి ద్విజరాజ వరయుఁ గళాన్వితుండ
వహహ సన్మార్గవర్తివీ వమృతకరుఁడ
న్యాయమా యేఁచ నన్ను నిశాటవృత్తి.

అయ్యో! నీక్రూరకరంబులు కాలపాశంబులలీల భీతిఁబుట్టించుచున్న వేల? సరే నీవు కాలస్వరూపుఁడవే కదా!

గీ. పక్షపాతంబుఁ గని సమవర్తి కాక
కాళిమ లడంచి తెల్లని కళలు గాంచి
చూడ దాక్షిణ్యవృత్తి యించుకయు లేక
హరునితల మెట్టఁబుట్టిన యముఁడ వీవ.

అక్కటా! వీనిం దెలియక పెక్కండ్రు శీతకరుఁడందురు నిక్కముఁగా

క. నడురేయి పాంథులను వడిఁ
దడిబట్టల మెడలఁగోయఁదలఁచి మదనుఁ డీ
పిడిలేని వెండికొడవలి
నుడుగని రోసమున దాఁచె నుడుగణములలోఁ.

ఓ నాసౌబగులచిన్నారి! నీకై కానలంబడి కడగండ్లంబడుచుంటిఁగాని నీకీకాఠిన్యమేల?

సీ. ఇభరాజగమన నీ విందురా వెందుకే
పదములు చిగురులై పలుచనగునె?
మనసిచ్చి యొకమాటు మాటాడ వదియేల
పలుకులు చిలుకలై పాఱిపోనె?
మునిముసినవ్వుల మురిపెముం జూపవే
నగిన వెన్నెలచాలు నష్టమగునె?
తమియారఁ గౌఁగిటఁ దరుణిఁ గూర్చిన నీదు
భాహుమృణాళముల్ భంగపడునె?

చాన యీకాన నేగతిఁ గానకిటుల
నెంతొ వగఁగుంద గోరంత చింతలేక
యున్న దానవు తగునటే సన్నుతాంగి
తాళ నినుబాసి ధృతి చాలఁ దూలె బాల.

ఔరా! అదిగో వేఁగుచుక్క—పరమేశ్వరా!

(పండుకొనును)

భీమవర్మ ప్రవేశము.

భీమ— దీనదయాళూ! నాసంకెళ్ళ విడఁగొట్టించి యింతమాత్రమేని స్వేచ్ఛం గల్గించితివి. ఇది యొక వింత కాదు.

క. ఒకమాఱు నినుఁదలంచినఁ
జెకచెక భవబంధనములు ఛిన్నములగు నీ
కిఁక నిది యొక ఘనకార్యమె
సకలాంతర్యామి యనుపసంకెల లెడపన్.

మహానుభావా!

శా. నీవేదిక్కు ప్రపంచమం దఖిలము న్నీవే జగద్రక్షకా
నీవే దీనుల నెమ్మిఁ బ్రోవ జగతి న్నీకన్న వేఱున్నదే?
నీవే సత్య మనాది మూలము నిను న్నే నెంతవర్ణింప నా
కీవే యీశ్వర నీదుభక్తిఁ గృప నన్నీక్షించి రక్షింపవే.

దేవదేవా! కరుణించి నేఁగడతేరు సాధనోపాయముఁ జూపఁగదే! (అని రెండడుగులు వైచి) ఓహో! వీరెవ్వరు? ఇంత ప్రొద్దెక్కినను గాఢనిద్రాపరవశులై యున్నవారు. ఆమహానుభావుఁడు సిద్ధపురుషుఁడు గానోపు. కాదేని, సూర్యునిం దిరస్కరించు తేజంబున వెల్గొందునెట్లు? ఆర్తజనశరణ్యుఁడగు భగవంతుఁడే నన్నుద్ధరింప నిట్టివేషంబున భూమికిం దిగియుండునొండె. కానిచో, ఘుణాక్షరక్రమంబున నిమ్మహాపురుషుఁ డిక్కారణ్యమునఁ దటస్థించుటెట్లు? ఇతఁడాతని శిష్యుఁడని తోఁచెడిని. వీరు మార్గాయాసము

చే డస్సియున్నవారు. (భల్లూకభట్టు నిద్రలో కలవరించుచుండ) పాపమితఁడు దుస్స్వప్నముం గనెనుగాఁబోలు! మంచిది. హెచ్చరించెదను. (అని బట్ట లాగును)

భ—ఓయబ్బా! నాయనా! పులి, పులి! చచ్చితి, చచ్చితి! (అని లేచును)

సుమ—(తటాలున లేచి) ఏది! ఏది! ఏది!

భ—ఓయబ్బా! అమ్మమ్మా! (అని వెక్కి వెక్కి యేడ్చుచు రాజుం గౌఁగిలించుకొనును)

భీమ—(కపటసన్న్యాసికి సాష్టాంగనమస్కారము లొనర్చి) మహానుభావా! క్షమింపుఁడు. ఈబ్రాహ్మణుఁడు దుస్స్వప్నముం గని కలవరించుచుండఁగా నిద్ర లేపితిని.

సుమ—ఆలాగా? (అని నవ్వి) భల్లూకభట్టూ! ఎంత రాద్ధాంతము చేసితివి?

భ—(కన్నులు తెఱచి వడవడ వడఁకుచు) అయ్యో! ఇదేమో రాక్షసమాయ. నిజముఁగాఁ బులిని చూచితిని. కన్నులు దెఱవఁగానే మనుష్యరూపమును ధరించెను. ఇదేమో మాయదేశము. కాకున్నఁ గన్నులార మనముచూచిన చంద్రుఁడు సూర్యుఁడగుట వింతకదా!

సుమ—అవివేకుఁడా! రాత్రికడచెను. తెల్లవాఱెను.

భ—ఇంతలోనే?

సుమ—ఓయి! నీవెవరవు?

భీమ—నేను దిక్కులేనివాఁడను. పంచమహాపాతకుఁడను. అనుగ్రహింపుఁడు. (అని పాదములపైఁ బడును)

సుమ—(వాని లేవనెత్తి) శుభమగుఁగాక. ఓయి! దాపున ముఖప్రక్షాళనాదికమునకు జలాశయముకలదా?

భీమ—కలదు. దయచేయుఁడు. (అని వారికి దారిఁజూపును, సరోవరము దాపునకుం జని) స్వామీ! (అని ప్రణమిల్లి) శరణు, శరణు. నన్నుఁ గృతార్థునింజేయుఁడు-

సుమ—(లేవనెత్తి) నీకేమి కావలెను?

భీమ—మంత్రోపదేశము.

భ——అట్లయిన నిక్కడకురమ్ము. (కడకుఁ దీసికొనివెళ్ళి) నాకు మా పిన్నమ్మ చెప్పిన తేలుమంత్రము చెప్పెదను.

భీమ——అయ్యా! నీతేలుమంత్రము, పాముమంత్రము నాకేల? జన్మరాహిత్యకరమగు మంత్రము నపేక్షించితినిగాని——

భ——ఏమంత్రమయిననేమి? భక్తిప్రధానముగాని——

భీమ——అయ్యా! నాకట్టిమంత్ర మక్కఱలేదు.

భ——అక్కఱలేకున్న మానితివికాని స్వాములనారు పారాయణము చేసికొనుదాక వారిని తొందరపెట్టకు. ఇక్కడకురమ్ము. అంతలో నాచమనముచేసి సంకల్పముఁ జెప్పుకొనుము.

భీమ——చిత్తము. (అని పాదప్రక్షాళన మొనర్పఁగా)

భ——కేశవ, నారాయణ, మాధవ, దక్షిణయున్నదా? నీగోత్రము?

భీ——కౌశిక గోత్రము.

భ——పేరు?

భీమ——భీమవర్మ. (అనఁగానే యదరిపడి)

భ——అయ్యో! చచ్చితినోయి. నాయినా! సుమనోభిరామా! భీమవర్మా! భీమవర్మా! నీదక్షిణవలదు. దక్షిణవలదు. ప్రాణములతోనన్ను విడిచిపెట్టుము.

సుమ——(కాషాయవస్త్రములోనుండి చంద్రాయుధము వెలికిఁదీసి గొబ్బున భీమవర్మపైఁబడి క్రిందద్రొచ్చి) ఏమిరా! నీవు భీమవర్మవా? చోరుఁడా! వంచకుఁడా! కులపాంసనుఁడా! ద్రోహీ! ఇప్పుడ నీకుత్తుకఁ గత్తిరించెద. ఇఁకనెక్కడకుఁ బోయెదవు?

భీమ——మహానుభావా! రక్షింపుఁడు. అభయమిచ్చియునన్నిట్లు చేయఁబాడియే?

సుమ——అయిన మాలతినేమిచేసితివో చెప్పుము. చెప్పకున్నఁ జెక్కుచెండాడెదను.

భీమ——అన్నియు నివేదించెదను. మన్నింపుఁడు.

సుమ——అట్లయిన లెమ్ము. (అని లేవఁదీయును. భీమవర్మ చెవిలో నేమో చెప్పుచుండఁగా వినికి నభినయించును) అయిన నాదుష్టబుద్ధియుండునదెచ్చట?

భీమ——వాఁడిప్పుడిచ్చట లేఁడు. అనతిదూరమున నానిదుర్గమున్నది. (అని చెవిలో)

సుమ——భీమవర్మా! నీవు భయముపడకుము. చెప్పినది యర్థమాయెను. నేనంతయు వివేకముగా వర్తింపను. నీకాచింతవలదు. నీవు చప్పున వెళ్ళి నా సేనా

పతి వీరసేనునిఁ దగినపరివారముతో వెంటఁబెట్టుకొనిరమ్ము. మాళవభూపాలునికి వెంటనే యీవార్తఁజెప్పియుండి దుఃఖోపశాంతిం జేయదగునని నామంత్రి సుమంత్రితో నాయాజ్ఞగాఁ జెప్పుము.

భీమ—సార్వభౌమా! నేనొనర్చిన దోసములకు నన్నెవరుపట్టిదండింపకుందురు?

సుమ—నీకాభయమువలదు ఈనాముద్దుటుంగరముం గొని చనుము. (అనియుంగరము నిచ్చుచు) దీనింజూపిన వీరసేనుఁడు నిన్ను బాధింపక గౌరవించును. వెళ్లుము వైళంబ.

భీమ—చిత్తము. చిత్తము. (అని నిష్క్రమించును)

సుమ—మిత్రమా! మన మాసరోవరము కురంగట నొకకొంతవడి విశ్రమింతము. ఇచ్చట నెండ మెండు.

(నిష్క్రమింతురు,)

(తెర పడును)

# మాలతీనాటకము.

## షష్ఠాంకము.

### 1 వ రంగము సరోవరము.

(సుమనోభిరాముఁడు భల్లూకభట్టును ప్రవేశింతురు)

సుమ—ఔరా! ఈసరోవర మెంతమనోహరము!

ఆ. సత్కవీంద్రవాక్య సరణి గంభీరమై
సాధ్వచరితకరణి స్వచ్ఛమగుచు
సంయమీంద్రముఖము చాడ్పున శాంతమై
పొలుచు నీకొలంకు చెలువ మహహ!.

భ—నిక్కము. నిక్కము. చెలికాఁడా! ఇయ్యెడం బరికింపుము.

గీ. పిల్లయలలకు నల్లాడు తెల్లగలువ
పైన తెవ్వన రాయంచ వ్రాలినంతఁ
దూగుటూయెల లూపఁగాఁ దొడఁగె దానిఁ
బ్రియునుపచరించు పద్మినిరీతి మిత్ర.

సుమ—బాగు! బాగు! నెయ్యుఁడా!

గీ. కలువమొగ్గల నంచలు గరులుసాచి
వ్రాలుటయుఁజూడ మీసరో వరము వెలసెఁ

బరపురుషుఁ గన్నఁ గౌఁగిలింపఁ బైటచెఱఁగుఁ
గప్పి మఱుఁగిడు నుత్తమాంగన విధమున.

భ—ఈ హ్రదంబున నాయుస్సుఖంబులఁ దీర్చుకొనెద. (అని జలావతరణ మభినయించును)

సుమ—నేను నాప్రాణలక్ష్మిని లక్ష్యానుసంధాన మొనర్తు. (అని పటమును గైకొని చూచుచుండును.)

నర్మద నీటికడవంగొని ప్రవేశించును.

న—(తనలో) ఆహా!

గీ. చిన్నతనముననే యిన్ని చిక్కులనిడి
బాల యిటువాసెనే నీ క కాలమరణ
మకట! హతవిధి; యిట్టి యత్యధికరూప
వతిని సృజియించి యడవిలో మృతివిధించె.

కటకటా! ఇఁక నెన్ని చిక్కులొనర్చిననేమి? నాప్రాణసఖి నా కెట్లుదక్కును? పుట్టినఁగండు సుకుమారశరీర మావిషజ్వరతాపమున కోర్చునెట్లు? హా! మాలతీ! నీభాగ్యమున క్షేమందును? నిన్నెడబాసి యెట్లుందును? అక్కటా! ఆమూర్ఖుఁడు నిష్కర్షించుకొన్న లగ్నబల మిట్లుండెఁగా? ఇఁక నేమిగతి? మనోరోగమునకు మందేది? (ముందుకునడిచి) ఓహో! వారెవ్వరు? మార్గస్థులా?

గీ. ఎవ్వరాపాంథు? లిందుల కేగుదేర
నిందుచోద్యము; నూటేండ్లు నిండెనొక్క
లీలఁ బులియున్న పొదఁజొచ్చు లేళ్ళపగిది
వచ్చి రిచటికి; వీరిని హెచ్చరింతు.

పాపము! వీరెవ్వరో దారితప్పి యిచ్చటికివచ్చిరి. వీరి యదృష్టవశంబున దుష్టబుద్ధి యిక్కడ లేకుండెను. ఉండిన, నెంతప్రమాదము! అనతిదూరంబున నాబాపఁడు ముక్కుఁబట్టుకొని జపముఁజేయుచున్నవాఁడు. ఈ నైపున నున్నతఁడు.

గీ. తరుణ లావణ్య సత్కళాధాముఁ డితఁడు
చూడ మిఱుమిట్లుగొల్పె నాచూడ్కి కహహ!
నియతి యతిచంద్రుఁడగు మహానిర్మలాత్ముఁ
డితని సేవింప దురితము లెడలకున్నె?

ఔరా! అనంతకోటి జన్మ సంపాదిత పుణ్యపరిపాకముచేతనే యిట్టి సిద్ధపురుషుల సందర్శనము లభించుట. ఈమహాపురుషుఁ డొకించుకయేని చలింపని మనస్సుతోనేమో లక్ష్యానుసంధాన మొనర్చుచున్నవాఁడు. నారాకనైన నెఱుంగఁడు. ఇటునటు తిరిగియైనఁ జూడఁడు. ఒకవేళ నిమ్మహాత్ముఁడు దివ్యౌషధసిద్ధుల నెఱుంగునుగాఁబోలు! అట్లయిన నీతనికిం బ్రాణప్రదానంబు సేయుదు. మఱియు నీతనిచే నాచెలికిం బ్రాణంబులఁ దెప్పింతు. (సమీపించి సుమనోభిరాముని చేతిలోని పటముం గని, నివ్వెఱఁగున)

గీ. ఏమిచిత్రము! మాలతి నెవరువ్రాసి
రిందు నాప్రాణసఖిని బూర్ణేందుముఖిని

సుమ—(తటాలున తిరిగిచూచి)
ఎవరు నీవిట్లుపల్కెఁగ నెవర వీవు?

న— మేలు మేలిది కడులెస్స! మీర లెవరు?.

సుమ—అమ్మా! నీ వెవరవు?

న—ఇదికదా గట్టితనము! "పాపమని కూర్చుండుమన్నఁ బందిటివాసాలు లెక్కపెట్టెనఁట" మాయింటికివచ్చి మాపేరడుగుటకుమీరెవ్వరు? మా మాలతిపటము మీచేతి కెట్లువచ్చెను?

సుమ—ఇది మీమాలతిపటమా?

న—మఱేమి? నేనంత గ్రుడ్డిదానను గాను.

సుమ—(భల్లూకభట్టుం జీరి) మిత్రమా! ఈచిత్రము చూడు.

భ——(తిరిగిచూడకయే) ఏమయ్యా! యీపీడ! సంధ్య జపము ఒక్కటియును వలదా? ఎప్పుడును నీచిత్రముఁ జూచుచుండినఁ జాలునా? "తా మునిఁగినది గంగ, తావలచినది రంభ."

సుమ—మూర్ఖుఁడా! ఇటు తిరిగిచూడుము. ఈస్త్రీ మాలతియనుచున్నది.

భ—(తిరిగిచూచి) ఏమి మాలదియా?
సుమ—మాలది కాదు. మాలతి- మాలతి.
భ—మాలతి? ఏది? ఎక్కడనున్నది?
న—ఎక్కడనున్నను దానియాస మీ కెందుకు?

గీ. నాదునెచ్చెలి కచ్చెలి కేదొ యకట
వికటమై తోఁచె జ్వరదోష మిఁక నదెట్లు
బ్రదుకునో దైవమే తోడు బాలఁబాసి
యెట్టు లేనుందు నేమందు నేదిమందు.

సుమ—ఏమి? ఏమి? మాలతికిజ్వరమా? విషజ్వరమా? నాజీవరత్నమునకు-నాహృదయసంజీవినికి జ్వరమా? జ్వరమా? జ్వరమా? హా! సుమనోభిరామా! ఇఁక నీవేలబ్రదికియున్నావు! (అని మూర్ఛిల్లును)

న—(భల్లూకభట్టుం గని) అయ్యో! ఇతఁడు సుమనోభిరామచక్రవర్తియా? అయ్యో! అయ్యో! నేనెంతటి యపచార మొనర్చితిని! స్వామీ! మీ రితనినోదార్పుఁడు. నేనిప్పుడే వెళ్లి నాప్రాణసఖికి నీవార్తఁ దెలిపి పునర్జీవితం జేసెద. ఇది యపాయస్థలము. ఆగుహలోనికిం గొనిపోదము. రమ్ము. (ఆకార్య మభినయించి) నేవచ్చువఱకు మీరిచ్చటనుండి కదలితిరేని మీప్రాణములు మీవి కావుసుఁడీ, (నిష్క్రమించును)

సుమ—(సేదదేఱి) అక్కటా! నాసుందరాంగీ! నినుంజూచుప్రాప్తి లేకపోయెనే! నీనగుమోము గానక, నీజిలిబిలిపలుకులు వినక, తపించి తపించి, తుదకు నీవనాథవై దుర్మరణము నొందుచుండఁ జేయునదిలేక వ్యర్థుఁడనై నేనుమాత్ర మెట్లు భూమికి బరువుగా జీవింపఁగలను? మిత్రమా! ఇఁక నాయాస నీకు వలదుసుమా, నీవిప్పుడే వెడలి మాతల్లికి నాపైఁగల మమతం దొలఁగింపఁజేయునుపశమనవాక్కుల నామె నూఱడింపుము. ఓమాలతీ! నిన్నుఁ బొందితోఁ గలిసి సుఖించుట కవకాశము లేకపోయెనుగదా! కానీ, స్వర్గలోకమందైన నదియెట్లు సిద్ధింపదో చూచెదఁగాక. (ఖడ్గముఁ గైకొనును)
భ—(ఎత్తినచేతిఁబట్టుకొని) సుమనోభిరామా! ఏమిది? ఇదేటిసాహసము?

సుమ—వదలు. వదలు. ఇది యేటిసాహసమే?
భ—చెలికాఁడా! ఆత్మహత్య శూరధర్మమా?
సుమ—అయిన నెత్తినకత్తి నేమిచేయమంటివి?
భ—క్రింద వేయుమంటిని.
సుమ—ఇదిమాత్రము శూరధర్మమా?
భ—అయిన నాగొంతు నతికెదవా యేమి? బాగు బాగు!

(నర్మద ప్రవేశించి తనలో)

సీ. శ్రీచక్రవర్త్యాఖ్య సిద్ధమంత్రంబయి
ప్రబల దేహాయాస భరమునడఁచె
రాజశేఖర నామ రసపానరతిమహా
భీలనైవస్వత భీతిమాపె
నిను ననుగ్రహవృత్తి మనప్రభావము
కమలినికిని ముఖ కాంతిఁగూర్చెఁ
జతురాస్యధీరసచ్చాతురి స్మరియించి
నంత నాయుర్భాగ్య మలరఁజూపెఁ
గీ. రాజుపేరన్నమాత్రాన రాజవదన
నిండుకనుగల్వలను విచ్చి నీరునించి
దెసలఁబరికించె, వినెఁ జాలఁ దెలివితోడఁ,
బాసె నపమృత్యు, విఁక బ్రాణభయము లేదు.

భ—(నర్మదంగని రాజుతో) అదిగదిగో! రాజరాజా! ఆమగువ.
సు—ఏది యేది? (నర్మదంగని) అమ్మా! మాలతి కెట్లున్నది? ఎందున్నది?
న—అయ్యా! తొందరపడకుఁడు. భయములేదు మీ నామమంత్రోచ్చారణచేత నే, యంతటివిపద్దశలో నున్ననాచెలి సంజీవినిచేసౌమిత్రియుంబోలె,

గీ. కదలెఁ గనువిచ్చెఁ జూచె సైగలను బిల్చెఁ
జేయిపైఁజాచెఁ జెంతకుఁజేరఁదిగిచె

లేచెఁ గూర్చుండె మాటాడె లేమయుడిగ
వినెను దమకించెఁ దోడితెమ్మనెనునిన్ను.

సు—ఏమిరయేమి ! మాలతి నన్నుఁ దోడ్తెమ్మనెనా ?

న—(చెవిలో- చక్రవర్తి తలనాడించుచు నాశ్చర్యవిషాదముల నభినయించుచుండును)

సు—కోమలీ ! నిక్కమా ? నిక్కమా ? ఆ చక్కరబొమ్మకు నాపై మక్కువ కలదా ?

న—మాటలేల,

ఉ. పాటలగంధి నీదు నెడఁబాటున నోటికిఁ గాలకూటమై
పాటిలఁగూడు, ఱెప్పలకుఁ బాటొకయింతయులేక యెప్పుడున్
బాటలునీదుమాటలుగఁ బాడుచు భూతముసోఁకినట్లుబ
ల్పాటులఁగంది తానకట బాళిఁదపించు నృపాలచంద్రమా.

సు—అట్లయిన నేను ధన్యుఁడనే ఓచిత్తమా ! శాంతింపుము. శాంతింపుము.

గీ. చిత్తకీరమ ! యుడుగు నీ తత్తరంబుఁ
గ్రొత్తవాఁడనె ? ఆకొమ్మ క్రొత్తకాదొ ?
తెలిసె నీపక్షపాతము మెలఁగుమింకఁ
గలికి కౌఁగిట నినుఁగ్రుచ్చి గౌరవించు.

పొలఁతీ ! నాప్రాణరత్న మెందున్నదో చూపి పుణ్యముఁ గట్టుకొనుమా.

న—రాజశేఖరా ! మీరిట్లాతురపడవలదు. ఒకపనికిఁ దెగువమైఁ గడంగునప్పుడొడలంతటం గన్నులువలయును. నిఖిలశస్త్రాస్త్రసామగ్రి గలసాహసికులు మాటమాత్రమునవచ్చి పయింబడఁగలరు. కావున, మీరాగుహవదలి రావలదు. నేను రేపో యెల్లుండియో సమయ మాలోచించి యీ సుందరితో మాటలాడుట కను వమర్చెదను. తొందరపడకుఁడు. ఆ దుర్మార్గుఁడగు దుష్టబుద్ధి సామాన్యుఁడు కాఁడు.

ఉ. కూళుఁడు ధూర్తకోటి కనుకూలుఁడు సంతతపాంథమార్గ చే
తాళుఁడు పాతకాచరణధైర్యవిశాలుఁడు పుణ్యవర్తనో

న్మూలుఁడు శిష్టలోకహాననోన్ముఖశీలుఁడు చూడవట్టి చం
డాలుఁడు వీని క్రొవ్వెపు డడంగునో కానఁగరా దదేరికిన్.

కావున, పదిలముసుండీ ! నే వచ్చునంతవఱకీఫలములను, బిండివంటలను భక్షింపుఁడు.

భ—ఇకఁగూడ వేయుము. (అని మొడిబట్టును) వారికి వేఁటతెచ్చెదవా ?

సు—నాకక్కఱలేదు నీవుతిని తృప్తినొందుము.

భ—నీకు సంతోషముతోనే కడుపునిండినదిఁక వీనితో నేమి ?

న—నాకనుజ్ఞయా ?

సు—మరల నెప్పుడువచ్చెదవు !

భ—ఇవన్నియు నయిపోవునంతలోఁ జుమా.

న—ఆలాగే (నిష్క్రమించుచుండఁగా)

భ—ఇట్టివే మఱికొన్ని మఱచిపోకు.

సు—చెలికాఁడా !

భ—నన్నుఁ బలకరింపకుము. వీనిలో నొకతునుకయినను నీకీయను.

సు—ఓరి కుక్షింభరుఁడా ! ఆమాటకుఁగాదు. నాకిదిసుదివసమని చెప్పవచ్చితిని.

భ—నీకంటె నాకు మఱింత సుదివసము.

సు—మూర్ఖుఁడా ! నాకు భాగ్యకాలము సమీపించిన దెఱుఁగవా ?

భ—అల్పసంతోషీ ! నా భాగ్యము నాయొడిలోనే యుండు టెఱుఁగవా ?

సు—"బ్రాహ్మణో భోజనప్రియః" నీకుఁ దగినయర్థము నీకుఁదోఁచినది.

భ—నీయర్థములో బ్రాహ్మణార్థమునకు మించిన సారస్యమున్నదాయేమి ?

సు—(నవ్వి తనలో) "మొఱకువానికేల మొగలిపూవాసన," నాయానంద మీ మూఢుఁడెట్లూహింపఁగలఁడు ? తెలివిలేనివానికెంతబోధించినను "స్థలపిపీలికా" న్యాయమున మునుపటిత్రోవనే చనుచుండును.

క. వలపుల నాయిక మైకొనఁ
బులకాంకుర జనిత సుఖముఁబొందు రసికుఁడే
శిల లెన్నియున్న వెన్నెల
కలిమికి శశికాంత మొకఁడె కరఁగును గాదే ?

(ప్రకాశముగ) మిత్రమా ఈమాటవినుము.

భ—ఇవన్నియుఁ గడతేర్చినపిదప (అని తినుదు నిష్క్రమించును).

సు—మాట ! మాట ! (అని వెంబడించును).

## 2 వ రంగము దుష్టబుద్ధిమేఁడ.

(అంత నర్మద, మాలతి, ప్రవేశము).

మా—నీఋణమేనెట్లు తీర్చుకొందును. నెచ్చెలీ ! నీవు చెలివికావు-తల్లివి. మిత్తినోటినుండి నన్ను రక్షించితివి. నాదుఃఖములఁ దుదముట్టించితివి. నానర్మదా ! నావెతల నాథునికిం దెలిపి కరుణఁ బెంచి సమధికసౌఖ్యమొనఁగూడఁ గార్యసంఘటన సేయుమా. పుణ్యముఁ గట్టుకొనుమా. నీకునేఁ జెప్పఁదగినదేమున్నది ? నాప్రాణమానంబులు నీచేతిలోనున్నయవి. నాసఖీ !

న—నీవేల విచారపడెదవు. అలభ్యయోగముగా నీమనోవిభునిచ్చటికిఁ దోడ్కొనివచ్చిన భగవంతుఁడే ఆయింతకార్యముం గొనసాగించును. భగవచ్చిత్రము తెలియదుకదా.

ఉ. ఒక్కనిబుజ్జగించు మఱియొక్కఁడ నొక్కని నేడిపించు వే
ఱొక్కనిమీఁదఁ బెట్టు నొగి నొక్కఁడ వానిని గ్రిందఁబెట్టుఁ దా
నొక్కనిఁ జిక్కువెట్టు సిరినొక్కఁడ వానికి దోఁచిపెట్టు నీ
ఫక్కి విచిత్ర మెందు భగవంతునిచేత లెఱుంగశక్యమే ?

ఆ. వె॥ "పంకజాత" మునకుఁ బరిమళంబొనగూర్చెఁ
బరమహంస నడవిపాలొనర్చె
రజనిచరుని రాజరాజని తలఁదాల్చె
నౌర దైవచేష్ట లద్భుతములు.

మా—విషయమిట్లుండ వృథాదురభిమానగ్రహగ్రస్తచేతసులై మానవులొడలెఱుంగక;

క. పొడిచితి గెలిచితి నేనని
పుడమిం గడునుబ్బుచుందురు పురుషులు మఱివా

రిపుమల బడలిన దైవము
నొడలెఱుఁగక దూఱుచుందు రక్కడఁగి చెలీ.

సర్వేశ్వరు నాజ్ఞలేక యొకయాకు సయితమల్లాడదు. ఆ యనంతచక్షుస్సున కభేద్యమగు రహస్యమే బ్రహ్మాండమునం దేమూలనేనుండదు. కావున నరుల మొఱల నాలకింపకుండునా? నర్మదా నిజముగా నామనోహరుఁ డిచ్చటికి వచ్చినాఁడా, నావంతమాన్ప నట్లంటివా?

న—ఇంకను నీకనుమానమా?

మా—అట్లని నాచేతఁ జేయి వేయుము.

న—నిజము—(అట్లొనర్చును).

మా—క. మన్నింపుమమ్మ నర్మద
మిన్నక యనుమానపడుచు మిడికించితి ని
న్నెన్నఁగఁ గామిలలోదవిన
కన్నులకన్నియును బచ్చఁగాఁ గనుపడుఁగా!

ఓ నానెచ్చెలీ! నిన్నూరక చిక్కులఁ బెట్టుచుంటినిగదా. చీటికి మాటికి నీకు నాయాసముఁ గల్గించినందులకు మిక్కిలి లజ్జయగుచున్నది. ఎట్లయినను బ్రారంభించినపని పూర్తిసేయు భారము నీదే. నర్మదా! దయఁజేసి యిఁక నొకమాఱా మానవేంద్రునికడకుంజని రమ్ము.

న—ఇంత.

గీ. మానవేంద్రునిరాక బల్మాయగాని
పోయివచ్చెద నైన నేమాయెఁగాని
మంచిమాటలనేని యేమాయెఁగాని
తోయజాక్షిరో తెత్తు నీమాయ కాని.

కావున నీ వారవంతసేపు చింతవదలి నెమ్మదినుండుము. లోపలికిం జనుము. నే వెళ్లెదను. (నిష్క్రమింతురు)

సుమనోభిరాముఁడు, భల్లూకభట్టును బ్రవేశింతురు.

సు—మిత్రమా! అదిగో! సూర్యుఁడ స్తమించెను.

> గీ. రాజకంటకుఁ డగుచు సత్ప్రభలు మాపి
> కువలయంబును గుతకుత గుందఁజేసి
> యుత్తమస్థితు లడగించు నుగ్రకరుఁడు
> న స్తమించెను మిగుల దోషాతిశయము.

ఇఁకను నర్మద రాకున్నది. ఆఁడవారిమాట లెంతనిజమో కనుఁగొంటివే? ఇదంతయు మోసముకాదుగదా?

భ—వారికే తలఁదాఁకవలెగాని యొకరుచెప్పిన విందురా? నీ కెందులకయ్యా ఆగొడవయని చిలుకకుఁ జెప్పినట్లు చెప్పితినిగాదె? వింటివే? ఇప్పుడు తలగోఁకుకొనుచు నిలుచుంటివి. ఫలమేమి? పెద్దవారిమాట పాటింపనివారికి నట్లెట్లుకూడ యాయుష్కర్మ తప్పనివిధి.

సు—ఇఁక గతి?

భ—పికబలమే.

సు—బాగు! నాకట్టిపనికిఁ గాళ్లురావు.

భ—అల్పసంతోషివి. ఆమాయలాఁడిమాటలకు భ్రమించి, ఆయింతగారెము కోక, బూరెముకోక పోఁగొట్టుకొని నాకిప్పుడు పాఱిపోవుటకుఁ గాళ్లగయవని మిడుకుచుంటివి. నీకుఁ జూపులు నాకు మేపులు.

సు—తిండితిండియని యూరక నాలుక గుంజికొనుచుంటివేల?

భ—పిచ్చివాఁడా! అన్నిటికిని మొదటిది కడుపు. అది నీటికడవవలెఁ జల్లఁగనుండినఁగద, అన్ని గౌరవములు. దానింబట్టియే ముప్పదిమూఁడుకోట్ల దేవతలలో విఘ్నేశ్వరునకగ్రపూజ.

> క. కడుపే ఘనసంసారము
> కడుపే కైలాసమెదియుఁ గడుపునకెనయే
> కడుపే విపులవిత్తము
> కడుపే పెద్దఱికమిచ్చుఁగద లోకులకున్.

సు—బాగు! బాగు! కుడుపుఁబోతునకుఁ గడుపే పెండ్లాముఁట. అందుకనియా భార్యను విడనాడి నిశ్చింతముగానుంటివి?

భ—ఇద్దఱను గట్టుకొని నేనెక్కడ నఘోరింతును. కావున నొకదానిని దిగవిడిచి వచ్చితిని.

సు—ఆఁగుమాఁగుము. అదెవ్వరో వచ్చుచున్నట్లున్నది.

(నర్మద ప్రవేశించి.)

న—రాజేంద్రచంద్రమా! ఇటురండిటురండు. (నిష్క్రమించును)

సు—ఏమిరయేమి? (అని వెంబడించును)

భ—ఈమాటలడ్డులారయేమి (అని వెంబడించును)

[దుష్టబుద్ధి కోటకావలివారు, లింగఁడు గంగఁడు ప్రవేశింతురు]

లిం—గంగా! యజమానుఁ డింటలేకుండిన మనకెంతో హాయి. ఇఁక రెండు మూఁడు దినములు మనమాడినదేయాట, పాడినదే పాట.

గం—అయినను, లింగా! ఈకావలిపని గోజుపనిసుమీ! ఈ రాజుగారి బిడ్డను తెచ్చిననాఁటనుండి మనకు పనియెక్కువే.

లిం—ఇంతకు మనము పొడుచునదేమి? ఈకాఱడవిలోని కింకొక్కఁడు రాఁగలఁడా? మనము లాంఛనమాత్రముకాని— ఇప్పుడే సుకముగా నున్నామనుకో. లేకున్న వారివెంట నడవడవిఁ దిరుగవలసియుండునుగదా? మనదే అదృష్టము.

(నర్మద సారాయిబుడ్డిని బట్టుకొని ప్రవేశించును.)

గం—ఏమమ్మా! నేఁడు నేలఁ గాలూనక తిరుగుచున్నావు. ఆమె కేలాగున్నది?

న—గంగన్నా! ఇఁక మన కా యాసయెందుకు? అది గట్టెక్కుట యసాధ్యము.

లిం—ఈసంగతి మన యజమానునకుఁ దెలుపకపోయిన నెట్లు?

గం—అతఁ డెక్కడనున్నాఁడని చెప్పి యంపవలె.

న—నాకొడుకు వృషునితో నాఁడే వార్తనంపితిని. నేఁడో రేపోవచ్చితీఱవలెను.

లిం—పాప మాయనకుఁ గన్నులఁజూచు ప్రాప్తి యున్నదో లేదో.

న—ఏమో! మనకెట్లు తెలియును?

గం—చాలఁ జీఁకటిపడినదే. ఎక్కడకు వెళ్ళియుంటివమ్మా?

న—మూలికకు.

లిం—నీచేతిలోని దదియా?

న—కాదు. ఇది నాకొడుకు నెలక్రిందట మంచిసారాయిని- అదేయూరో మఱచితిని. అక్కడనుండి తెచ్చినాఁడు. మిగులమంచిది! మిగులమంచిది! పాప మాబాలికకుఁ గొంచెమిచ్చిన మంచిదేమో?

గం—మిక్కిలి మంచిదే. దాని గాటికక్కడకు వచ్చుచున్నది.

లిం—అది త్రావినఁ జచ్చినప్రాణాలు సయితము లేచి కూర్చుండును.

గం—ఒక్క సీసాయా తెచ్చినది?

న—అదేమి దారిద్ర్యము? గొప్ప సారాయివర్తకుఁడు మూఁడుబండ్లకు నిండుగాఁ గొనిపోవుచుండ నానాఁడతని దోఁచి కొల్లఁగొట్టుకొనిరాలేదా? మీ రెఱుంగరా?

లిం—ఆలాగటమ్మా? చూచితివే గంగన్నా? మనకీ నిర్భాగ్యపు కావలిపని దాపరమై యెట్టి మంచి లాభాలను జెడఁగొట్టినదో.

న—మీకు వలసియున్న దీనిం గైకొనుఁడు. ఏమి మహాభాగ్యమా? ఆ బాలికకు రెండు మూఁడు తొటుకులైనం జాలును. ఇంతకు నెంతకావలసియున్న నింటిలో నున్నది. (అని దాని నొసఁగును)

గం—(దానిం గొని) చల్లని తల్లివి! నిన్నెంతకొనియాడినను జాలదు.

న—ఉండుఁగాక! నే వెళ్ళివచ్చెదను.

(అని మఱుఁగుపడి యుండును.)

లిం—(గంగని చేతిలోని సీసాను బట్టుకొని) ఆగు మాగుము. అంతయు నీవే త్రావకు.

గం—మొదటగుటుకు నాది. పిమ్మటిది నీది. (అని దానిం బగలఁగొట్టి)

మధువృత్తము. పొగల్ బైకెగిరి పోవకముందే
దగల్ దీరనిది త్రావఁబసందే
తెగుల్ జేరదెట దేహమునందే
దిగుల్ బాపఁగల దీయొకమందే॥

(అని యిరువురు త్రావిపడియుండ, నర్మద వారికాళ్ళు పట్టిలాగి)

న—త్రాగినవారును, చచ్చినవారును సమానులే. ఇఁక వీరు పండ్రెండు గంటలవఱకుఁ బ్రక్కకైనఁబొర్లరు. తక్కిన కార్యభాగము నాలోచించెదను.

(నిష్క్రమించును)

(కోటలోఁగల మేఁడలో మాలతి ప్రవేశించును)

మా—నా ప్రాణసఖి!

గీ. ఇఁకను రాదేలొ నెచ్చెలి యెచటనేని
తామసించెనొ మఱచెనో దారితప్పె
నో విభుం డుండెనో యందు నుండలేదొ
సమయమబ్బెనొ లేదొకో సకియకందు.

మ. పతి దా వచ్చునొ రాఁడొ మాట వినునో పాటింపఁడో సత్కృపా
మతియై చూచునొ చూడఁడో కసరునో మన్నించి మాటాడునో
హితమాత్మం దలపెట్టునో తలఁపఁడో యేమందు? హా! నాపురా
కృతమెట్లున్నదొ యేమి సేయుదు మనఃఖేదంబు బాధించెడుఁ.

(దూరమున వచ్చు నర్మదం గని)

గీ. అదిగో! నర్మద వచ్చుచున్నది యిఁకెట్లు?
ఏమి చెప్పఁగనున్నదో యేమొ యిపుడు

(నర్మద ప్రవేశింపఁగని)

పడఁతి నీపని కాయయో పండొ తెలుపు

న—పండె నిక్కము

మా—నా నోము పండె నేఁడు.

న—మాలతీ! ఇఁక రమారమి కాలుగంటలో నీమేడకు దక్షిణపునైపునఁగల తోఁటలోని కతఁడు రాఁగలఁడు.

మా—కావలివారు చూచిన-

న—నీకాపాఊపేల? రేపు సూర్యోదయమువఱకు వారు సారాయిమైకముతో నేనుఁగులు త్రొక్కినను లేవక పడియుందురు. వారికి మద్యమునం దొక నైపువస్తువును గలిపి త్రాగించితిని.

మా—చెలీ! (అని కౌఁగిలించుకొని) ఏమి నీ సాహసకౌశలము!

న—ఇఁక నీవాకిటికిటికీకిలోఁగుండ నీకాంతుని రాక నిరీక్షించుచుండుము. నేనింతలో మన తోఁటలో నిచ్చెననొకటి నునిచి వచ్చెదను. (నిష్క్రమించును)

మా—(కిటికిటీలోఁ జూచుచుఁ గూర్చుండి) ఆహా! ఇది యేమో విపరీతముగా నున్నది.

గీ. ప్రియుఁడు రానున్నతఱి సమీపించుకొలఁది
నంతకంతకు మది కాఁగ వింతవేఁడి;
వానకురియఁగ నున్నెడ వసుధ కరము
నుడుకు మునుమున్నె వడగాలి యుడుకు దగిలి.

(అని విసనకఱ్ఱచే విసరుకొనుచుండును)

(సుచరిత్రుఁడు భల్లూకభట్టు ప్రవేశింతురు)

సు—ఆసుందరిసూచించిన మార్గమిదేగదా? ఔను. అదిగో ప్రాకారపుగోడ. అల్లదిగో దక్షిణంపునైపునంగల మఱ్ఱిచెట్టు. ఔనౌను. అదిగో గోడమీఁదికి వాలినకొమ్మ. ఆవలనైపున నిచ్చెనవేసియుంచెదననెను. చెలికాఁడా! నీవిక్కడనేయుండుము.

భ—నీపుణ్యము. నన్ను బ్రతికించితివి. దయచేయుము.

సు—(చెట్టెక్కుట నభినయించి దూరమున మాలతీముఖమును గాంచి)

గీ. పున్నమా నేఁడు కాకున్నఁ బూర్ణచంద్రుఁ
డెట్లు పొడసూపు నదిగో ఖండేందుఁడిచట
చంద్రు లిర్వురుగలరె యూర్విం దలంప
రెండుపక్షము లొక్కట నుండునెట్లు?

ఏమిది విపరీతము! ఇంచుక నిచ్చెనపైఁ గాలూది చూచెదను.

(అని రెండుమెట్లుదిగి మాలతిని గుఱింౘి)

సీ. అదిగదిగో నాదు మదిదొంగిలినయట్టి
కంతుచేతికటారి పొంతకారి
పోగలేని సెగవెట్టి పగలఁ గుందఁగ నెట్టి
కనుఁ బ్రామివచ్చిన కలువకంటి
ఘనుఁడ నేనని యొనర్చిన ప్రతిజ్ఞల నెల్ల
వంక పాల్సేసిన వన్నెలాడి
చెలువగుపుట్టముల్ చలపట్టి విడిపించి
కాషాయమిచ్చిన కఠినచిత్త

గీ. అదిగో! అరవాసిమబ్బులో నడఁగియున్న
నిండు రేవెల్గు నావెల్గు నెమ్మొగంబు
నీటుగా మేడకిటికిటీ చాటుననిడి
తొంగిచూచెడుఁ బలుమాఱు తోయజాక్షి.

(అని చప్పున నిచ్చెనదిగి మేఁడకెదుపున కుఱుకుచున్న సుమనోభిరాముని మాలతి చూచి)

మా—ఓ మహీపాలచంద్రమా!

సు—ఓశుభాంగి! నాదు జీవనచంద్రిక నామిటారి

మా—నామనోహర జగదభిరామవేష

సు—నాదుముద్దులచిన్నారి నాదురాణి

మా—నామనోరథఫలమ నానోముపంట

సు—నాదుకన్నుల వెన్నెల నాదుకలికి

మా—నాదు సుమనోభిరామ భూనాథసోమ

సు—నామనఃప్రియ మాలతీ! నాయకమణి.

సీ. నకియన్నికైరొల్ల సుకముల నెడఁబా
తిరిగితినే దేశ దేశములను

మా— పగళులు రేళ్ళు నీ పదపద్మముల మది
నిల్పి ధ్యానించితి నిదుర రోసి

సు— పొదలును గుహలును భూరిశైలంబులు
వెదకితి నెల్లెడల్ విసుకులేక

మా— అనయంబు నీరూపు కనులఁ గట్టినటుండఁ
గలవరించుచునుందుఁ గలఁతఁ జెంది

సు— వినుము చీమచిటుక్కు మనిన నీవని లేచి
బయ లప్పళింతు నీ భ్రాంతిఁ దవిలి

మా— నాథ నేనిటుల న నాథనై కడలేని
యిడుముల నడవులఁ బడుచునుంటి

సు—గీ. నిఖిలసామ్రాజ్యములఁ బాసి నీదుకొఱకు
భాసురాంగిరో! చూడు సన్యాసి నైతి

మా— అకట! నావ్రతఫల మిట్లు ప్రకటమగుట
కిట్టి వేషంబు నీకయ్యెనే మహీశ.

నా మనోహరాంగి! ఇఁకఁ గార్యభాగము నాలోచింతము. నే నానిచ్చెన దెచ్చి యీగోడ కానించి నీకీ కాషాయవస్త్రఖడ్గముల నందించెదను. నీవీ కాషాయమును గిటికిటీకమ్మలలో నొకనైపునంగల దానికిఁ బదిలముగాఁ గట్టి దిగవిడువుము. నేనంతలో నిచ్చెనం గొనివచ్చెదను. దీనింబట్టికొనుము. (అని కాషాయము నెగరవైవ, మాలతి దానిం బట్టుకొని, చించి కమ్మికిం గట్టును)

సు—(నిచ్చెన దెచ్చి, యెక్కి, ఖడ్గమును వ్రేలాడు కాషాయమునకుం గట్టి)
ప్రాణరత్నమా! దీనిం జేఁదుకొనుము.

మా—నాథా! ఇదిగో చేఁదికొంటిని. ఇఁక నేమిచేయుమంటిరి.

సు—కాషాయముఁ గట్టిన కమ్మి యొక్కటి దక్కఁ దక్కినవానిని ఖండింపుము

మా—ఆర్యపుత్రా! అట్లే యొనర్చెదను. మీరు ప్రక్కకుఁ దొలఁగుడు. (అని ఛేదించి) మఱి యేమి సెలవు?

సు—ఇఁక నేనా కాషాయ మూఁతగాఁగొని యెక్కివచ్చెదను.
(అని యెక్కుట నభినయించుచుండ)

మా—తిన్నఁగా! తిన్నఁగా! (అని కైయూఁతనిచ్చి పైకి లాగును)

సు—(హస్తస్పర్శసుఖ మభినయించి తనలో)

గీ. ఔర! యిది యేటివింత నా కూరకిటుల
నెపుడుఁ దటతటలాడదీ యెడఁద యహహ!
సుదతి సుకుమార దేహము సోకినంతఁ
గాళ్ళు తడఁబడె నెగపోత గానుపించె.

మా—(స్పర్శసుఖ మభినయించి, తనలో)

గీ. పఱచె నాదుఃఖములు పారవశ్య మొదవె,
లజ్జ మదిఁదోఁచెఁ గనుల కలత జనించె
మాఁన్పడియె మేను, దొరకొనె మౌన మహహ!
యీమహానంద బాహుళ్య మెందుఁ గలదు?

(అని యూరక మొగము వంచి నిలుచుండును)

సు—ఓ నా హృదయసంజీవినీ! పలుకకుంటివేల? నీవిట్లుండుటంగని యాత్మభవుఁడయ్యు నాకృతఘ్నుఁ డలుకమెయిం బాణములుకుల జడి నోడ లడలబడలించెడు. నెనరుంచుము. (అని కౌఁగిలించుకొని) తరుణీ! ఈ తప్పు మన్నింపుము.

గీ. ఒకటి రెండుఁగఁ జేయువా రర్విఁగలరు
మూలమూలల విలుకాండ్రు, మోహనాంగి!
రెండు నొక్కటిగాఁ జేయు దండిమగఁడు
పంచశరునాజ్ఞ కెదురెవ్వఁ పంచమందు

(తనలో) నేటికిఁగదా ధన్యుఁడ నైతిని. (నర్మద చప్పున ప్రవేశించి)

న—అయ్యో! అయ్యో! ఆ బాపఁడా దుష్టబుద్ధిచేతిలోఁబడెను. ఇఁక నేమిగతి! ఇఁక నేమిగతి!

సు—(సంభ్రమమున) ఏమి యేమి? నా ప్రియమిత్రుఁడా? భల్లూకభట్టా? ఎక్కడెక్కడ? చూపు చూపు. (అని నర్మదతోఁగలిసి నిష్క్రమించును)

మా—నాథా! వలదు. వలదు. పోవలదు. (అని వెంబడించును)

(తెరలో—నరుకుండి, పొడువుఁడి, కట్టుండి, కొట్టుండను కలకలము)
దుష్టబుద్ధి మెడఁద్రాకి సుమనోభిరాముఁడును, చోరుల నిద్దఱిని
బంధించి వీరసేనుఁడు భీమవర్మయును ప్రవేశింతురు)

సు—వీరసేనా! వీనికథ ముగిసినది. మీ రాముక్రీడలం జరక్రీడగా మేడ చక్రటికిం గొనిపోండు. భీమవర్మా! వీరసేనుని నీవెంటఁగొని చనుము.

వీర—భీమ—చిత్తము. చిత్తము. (నిష్క్రమింతురు)

(భల్లూకభట్టు ప్రవేశించి రాజు కాళ్ళపైఁబడి వడఁకుచు)

భ—మిత్రమా! నాపాలి దేవునివలె వచ్చి రక్షించితివి.

సు—చాలికాఁడా! లే లెమ్ము. నేఁజేయవలసినవని చేసితిని. దీని కింతేల? (లేవనెత్తును)

(మాలతి గొబ్బునఁ బ్రవేశించి రాజుం గౌఁగిలించుకొని)

మా—నాథా! మీరిట్లు జయశీలురగుట నాభాగ్యము

సు—(మాలతిని మన్నించి) నా మనోనాయకీ! దైవ మనుకూలించిన దుర్లభమె య్యది? సమయమునకు నాసేనానియు, భీమవర్మయు నేతెంచిరి. (భల్లూకభట్టుంగని) మిత్రమా! మాతల్లి ప్రభావతీదేవిని మేడకడకుం బిలిచికొని రమ్ము. (భల్లూకభట్టు నిష్క్రమించును)

మా—ఏమిరేమి! ప్రభావతీదేవిగారు వచ్చియున్నవారా?

(నర్మద తటాలునవచ్చి రాజు నడుగులపై వ్రాలఁగా)

సు—మా—ఏమిరేమి! లెమ్ము లెమ్ము. నిన్నెవ్వ రేమనిరి?

న—(లేవకయే) దీనజనమందారా! నాకుఁ బుత్రభిక్ష నిచ్చి రక్షింపుము. రక్షింపుము. నా కావృషుఁడొక్కఁడే కొడుకు.

మా—నెచ్చెలీ! లే లెమ్ము.

సు—నర్మదా! అభయహస్త మిచ్చితిని. మఱియు నియ్యెడంగల ధనమంతయు నీకొడుకున కొసంగితిని. (లేవఁదీయును)

మా—ప్రాణసఖీ! (కౌఁగిలించుకొని)

గీ. ప్రాణమానము లివియుఁ గాపాడి నన్నుఁ
బతినిగూర్చితి వతివ యూపాటిపనికి
నేల యడలెదు నీఋణ మెట్టుదీఱు
వారిధికి నేల మెత్తఁగా నేరితరము.

(ఒక బంటు ప్రవేశించి)

బం—రాజాధిరాజమకుటాంచితపాదపద్మా ! సకళత్రముగా మాళవపతి వచ్చియున్నవాఁడు. ప్రభావతీదేవిగారు మీ రాఁక కెదురుచూచుచున్నారు.

మా——నాతలిదండ్రులా ? ఇక్కడకు వచ్చియున్నవారా ? ఎచ్చటనున్నారు ? ఎచ్చట నున్నారు ? నాథా ! ఇది నిజమా ?

సు—ప్రాణరత్నమా ! సంతోషవార్తలన్నియు నాకుమ్మడి వర్షించుచున్నవి. వెళ్ళుదము. భటుఁడా ! దారి చూపుము.

బం—ఇటు ! ఇటు ! (అందఱు నిష్క్రమింతురు)

(భల్లాకభట్టు వివాహద్రవ్యములను మోసికొని ప్రవేశించును)

నాదిఅదృష్టము. మారాజుగారి వివాహ మిప్పుడే కానున్నది. ఇరుపార్శ్వములవారు వచ్చియున్నవారు. లక్ష్మీదేవి వనవిహారమరిగినట్లు, మహారాజులు వారికేమితక్కువ- తలఁచుకొన్నప్పుడే తలఁబ్రాలు. పాడూరిలోఁబోతురాజన్నట్లు యాజ్ఞికమంతయు నాదే. దారిద్ర్యహతము.

(అని వివాహసామగ్రి సన్నాహపఱచుకొని కూర్చుండును)

(సుమనోభిరాముఁడు, మాలతి, ప్రభావతి, మాళవుఁడు, భీమవర్మ, వీరసేనుఁడు, ప్రవేశింతురు)

(తెరలో- తూర్యధ్వని)

భ—లగ్నమాసమీపించినది. వధూవరులనుముందునిలుపుఁడు. (సంకల్పము చెప్పి, వారి పేళ్ళు చెప్పి) తారాబలం చంద్రబలం తదేవ- సావధానాభవంతు సావధానా (అని కొంగులు ముడివేసి పాదములు త్రొక్కించి, పాణిపీడనము చేయించును)

అందఱు— మందాక్రాంత.

ఓహోహోహో ! ముదమధికమై యుత్సవోత్కర్షముర్వ్యా
హాహాహూహూల్ శ్రుతిహితముగా హాయిగాఁ బాడుచున్నా
రాహాహాహా ! ధమధమధమా యంచు ఘోషించె భేరుల్

భ—(చంకలు తట్టుకొనుచు)

హీహీహీహీ గుమగుమగుమాయించె నొబ్బట్లు బూరెల్.

(తెరపడును.)